
ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




16-2-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు


వార్తాచిత్రాలు



ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన రాష్ట్రప్రచారకశాఖామంత్రుల సభకు వెళ్తున్న ప్రధానమంత్రి నెహ్రూ, ఉపప్రధాని సర్దార్ పటేల్.




"నేషనల్ కాడెట్ కోర్" కేంద్ర సలహాసంఘసభ్యులు; భారత ప్రభుత్వ రక్షణశాఖోద్యోగులు, రక్షణమంత్రి సర్దార్ బలదేవ్ సింగు మొన్న 5వ తేదీన సమావేశమైనప్పుడు తీసిన చిత్రం.




గత 25వ తేదీన సర్దార్ వల్లభాయ్ పటేల్ జోధ్పూర్‌లో మహాత్మాగాంధి ఉత్సవాలయమునకు నామకరణ మహోత్సవం జరిపినప్పటి దృశ్యం.

★




జనవరి 30– న రాజఘాటులో భారత ప్రధానామాత్యుడు పండిట్ నెహ్రూ సర్వోదయ ప్రదర్శనమునకు ప్రారంభోత్సవము జరిపినప్పుడు ఆయనతో ముచ్చటించుచున్న హైకమీషనర్ సర్ ఆర్చిబాల్డ్ నై, నై సతి.


★



బార్డోలికి వెళ్లుతూ బరోడాలో ఆగిన భారత ఉపప్రధాని సర్దార్ పటేల్ గారు వేడ్చి ఆశ్రమంలో సర్దార్ పటేల్ ఉపన్యసిస్తున్నారు.



ఆల్ ఇండియా రేడియో చీఫ్ ఇంజనీర్ బి. వి. బలీగారు పాత ఢిల్లీలోని ఏ. ఐ. ట్రాన్సమిటర్ (హై పవర్) ఏ విధముగ పనిచేయునదీ శ్రీ తాయబుల్లా (అస్సాం) గారికీ, నిహారేంద్రదత్తా మజుందారికీ చూపుచున్నారు. వివిధరాష్ట్రముల సంస్థానముల సమాచారమంత్రుల సమావేశములో పాల్గొనిన ప్రతినిధులు వీరు.



హస్తినాపురం అను నూతననగరనిర్మాణానికి పండిట్ నెహ్రూ శంకుస్థాపన చేశారు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 41


సంచిక 23

Founder : K. NAGESWARA RAO

సర్వధారి సంవత్సర మాఘ బహుళ చవితి బుధవారము



అహోబిలంలోని వసంతమండపం



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ ఫిబ్రవరినెల 16-వ తేది బుధవారము

తీర్పు

1948 సం॥ జనవరి 30 న గాంధిజీ హత్యచేయబడెను. ఈ జనవరి 30 ని భారతప్రజ సర్వోదయ దినముగా సంస్మరించినది. సర్వోదయ దినము జరిగిన పదకొండుదినములకు గాంధీ హత్యానేరస్థులకు శిక్ష విధింపబడినది. గాంధిజీని హత్యచేయుటకు కుట్ర జరిగిన దని రుజువైనట్లు జడ్జి ఆత్మాచరణ్ తీర్పులో తెలియజేసెను.

కుట్ర జరిగినదను అంశమే ముఖ్యముగ గమనింపవలసిన విషయము. నాథూరాం గాడ్సేచర్య కేవలము ఒక మతిపోయిన మనిషిచర్య కాదని వ్యక్తమైనది. తీర్పు అనంతరము, నిందితులు చేసిన వివాదములు ఆ అంశమును ధృవపరచుచున్నవి. తమ చర్యనుగురించి నిందితులు పశ్చాత్తాపమును చెందినట్లు లేదు. అంతేకాదు, తామేదో ఉత్కృష్ట ఉద్యమ ప్రతినిధుల మను భావమును కలుగజేయుటకు ప్రయత్నించిరి. వారి అట్టి వాంసములకు విషాదము చెందుట తప్ప వేరుగ వ్యాఖ్యానము చేయుట అనవసరము. గాంధీహత్యకు ఒడబడిన వారు, ఎట్టి వికృతచర్యకు పూనుకొనినను క్రోధమును రేకెత్తింపజాలరు. వారి నిప్పటికికూడ పశ్చాత్తాపభావము ఆవహింపలేదను విచారమే అందరిని బాధించగలదు.

గాంధీజీని తాను బుద్ధిపూర్వకముగ హత్యచేసితి నని దానికి తగిన శిక్ష విధించవలసిన దనీ, దయాభిక్షను కోరుట లేదనీ నాథూరాం గాడ్సే తన వాఙ్మూలములో కోర్టువారికి తెలిపెను. గాంధీసిద్ధాంతముల ప్రకారము, గాడ్సేపైన కనికరము చూపవలసియున్నది. కాని, గాంధీసిద్ధాంతముల ననుసరించిన వ్యవస్థ ఆచరణయందు లేదు. సామాన్యచట్టము ననుసరించిన శిక్ష విధింపక తప్పదు. హత్యచేయబడినది గాంధిజీ అంతటివాడు కాబట్టి, శిక్షకూడ బ్రహ్మాండముగ నుండవలె నను భావ ముండక మానదు. కాని శిక్షా చట్టమునకు అట్టి తారతమ్యములు లేవు. అసలు నేరస్థుల విచారణ, వారికి విధింపబడిన శిక్షలగురించికన్న గాంధిజీ హత్య చేయబడెనను విషయమునుగురించే భారతీయులు, అనుక్షణము ఆలోచించి ఆత్మవీక్షణమునకు పూనుకొనవలెను. గాడ్సేకు ఏమి శిక్ష విధింపబడిన దను నది పెద్ద విషయము కాదు. దానిని గురించి ఆలోచింప నవసరము లేదు.

జడ్జి ఆత్మాచరణ్ తన తీర్పులో పోలీసుల అజాగ్రత్తను గురించి విమర్శించెను. "1948 జనవరి 20 నుండి, 30 వరకు, కేసును దర్యాప్తు చేయుటలో పోలీసులు చూపిన అశ్రద్ధను కేంద్ర ప్రభుత్వదృష్టికి తేదలచినాను. జనవరి 20 న మదన్‌లాలును అరెస్టుచేసిన వెంటనే ఢిల్లీపోలీసులు అతనివద్దనుండి, అనేక వివరములతో కూడిన స్టేటుమెంటను తీసికొనిరి 21 వ తేదీన డా. జే. సి. జైన్ మురార్జీదేశాయికి ఇచ్చిన స్టేటుమెంటుబొంబయిపోలీసులవద్ద ఉండి ఉన్నది. ఈ రెండు స్టేటుమెంట్లు లభ్యమైనవెంటనే, బొంబాయి, ఢిల్లీ పోలీసులు ఒకరితో నొకరు సంప్రతించుకొనిరి. ఈ రెండు స్టేటుమెంటులు తమ వద్ద ఉన్నప్పటికీ వాటివల్ల ఎట్టి ప్రయోజనమును సాధింపలేక పోయిరి. అప్పుడు కనుక వారే మాత్రము జాగ్రత్త చూపినను ప్రమాదము తప్పియుండెడిది." అని ఆత్మాచరణ్ తన తీర్పులో చెప్పెను. ఇంత తెలిసికూడ పోలీసులు తగు జాగ్రత్త తీసికొనలేదని ప్రజలు పదే పదే బాధాక్రోధములు పొందకమానరు. పోలీసులు ఎందు కింత అలసత్వము చూపిరని ప్రశ్నించుకొనక మానరు. మహాత్ముని పోగొట్టుకొను దురదృష్టము ఈ దేశమున కుండుటవల్లనే పోలీసులు అజాగ్రత్తగ ఉండిరను సమాధానము తప్ప మరి లేదు.


జాతీయ భాష

జాతీయభాషనుగురించి ఆదివారము నాడు ప్రచురితమైన భారత ప్రధాని పండిత నెహ్రూ వ్యాసము విషయ స్పష్టీకరణకు అంతగ ఉపకరించుటలేదని చెప్ప సాహసింపవచ్చును. జాతీయభాష అనగా, అఖిలభారత వ్యవహారములకు ఉపకరించున దని వేరుగ చెప్ప నవసరము లేదు. "రాష్ట్రముల భాషల అభివృద్ధికి మనము కట్టుబడితిమి అయితే అఖిలభారతభాష ఒకటి యుండవలెను ఇంగ్లీషు గాని, మరే పరాయి భాషగాని ఆ స్థాన మాక్రమింపజాలదు" అని నెహ్రూ ఉద్ఘాటించెను. కాబట్టి అఖిలభారత భాషగా హిందీగాని, హిందూస్తానిగాని, ఏర్పడవలసి యున్నది అని ఆయన అభిప్రాయము హిందూస్తానియే అన్నివిధముల సలక్షణమైన దని ఆయన విశ్వాసము.

హిందీ, హిందూస్తానీల గురించి ప్రతివాదములు ఉత్తరదేశమునందు చెలరేగుచున్నవిగాని దక్షిణదేశీయులకు అంతగ పట్టలేదు. ఈ వాదములకు ఆ ప్రాంతములందు సాంఘికముగాను, తత్ఫలితముగా రాజకీయముగాను ఉన్న విభేదములే కారణము. సంస్కృతిబద్ధమైన హిందీ భారతభాషగ నుండవలెనని, హిందూస్తానీ అనునది భాష కాదనీ హిందీ వర్గాభిమానుల వాదము. ఉర్దూ పదములతో ప్రయోగింపబడునది హిందూస్తాని అని పేర్కొనబడుచున్నది. ఇది కేవలము ప్రాంతీయము గాని, యధార్థమునకు ఒక రూప మేర్పడిన భాష కాదు. అందువల్ల హిందీ అభిమానులు దానికి విముఖత్వము చూపుచున్నారు. పండిత నెహ్రూ చెప్పినట్లు వారి వైముఖ్యము పరాయిభాషా పద మనునది హిందీయందు చేరకూడదనిన అది సంకుచితభావము, గర్హణీయము. నిత్యవాడుకలో ఉన్న పదములన్నిటినీ విసర్జించవలెననుట యోగ్యము కాదు. కొన్ని పదములు అనువాదముచేయ వీలులేదు. ఆవిధమైన పదములను యధావిధిగ నిలుపుకొనవలసినదే. కాని దానికి తగుమైన పదములు స్వభాషలో యుండిన, వాటి ప్రయోగమునకు పట్టుపట్టిన హర్షణీయమే. సంభాషణలందు వాడుకలో ఉన్నవని పరాయి పదములను వ్రాతలో చేర్చ నవసరము లేదు. ఈ వాదమును సంకుచిత తత్వ మనరాదు. ఇంగ్లీషు భాషా పదములందు నిత్య సంభాషణలలో అనేక ముపయోగించుచుందుము. వాటికి స్వభాషాపదములు అనువైనవి ఉన్న వాటిని వ్రాతలోను, ప్రసంగమునందును ఉపయోగించి తీరవలెను. అపుడే భాషకు సమార్థసూచకమైన స్ఫురణ ఏర్పడును. తర్జుమాకు అందనివి కొన్ని వస్తుగుణనామవాచకములు యంత్రసంబంధమైనవి మాత్రము. అవి ఏ భాషలో ముందుగ వాడుకలోకి వచ్చినవో, అలాగే యుంచుకొనుట మేలు. పరాయి భాషా పదములను నిషేధించుట సంకుచితమైన జాతీయత అని పండిత నెహ్రూ అభిప్రాయపడెను.

అయితే ఇంతవరకు అఖిలభారత ప్రభుత్వభాషగ నున్న ఇంగ్లీషును మాత్రము నిషేధించుట ఎందులకు? అసలు అఖిలభారతభాష అనునది లేదుకదా? దానిని ఇపుడు సృష్టించవలసియున్నది. అంతేకాక, రెండు లిపులనుకూడ తయారు చేయవలసియున్నది. ప్రభుత్వ ఆశ్రయము లేనిదే హిందీ అయిననూ, హిందూస్తానీ అయినను భారతభాషగా తయారు కాజాలదు. ఇంగ్లీషు అదే విధముగా పెరిగినది. అట్టి సందర్భములో, ప్రజలనుండి జాతీయ భాష పుట్టుకొని రావలెననుటలో గల భావము గోచరింపదు. అదయినా ఏక భాషాయుక్తమైన ఒక ప్రాంతములో పొందగలదు గాని, విభిన్నభాషా ప్రాంతములతో కూడిన యావద్భారత దేశముమీద ప్రజలభాష అనునది రాజాలదు. అలా వచ్చినప్పటికీ పండిత నెహ్రూ వర్ణించిన సలక్షణమైన భాష ఉద్భవిల్లదు.

పైన చెప్పినట్లు పండిత నెహ్రూ వ్యాసవిషయము ఉత్తరదేశమునందున్న భాషావర్గములకు ఉద్దేశించినది గాని దాక్షిణాత్యులకు సంబంధించినది కాదు. దాక్షిణాత్యులకు హిందీ అయినా ఒకటే; హిందూస్థానీ అయినా ఒకటే. కాని వారికికూడ పండిత నెహ్రూ వ్యాసము సుబోధకమగు మార్గమును చూపలేకపోయినది. జాతీయభాష అను వివాదము విస్మరించి, రాష్ట్రప్రభుత్వములకు రాష్ట్రములందలి భాష అనీ, కేంద్ర ప్రభుత్వమునకు ఇంగ్లీషు అనీ నిర్ణయించిన ఉచితముగ నుండును. భాషారాష్ట్రముల నిర్మాణము ఎలాగూ జరుగవలసియున్నది, అలా ఏర్పడిన రాష్ట్రములందు ప్రాంతీయభాష రాజభాషగను, జాతీయభాషగను ఉండగలదు. సంకుచిత జాతీయతత్వము అడ్డు తగ్గిలినగాని ఆంగ్లము కేంద్రప్రభుత్వభాషగ నిలుపుకొనుటకు అభ్యంతరము చెప్పకూడదు. ఏ విధముగను అర్హతలేని హిందీ, హిందూస్తానీలను స్వదేశభాష అని ప్రతిష్ఠ కల్పించి వాటిని అందలములో ఎక్కించుట ఉన్నపరిస్థితిని క్లిష్టమొనరించుట తప్ప వేరు కాదు.



ముఖచిత్రము:

మద్రాసు ప్రభుత్వ మ్యూజియంలో, చిత్రకారుడు, యఫ్. హెచ్. రౌలర్, చిత్రములను గతవారం ప్రదర్శించిరి. చిత్రము "చిరుతపులి" దారు-చిత్రము.

చీనాలో అంతర్యుద్ధం

కమ్యూనిస్టులకు రష్యా మద్దతు ఇచ్చిందా? ★ జాతీయవాదులకు అమెరికా ధారపోసినదంతా ఏమయింది?

ప్రపంచసంగ్రామం అనంతరం చీనాదేశాన్ని ప్రమాస్తే అర్థబలానికీ సిద్ధాంతబలానికీ మధ్య సంఘర్షణ అంటే ఏమిటో సుబోధక మవుతుంది ప్రభుత్వపక్షమైన కొమింటాంగ్ కీ పరిపాలకుడైన చాంగ్ కై షేక్ కీ మారణాయుధాలు, మందుగుండు సామగ్రి ఓడలనిండా పంపితే చాలు; ఇట్టే కమ్యూనిస్టుల్ని జయించవచ్చునని పశ్చిమదేశాల్లో అనేకమంది భ్రమపడ్డారు. చీనా ప్రభుత్వానికి మూడు సంవత్సరాలు వరుసగా అమెరికా సహాయం పంపినప్పటికీ, కమ్యూనిస్టులికీ పరిశ్రమలవల్ల వచ్చే ఉత్పత్తి బొత్తిగా శూన్యమైనప్పటికీ ఇప్పుడు కమ్యూనిస్టులదే పైచెయ్యి అయింది. చీనాప్రభుత్వానికి అమెరికా పంపిన సహాయంకంటె అధికంగా రష్యా చీనా కమ్యూనిస్టులకి సహాయం పంపిందని పశ్చిమదేశాల్లో అనుకుంటున్నారు. ఇదికూడా పొరపాటే.

ప్రస్తుత పరిస్థితి అవగాహనచేసుకోవాలంటే 1923 నాటినుంచి విషయాల్ని గమనించాలి కొమింటాంగ్ అనే పేరుతో జాతీయ రాజకీయసంస్థను స్థాపించిన సన్‌యట్ సేన్ 1923 లో కాంటన్ లో మొదట ప్రభుత్వాన్ని స్థాపించాడు చీనాలో సోవియట్ ఏజంటుగా వచ్చిన జోఫ్ తో ఒక ఒడంబడిక చేసుకుని తన పార్టీని సోవియట్ పద్ధతులపైన నిర్మించాడు కమ్యూనిస్టు సభ్యుల్ని చాటుగా తనపార్టీలో చేరనిచ్చాడు ఇద్దరు రష్యన్లని తనకు సహాయ కార్యకర్తలుగా సైన్యం నిమిత్తం ఒకనిని, రాజకీయములనిమిత్తం ఒకనిని నియమించాడు అప్పుడే మాస్కోలో శిక్షణ పూర్తిచేసుకుని దేశం తిరిగివచ్చిన ఒక సైనికోద్యోగి ఆధిపత్యం క్రింద ఒక సైన్యకళాశాల స్థాపించాడు.

ఆ సైనికోద్యోగి పేరు చాంగ్ కై షేక్

సన్‌యెట్ సేన్ పార్టీకి మూడు ప్రధానాశయాలు 1. జాతీయ సమైక్యత. అంటే చీనాలో మతంవేసుకుని కూర్చున్న విదేశీపరిపాలకుల్ని తొలగించడం. 2. ప్రజాస్వామ్యం అంటే ప్రజలందరికీ విద్య నిచ్చి వోటింగు హక్కు లివ్వడం. 3. ప్రజల, ఆర్థికోన్నతి అంటే ప్రధాన పరిశ్రమల్ని జాతీపరంచేసి దున్నేవాడికి భూమి నివ్వడం.

నూతన చీనా నిర్మాతఅయిన సన్‌యెట్ సేన్ పట్ల కొమింటాంగ్ మాత్రమేగాక కమ్యూనిస్టు పార్టీ కూడా శ్రద్ధాభక్తులు కనపరుస్తుంది ఉభయులూ వారివారి ప్రాంతాల్లో పై మూడు ఆశయాల్నే పాటిస్తారు. సన్ వ్రాసిన గ్రంథాన్ని వేదంగా పరిగణిస్తారు. అతన్ని ఉభయులూ ఆరాధిస్తారు :

సన్ యట్ సేన్ 1925 లో మృతిచెందగానే కొమింటాంగ్ పార్టీకి చాంగ్ కై షేక్, కమ్యూనిస్టు పార్టీకి ప్రచారశాఖా నిర్వాహకుడైన మావ్ జిటంగ్ నాయకులైనారు. చీనాదేశంలో కెల్ల సమృద్ధి అయిన ప్రాంతం యాంగ్ సీ లోయ ప్రాంతాన్ని 1927 లో చాంగ్ కై షేక్ ఆక్రమించుకున్నాడు. తరువాత తన పార్టీలోనుంచి కమ్యూనిస్టుల్ని వెళ్లగొట్టాడు. కమ్యూనిస్టు నాయకుల్ని జైల్లో నిర్బంధించాడు. రష్యన్ సహాయ కారుల్ని మాస్కో తరిమాడు. కమ్యూనిస్టు పార్టీని నిషేధించాడు.

మావ్ - జి - టంగ్ హునాన్ రాష్ట్రంలో స్వస్థానం చాంగ్‌షా చేరి అక్కడి రైతుల సహాయంతో గోరిల్లా దళాలు నిర్మించాడు. కొమింటాంగ్ విరోధులందరూ ఇందులోచేరారు. కమ్యూనిస్టులు దక్షిణచీనా వదలి చాంగ్ కై షేక్ హస్తగతంకాని ఉత్తర చీనా వెళ్లి అక్కడ స్థావరం ఏర్పరుచుకొన్నారు. 1934 లో డబ్భై వేలమంది కియాంగ్సీ నుంచి, 1936 లో పదివేల మంది ఉత్తర షెన్సీనుంచి ఉత్తరానికి కలసి వెళ్లారు. దారిలో చావువాత పడినవారు పోగా మిగిలిన వారు గోబై ఎడారిచుట్టి ఆరువేల మైళ్లు నడిచి ఉత్తరచీనా చేరారు. అక్కడ స్వపరిపాలన స్థాపించుకొన్నారు.

1932 లో జపానుపై యుద్ధానికి కొమింటాంగ్ కు సహాయపడగలరని కమ్యూనిస్టులు చెప్పారు. జపాన్ షాంఘైలో తల దూర్చి, క్రమంగా మంచూరియాలో ప్రవేశించడానికి యత్నిస్తున్న రోజు లవి; కాని చాంగ్ కై షేక్ తిరస్కరించాడు

1936 కి జపాన్ మంచూరియా ఆక్రమించి ఉత్తరచైనా దిక్కుగా వ్యాపిస్తోంది. తిరిగి కమ్యూనిస్టులు కలిసి పనిచేద్దామని అనేకసార్లు చెప్పారు. చాంగ్ తిరస్కరించాడు. కొమింటాంగ్ పక్షంలో చాంగ్ సే లింగ్ అనే సైనికోద్యోగి కమ్యూనిస్టులతో కలవాలని పట్టుబట్టాడు. రహస్యంగా కమ్యూనిస్టులతో ఒక సమాధానం చేసుకున్నాడు. 1937 మేనెలలో చాంగ్ కై షేక్‌ని బంధించి తీసుకువెళ్లి కమ్యూనిస్టు నాయకులవద్దకి తీసుకెళ్లాడు అప్పుడు చాంగ్ కై షేక్ కమ్యూనిస్టులతో సఖ్యతకి అంగీకరించాడు. జపాన్‌పై కలిసి యుద్ధం ప్రారంభించారు కాని నాంకింగ్ తిరిగి రాగానే చాంగ్ సే లింగ్‌ని కారాగారంలో నిర్బంధించాడు. లింగ్ ఈ నాటికీ ఖైదీగానే ఉన్నాడు

చాంగ్ కై షేక్ తిరిగి నాంకింగ్ చేరిన రెండు మాసాలికి పెకింగ్ నగర సమీపంలో తమపైన దౌర్జన్యం జరిపారనే మిషపైన జపాన్ చీనాపైన యుద్ధం ప్రకటించింది. ఒక మాసం వాదోపవాదాలు జరిగినతరవాత ఆగస్టులో చాంగ్ కై షేక్ తన సైన్యంలో దిట్టమైన దళాల్ని షాంఘై నగరంపైకి పంపాడు జపనీస్ తుపాకుల వాతపడి ఈ దళాలు నాశనమైనప్పటికీ, ఒకవిధంగా చీనాలో సఖ్యతకు ఇది హేతువైంది

అక్టోబరులో షాంఘై జపనీస్‌హస్తగతమయింది. డిసెంబరులో చాంగ్ కై షేక్ ప్రధాన నగరం నాంకింగ్ పతనమయింది.

ప్రభుత్వ స్థానాన్ని నది ఎగువకి హాంకో నగరానికి, ఆ తరువాత చుంకింగ్ నగరానికి మార్చారు. అప్పటికి చీనాదేశం అంతా చాంగ్ కై షేక్ ఆధిపత్యం కిందకు వచ్చింది. 1939 వేసవి కాలానికి కేంద్రప్రాంతం పారిశ్రామిక ప్రాంతం జపాన్ చేతుల్లో పడింది.

యుద్ధకాలంలో కమ్యూనిస్టు గోరిల్లాలు జపాన్ ఆక్రమిత ప్రాంతంలో వినాశనం చేసినా ఈ పరిస్థితి ఏడుసంవత్సరాలుంది.

బ్రిటిష, అమెరికన్ ఆయుధాల్ని కొమింటాంగ్ కంటె కమ్యూనిస్టుల కిస్తే జపనీస్‌కు విరుద్ధంగా బాగా యుద్ధం చెయ్యగల్గరని 1944 లో జనరల్ స్టిల్వెల్ గ్రహించాడు. కొమింటాంగ్ సైన్యంలో అశ్రద్ధ అసమర్థత అధికంగా ఉన్నాయని విమర్శించాడు. చాంగ్ కై షేక్‌తో స్వయంగా ఈ మాట చెప్పాడు కూడా. దీనికి ఫలితంగా రూజ్‌వెల్ట్‌కు విజ్ఞప్తి చేసి చాంగ్ కై షేక్ స్టిల్వెల్‌ని చీనానుంచి తొలగింపచేశాడు.

యుద్ధం గడిచినకొద్దీ వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ఆర్థిక పరిస్థితి క్లిష్టతరమైపోయింది కొమింటాంగ్ సైన్యాలలో శ్రద్ధ సన్నగిలింది ఉద్యోగుల్లో అవినీతి లంచగొండితనం విపరీతంగా వ్యాపించి యుద్ధరంగాల్లో వర్తకుల్ని వ్యాపారం చేసుకోనిచ్చి అపారంగా లంచాలు తీసుకునేవారు.

సైనిక దళాధిపతులు సైనికసంఖ్య పెద్ద చేసి చెప్పే అబద్ధాలవల్ల ధనం ఆహారం మొదలైనవి అధికంగా తెచ్చుకుని భోగాలు అనుభవించేవారు. సైనికులికి తిండిపెట్టకుండా మాడ్చి, వారి శేషన్లపైన ధనార్జన చేసిన ఉద్యోగులు కూడా ఉన్నారు వస్తువుల ధరలు పెరుగుతున్న వేగంతో ఉద్యోగుల జీతాలు పెరగలేదు ఒక పోలీసు అధికారి ధనవంతుల్ని జైల్లో పెట్టి ధనం బలవంతాన గుంజేవాడు. ప్రభుత్వంలో ఉన్నతోద్యోగాలలో ఉన్నవారు తమ పదవుల్ని స్వార్థాలకి దుర్వినియోగం చేసేవారు.

ప్రపంచయుద్ధం సమాప్తికాగానే కమ్యూనిస్టు సేనలు ఎక్కడున్నవి అక్కడే కదలకుండా నిలిచి ఉండాలని చాంగ్ కై షేక్ ఉత్తరువు చేశాడు కమ్యూనిస్టులు రాకముందే షాంఘై, పెకింగ్, నాంకింగ్ మొదలైన నగరాల్ని ఆక్రమించుకోడానికి 80 వేలమంది కొమింటాంగ్ సైనికుల్ని అమెరికన్ విమానాల్లో పంపాడు. తన సైన్యాలు వచ్చేవరకూ జపాన్‌కు సహాయపడిన చీనా సైన్యాల్ని, జపాన్ సైన్యాల్ని కమ్యూనిస్టు రాకుండా కాపాడాలని ఉత్తరువుచేశాడు

కొద్ది వారాల్లోనే దక్షిణ చీనా, మధ్య చీనా చాంగ్ కై షేక్ అధీనంలోకి వచ్చాయి. యెల్లో నదికి ఉత్తరభాగం కమ్యూనిస్టుల వశంలోకి వచ్చింది. అక్కడి కొన్ని ముఖ్య నగరాలునూ, రైల్వేకేంద్రాలు మాత్రం అమెరికన్ నౌకాదళాల చేతిలో ఉన్నాయి అమెరికన్లు ఈవిధంగా జోక్యం కలుగచేసుకున్నందుకు ప్రతీకారంగా మాత్రమే రష్యన్లు ఒకే ఒకసారి కమ్యూనిస్టులికి సహాయంచేశారు. మంచూరియాలో పారిశ్రామిక యంత్రపరికరాల్ని దోచుకున్న తరువాత మత, కమ్యూనిస్టులువచ్చి ఆక్రమించుకునేవరకూ కొన్ని ప్రాంతాల్ని వారు విడిచిపెట్టలేదు 1927 నుంచి ఇప్పటివరకూ ఇదొక్కటి తప్ప మరెప్పుడూ రష్యన్లు కమ్యూనిస్టులికి సహాయపడిన సందర్భం లేదు. యుద్ధకాలంలో వారు గోబై ఎడారిగుండా చాంగ్ కై షేక్ సహాయానికి యుద్ధపరికరాలు పంపారు గాని కమ్యూనిస్టులికి యేనాడూ పంపినది లేదు.

1945 సంవత్సరం పొడుగునా కమ్యూనిస్టులికీ కొమింటాంగ్ కీ మధ్య సఖ్యత కుదర్చాలని అమెరికన్ రాయబారి హర్లీ కృషి చేస్తూనే ఉన్నాడు. కాని విఫలుడైనాడు. 1927 సంవత్సరాన్ని కమ్యూనిస్టులు మరిచిపోలేదు చాంగ్ కై షేక్ తీర్చలేని షరతులు పెడుతున్నాడు. రాయబారాలు ఈవిధంగా ఒకపక్క జరుగుతుండగా, మరొకపక్క అమెరికన్లు కొమింటాంగ్ సైన్యాలికి ఆయుధాలు పరికరాలు అపారంగా తోడిపోసారు

జనరల్ మార్షల్ 1945 సంవత్సరాంతానికి వచ్చేసరికి సమాధానంకుదిరే ఛాయలు బొత్తిగా నాస్తి దేశంలో మూడోవంతు కమ్యూనిస్టులచేతిలోఉంది అందులో 15 కోట్ల జనాభా ఉంది చీనాప్రభుత్వంలో చేరేముందు కొమింటాంగ్ నియంతృత్వం పోవాలన్నారు. మితవాదనాయకుల్ని కొమింటాంగ్ హత్య చేసింది.

కళాశాల అధ్యాపకుల్ని కూడా హత్య చేయించిన చాంగ్ కై షేక్ ఆధిపత్యంకింద చేరడానికి కమ్యూనిస్టులు సందేహించారు. అమెరికా సహాయం చేస్తున్నందువల్ల చాంగ్ కై షేక్ చిత్తం వచ్చినట్లు బేరాలు పెంచాడు. ఐక్యత సాధించడానికి తన రాయబారం విఫలమయిందని జనరల్ మార్షల్ 1946 సెప్టెంబరులో ప్రకటించాడు.

తరవాత ఏమి జరిగింది? కొమింటాంగ్ వేను కంజ వెయ్యవలసివచ్చింది. వస్తువుల ధరలు తగ్గించలేకపోయింది సరిగదా, ఇంక పెరగకుండా చెయ్యాలని చేసిన కృషి వృథాఅయింది. కొమింటాంగ్ పరిపాలనలో ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులు క్లిష్టమైనాయి. ప్రజల్లో స్థైర్యం సడలిపోయింది. ప్రభుత్వం పట్ల విశ్వాసం నశించింది.

కమ్యూనిస్టులకు రష్యాతో ఏపాటి సన్నిహిత సంబంధం ఉందో చెప్పడంకష్టం. బ్రిటిష్ అమెరికన్ పత్రికా విలేఖరులు 1945 లో మూడు మాసాలు కమ్యూనిస్టు ఆక్రమిత ప్రాంతాలు పర్యటించారు. అప్పుడు వారికి రష్యనెవరూ కనిపించలేదు. టాస్ వార్తాసంస్థ ప్రతినిధి ఒకడు, డాక్టరు ఒకడు మాత్రం కనిపించారు. రష్యన్ ఆయుధాలు కూడా ఏమీ కనిపించలేదు.

ఇటీవల స్థాపించ బడిన కొమిన్ఫార్మ్ పత్రికలు మావ్ జి టంగ్ యుగోస్లావియా కమ్యూనిస్టు నాయకుడైనటిటోని విమర్శించినట్లువార్తలు ప్రకటించాడు. కాని ఒక అమెరికన్ పత్రికా విలేఖరితో మావ్ ఈ క్రింది విధంగా అన్నాడు: "సోవియట్ రష్యా పద్ధతుల పైనే సాంఘికంగానూ, రాజకీయంగానూ, కమ్యూనిజాన్ని అమలు జరపాలని మా ప్రయత్నం కాదు. కార్మిక వర్గాల నియంతృత్వాన్ని స్థాపించాలని కాదు. వ్యక్తిగత కృషికీ, ఉత్సాహానికీ విరుద్ధ

(20-వ పేజీ చూడుడు)



దాదాపు పది సంవత్సరముల క్రితం, జపాను దురాక్రమణను అరికట్టే నిమిత్తం కమ్యూనిస్టులు, క్యుమింటాంగ్ పక్షము అంతర్యుద్ధ విరమణకు రాజీపడిరి. ఆ రాజీ సంప్రదింపులలో పాల్గొన్న కమ్యూనిస్టు, క్యుమింటాంగ్ ప్రతినిధులు (కమ్యూనిస్టు ప్రతినిధులు చూస్తే, మావ్‌సీ టుంగ్ టోపీలు ధరించి ఉన్నారు.)

పారిశ్రామిక సమస్యలు:

యజమానులు తేగల్గు విప్లవము

ఫోర్డు కంపెనీ ప్రస్తుత విధానం

"కాపిటలిజం నశించాలి" ఒక అర్థప్రపంచపు నినాద మిది. "కమ్యూనిజం నశించాలి" మరో అర్థప్రపంచపు నినాద మిది. రెండూ బలీయమైన శక్తులే. రెండూ పరస్పర వినాశం కోరేవే! కాని మానవుడు బతకాలో లేదో రెంటికీ అక్కరలేకుండా ఉంది. ఈ ఇసమ్‌లు మానవులను ఆవహించే ఉన్మాదమనీ, నాశనానికి పూనుకొంటే నాశనమయేది మానవస్వరూపాలు తప్ప ఆ ఇజంలు కాదనీ ఒక్కరికీ అనిపించక పోవటం, వింతే!—

అమెరికా కాపిటలిస్టు అని ఇంత పేరు ఈనాడు తెచ్చుకోటానికి, ఫోర్డు, రాక్‌ఫెల్లరుల ప్రతిభే కారణం. అందులో ముఖ్యంగా ఫోర్డు.

సామాన్యునికి జీవితావసరాలు అందుబాటు చెయ్యటానికి అవసరవస్తువుల ఉత్పత్తి అధికంగా కావాలనీ అవి అధికంగా తయారుచేయగల యంత్రవిధానమే తిరుగులేనిదనీ, ఫోర్డు తలపోశాడు. ఆ రీతిగా, మువింగ్ బెల్టు విధానంలో, ఫ్యాక్టరీలు నిర్మించాడు. ముడిఇనుప ముక్కల్ని బెల్టు ఒక కొసని అందిస్తే, అతినవీనమైన మోటారుకారు, బెల్టు రెండోకొసను దిగి, సరాసరి డ్రైవ్ చేసుకుపోయేందుకు వీలుగా ఉన్న మోటార్లను తయారుచేసే విధానం చూపించి, గారడీని యథార్థం చేసినట్లు చేశాడు ఫోర్డు.

కాని, ఈ యంత్రనిర్మాణంలో మానవుణ్ణి మర్చిపోయాడు ఫోర్డు అని అపవాదు. ఈనాడు ఆ ఫోర్డు మనుమడు రెండవ ఫోర్డు, ముప్ఫైఏళ్ల యువకుడు, ఆ యజమాని స్థానంలో నిలచాడు "మానవునికీ యంత్రానికీ మధ్య ఏర్పడ్డ ఇరకాటన్ని తొలగించేందుకు" ఈ రెండవ ఫోర్డు పూనుకొన్నాడని, అమెరికనులు చెప్పుకొంటున్నారు వాళ్లు చెప్పుకొనే మాటలలో నిజానిజాలెల్లా ఉన్నా, ప్రపంచానికి ప్రయోజనకరముగా యజమానులలో కార్మికులలో సౌమనస్యాన్ని వృద్ధి చేసి, సామరస్యం తెచ్చే విధానమని దేన్ని అనుకొంటున్నారో, అనుకొంటున్నామని ప్రపంచం భావించాలనుకొంటున్నారో, ఆ విధానం కొంచెం మంచిదే అయిఉండవచ్చు. కాబట్టి వాళ్లు తమ రెండో ఫోర్డునుగురించి చెప్పుకున్న మాటల సారాంశం కొంచెం పరికించుకొందాం.

హెన్రీ ఫోర్డు II, ప్రఖ్యాత కోటీశ్వరుడు, మోటారు నిర్మాణ కంపెనీ అధ్యక్షుడు అయిన హెన్రీ ఫోర్డు మనుమడు. వారసత్వంవల్ల, తాత తర్వాత, తన కంపెనీఅధికారస్థానంలో నిల్చాడు. అతనికి 30 ఏళ్లు మించి ఉండవు. ఇంకా పాలబుగ్గల వయస్సులో ఉన్నట్లే కనబడతాడు. కానీ, అతని రాకతో ఫోర్డు కంపెనీ స్వరూపమే సంపూర్ణంగా మారిపోయినట్లయింది. రెండేళ్లలో, కంపెనీ స్వభావమే మార్చివేశాడు. యంత్రంతోపాటు మనిషినీ గమనించాలనే సూత్రాన్ని తన తాత పాటించలేదని గమనించాడు. "పారిశ్రామికంగా పెద్దపెట్టున ఉత్పత్తి జరగాలంటే యంత్రాలూ మనుష్యులూ, రెండూ అత్యవసరాలే. పారిశ్రామిక రంగంలో మానవుల సంబంధబాంధవ్యాలను సరిదిద్దుకోగలిగామంటే, భారీయంత్రాల ప్రవేశంతో గత పాతిక సంవత్సరాలలో సమకూర్చుకొన్నంతకన్నకూడా ఎక్కువగా రాబోయే పది సంవత్సరాలలో వస్తుఉత్పత్తిని పెంపు చేసుకొని ధరలను తగ్గించుకోగలమని నేను నమ్ముతున్నాను" అంటూ ఫోర్డుమనుమడు పారిశ్రామిక పరిస్థితిపై అభిప్రాయపడి తన సంస్కరణ విధానాన్ని ఉపక్రమించాడు. పారిశ్రామిక రంగంలో మానవులతో సంబంధబాంధవ్యాలంటే కేవలము తన (ఫోర్డు)కంపెనీలో పనిచేస్తున్న 600 కార్మిక ప్రతినిధులతో సంబంధబాంధవ్యాలు మాత్రమే కాదు. వేలాది ఇతర కార్మికులతో సామరస్యము. తన కాతాదారులతో, ఏజెంట్లతో, తన వస్తువు అమ్మదలచిన మార్కెట్ల జనాసీకంతో, వస్తువులను కొనే జనంతో, సామాన్య పౌరునితో, అందరితోకూడా సామరస్యం - సౌజన్యం - వాళ్లను అర్థం చేసికోటానికి ప్రయత్నం - ఈ విధానంలో ఫోర్డు II తన కంపెనీలో, కార్మికులనుంచి విప్లవంకాకుండా, యజమానినుంచి రాగల విప్లవం, పరిపూర్ణమైన మార్పు తెచ్చాడు.

తను అధికారంలోకి రాగానే - "మన కంపెనీ ఒక్క మనిషి యాజమాన్యపు కంపెనీ కాదు - మన కంపెనీ ఒక కుటుంబము" అని ప్రకటించాడు.

ఈనాడు ఫోర్డు కంపెనీ పనివారు, కంపెనీల మూలమూలల నక్కి తమ కష్టాలను ఒకళ్ళతో ఒకళ్లు రహస్యంగా బెదురుచూపులతో గొణుగుకొంటూ, బొమముడితో, విసంపించుకొంటూ, చెప్పుకో నక్కరలేదు. ఆ పరిస్థితి తొలగించుకోవటంతోటే కంపెనీలో ప్రతివారి బుజాల మీదినుంచీ ఒక పెద్ద బరువు దింపేసుకొన్నంత సులభమయ్యింది ప్రతివారి పనీ కూడా.

అమెరికన్ కార్మికుల అవసరాలను గురించి ఎల్మోరోపర్ అనే అతడు ఒక నివేదికను తయారుచేసి అందులో కార్మికునికి అవసరంగా సమకూర్చవలసిన నాలుగువిషయాలను క్రోడీకరించి చెప్పాడు. ప్రతి కార్మికుడు కోరే దేమిటంటే

(1) ఈ ఉద్యోగం తనకు నిలకడగా ఉంటుందన్న స్థైర్యమూ, అందుకు హామీ;

(2) ఈ ఉద్యోగంలో తను అభివృద్ధిచెంది, పైకి రాగల అవకాశం;

(3) తనను, కేవలం కూలిడబ్బుల మనిషిని లాగా కాక అక్కడి మానవునివలె చూడటం, మానవ సహజమైన గౌరవం తన కియ్యటం;

(4) తనూ, తను చేస్తున్న పనీకూడా, సంఘానికీ సర్వమానవాభ్యుదయానికీ ప్రయోజనకరమౌతూన్న ఆత్మగౌరవమూ, సంతృప్తీ, తనకు కలిగే పరిస్థితులు.

కార్మికులు ప్రస్ఫుటంగా అడిగినా, అడక్కపోయినా వాళ్లు ప్రాథమికంగా కోరుతున్న విషయాలీ నాల్గేనని రోపర్ నిర్వచించాడు. ఫోర్డు ఇవి నమ్మాడు. దీన్నిబట్టి తన కార్మిక విధానము (*Labour Policy*) నిర్మించుకొన్నాడు.

1945 లో ఈ విధానం అవలంబించుకొనే నాటికి గత తొమ్మిది మాసాలలో, కార్మికుల కంప్లయింట్లు మొత్తం నెలకు సగటున 2387 సంఖ్యలో ఉండేవి. 1946 లో ఈ సగటు సంఖ్య నెలకి 1188 కి దిగివచ్చింది. 1947 లో 1130 కి తగ్గిపోయింది. కార్మిక సమస్యలలో నిపుణులు, కార్మికల జీవనపరిస్థితులకు ఈ కంప్లెయింట్ల సంఖ్యే సరియైన సూచీఘాతక సంఖ్య" (*Index Number*) అంటారు. అంటే ఇవి నిజంగా తగ్గుతున్నాయంటేనే, వాళ్ల జీవన పరిస్థితులు నిజంగా బాగుపడుతున్నయన్న మాట!

అమెరికా ఫోర్మన్ అసోసియేషన్లతో ఫోర్డు వ్యవహరించిన విధానాన్నిబట్టి, అతని లోకజ్ఞానాన్ని, యథార్థపరిస్థితుల నవగాహన చేసుకోగల శక్తినీ, ప్రత్యక్ష కార్యాచరణ కౌశలాన్ని గ్రహించవచ్చును. ఫోర్డు కంపెనీ, అమెరికన్ ఫోర్మన్ యూనియన్‌ను మేము గుర్తించమని ప్రకటించినప్పుడు ఒక విలేఖరితో ఫోర్డు ఇల్లా చెప్పాడు:

"ఫోర్మన్ కూడా, కంపెనీ నిర్వాహక వర్గంలో ఒకడుగా ఉండాలంటే, అసలు తాను నిర్వాహకుల్లో ఒకడ నని అతను సరిగ్గా అనుకోగలిగే పరిస్థితి ఉండవలె. అందుకనే మా ఫోర్మన్‌లకు నిర్వాహకవర్గంవారి కుండవలసిన సౌకర్యాలు ఇస్తున్నాము. వాళ్లు తక్కిన కార్మికుల లాగా "బాడి" ధరించ నక్కరలేదు. వాళ్లకు ప్రత్యేకం ఇడెంటిటీ కార్డు ఉంటాయి. తక్కిన మేలిరకం పని వాళ్లకన్నా ఫోర్మన్ జీతం తక్కువ ఉంటే, అంతనికి జీతంలో ప్రమోషను ఇస్తాము. ఫోర్మన్‌కు ఏదైనా కంపెనీ విషయికంగా స్వంత కష్టాలుంటే, చెప్పుకొనేందుకు వాళ్ల ప్రతినిధి ఉంటాడు. ఆ ప్రతినిధి వెంటనే ఆ విషయంపై అధికారులకు విశదీకరిస్తాడు ఫోర్మన్లు, సూపర్‌వైజర్లు. అన్ని తరగతుల కార్మికులు అంతా తరచు సమావేశమయి విందుల్లో పాల్గొంటూ, కంపెనీలో జరిగే ప్రతివిషయం తెలిసికొని చర్చించేందుకు విందులు తరచు ఏర్పరుస్తాం."

అల్లాంటి విందుల్లో ఒకదానిలో తన కంపెనీ సూపర్వైజర్లతో ఫోర్డు ఇల్లా అన్నాడు.

"ఈ మీటింగులలో, మేము మీకు ఏవో ఆర్డర్లు ఇచ్చి అవి నిర్వహించండి అని చెప్పటానికి ఉద్దేశబడినవికావు. మేము నేర్చుకోవలసింది చాలా ఉంది. అది ఈ మీటింగులలో నేర్చుకొంటామని ఆశిస్తున్నాము. మేము మీతో సంప్రదించగలుగుతాం. మీరు మీ క్రింది పనివాళ్లతోటే, వాళ్లు వాళ్లక్రిందవాళ్లతోటే వరుసగా సంప్రదింపులు సాగించుకొన్నాక, సలహాలు అప్పుడు అట్టడుగునుంచి బయలుదేరి ఈ మెట్లద్వారా పైకి పాకిరావాలి. రోడ్డుమీద ట్రాఫిక్ రెండువైపులా సమంగా జరుగుతూంటే తప్ప రహదారి ప్రయోజనం గాదు."

చివర్ని ఫోర్డు తన కార్మికుల ప్రాథమిక అవసరాలను జీర్ణంచేసుకొని వాళ్ల కష్టాలను కనిపెట్టూన్నవాడే, అంతమాత్రంచేత పనివాళ్లు ప్రతిదానికీ అతనికి తొందరకల్గిస్తారనుకోకూడదు. ఒకసారి ఫౌండ్రీలో ఫోర్మన్, సుస్తీగా ఉన్నానని సెలవు పెట్టాడు. మళ్లీ పనిలోకి వచ్చాక ఆ రోజుల జీతం కోశేశారు. జబ్బుపడ్డ సెలవౌటంవల్ల ఆ రోజుల జీతం తనకు రావటం న్యాయమని ఫోర్మన్ అడిగాడు. చివరికి ఆ జీతం ఇచ్చారు. కాని సాటికార్మికులే, దొంగరోగం అభినయించి డబ్బు గుంజిన సోమరిపోతు అని అతన్ని తూర్పారపట్టారు. అధికారులు మాట్లాడాల్సిన అవసరమే లేకపోయింది.

తర్వాత ఎప్పుడో, ఫోర్మన్‌యూనియన్‌తో కాంట్రాక్టు రాసుకొనే విషయంలో ఈ విషయాన్ని పురస్కరించుకొని, దీనికి కూడా ఏదైనా చట్టం ఏర్పచాలని ఎవరో వాదించారు. చిన్నఫోర్డు అభ్యంతరం చెప్పాడు. "ఛాఛీ! పనికిరాదు కార్మికశాంతిని చట్టాలద్వారా తేలేము. మానవునికి మానవునికి మధ్య సామరస్యం తేగల్గిన చట్టమంటూ పృథివిలో ఏదీ లేదు" అని అభ్యంతరం పెట్టాడు.

చిన్నఫోర్డు, ఈడుమీరిన "పెద్దవాడు"గాడు. అతితెలివితేటలుగాని తెలివైనవాడినన్న అహంభావంగాని లేదు అందుచేత అతనికి సలహాలియ్యటమంటే అక్కడ అందరికీ సరదాయే. ఆ సలహా-యియ్యగల స్థితిలోనే ప్రతికార్మికుడూ ఉండటంవల్ల ఎవరికీ ఫోర్డు అంటే ద్వేషంగాని కక్షగాని లేవు.

అసలు యజమానిననుకోవటమే ఫోర్డు స్వభావములో లేదు. ఒకొక్కసారి ఫోనులో క్రింద జీతగాణ్ణి ఎవర్నో పిలుస్తాడు. ఏదో సమస్య అడుగుతాడు. అంతలో "ఉండు నేనే వస్తున్నా", ఆ పనివాడి దగ్గిరకు తానే బయలుదేరుతాడు తప్ప, "ఒక్కసారి ఇల్లారా!" అని కబురు పంపించడు.

1943 ఆగస్టులో, చిన్న ఫోర్డు కంపెనీలో చేరేటప్పటికి తాతగార్కి 80 ఏళ్లు. కంపెనీ వ్యవహారం అంతా ఎక్కువగా హారీ బెన్నెట్ అనే అతని చేతుల్లో ఉంది. ఫోర్డు కంపెనీ ఎప్పుడూ ఒక్కమనిషి యాజమాన్యంగానే నడిచింది. పెద్దఫోర్డు వృద్ధుడయ్యేటప్పటికి, కార్మికులకు యజమానికిమధ్య బెన్నెట్ గోడలాగా నిలచాడు. తక్కిన పనివాళ్లకు వేరే నాయకుడు లేకపోయాడు. వ్యవహారం అంతా బెన్నెట్ చేతులో బిగిసిపోయిఉంది.

చిన్న ఫోర్డుకు ఈ వ్యవహారంలో ప్రవేశించటమే ముందు గగనమైపోయింది. కార్మికుల అసంతృప్తిని తొలగించేందుకు ఏమాత్రం ఉపక్రమించినా, ఆ దోవ కొంత సాగి అక్కడే ఆగిపోయేది. కాళ్ళక్రింద భూమినే ఎవరో చప్పన గేసినట్లయేది బెన్నెట్ భయంతో, కార్మికులలో తరగతులవారిగా, భయం, కుళ్ళు, అవినీతీ, పరస్పరద్వేషం, అసూయా ఇన్ని పెరిగిపోయి ఉండి, నిర్వాహకవర్గం అంతా, జమీందారి ప్రభుత్వంలాగే తయారయి ఊర్కొంది.

ఏదయినా చేసితీరాలనే నిశ్చయంమాత్రం, చిన్న ఫోర్డు మనస్సులో పాతుకుపోయింది. ఆ నిస్పృహలో అతనికి సాయం చెయ్యగలవాళ్లు నలుగు రైదుగురు దొరికారు. జాన్ బుగాస్, (ఇప్పుడు ఫోర్డు కంపెనీలో, పారిశ్రామిక సంబంధాల డైరక్టరు) ఒకడు. ఉత్పత్తిశాఖలో పెద్దవాడైన మీడ్. యల్. బ్రెకర్ ఒకడు. మూడో ఆమె ఫోర్డు తల్లి. బెన్నెట్ కుటిల నీతితో, తన భర్తకూడా వెన్నువిరిగి పడిపోవటంతో, ఆమె కుమారునికి పూర్తిగా వత్తాసు నిల్చింది. నాల్గవవాడు, కంపెనీలోంచి పంపించి వెయ్యబడ్డ, జాన్. ఎస్. డేవిస్. డేవిస్‌ను మళ్లీ కంపెనీలోకి తీసుక్వాన్నాడు ఫోర్డు.

డేవిస్ కొన్ని ఏళ్ళక్రిందట సేల్సు మానేజర్‌గా ఉండేవాడు కాని బెన్నెట్ కోపానికి గురిఅయ్యాడు. దాంతో డిప్రెషన్ పొంది, వెస్టుకోస్టులో ఎక్కడో అజ్ఞాతవాసం గడుపుతున్నాడు. ఒకసారి చిన్న ఫోర్డు వెస్టుకోస్టులో అతన్ని కలుసుకొన్నాడు. మళ్లీ కంపెనీ సేల్సుమానేజరుగా వస్తావా అని అడిగాడు. డేవిస్ సన్నితంగానే రానని చెప్పాడు. బెన్నెట్ ఒకవేళ మళ్ళీ తలుచుకొంటే తనను ఉద్యోగంలోంచి తోసేస్తాడు కాబట్టి వృథాగా ఈ అల్లరికూడా పడటం ఎందు కన్నట్టు చెప్పాడు.

ఫోర్డు వినలేదు. తనూ అంత నిర్బంధంగానే రమ్మని పట్టుపట్టాడు. "నువ్వు రావాలి. నాకు నీ అవసరం చాలా ఉంది కంపెనీకి నీ అవసరం చాలా ఉంది. నువ్వు కంపెనీలోనుంచి వెళ్ళటమేవస్తే, నేనూ బైటికి వచ్చేస్తాను—సరా?" అని అడిగాడు డేవిస్ ఒప్పుకొన్నాడు. 1944 లో డేవిస్‌ను ఉద్యోగంలోకి మళ్లీ తీసికోటమంటే, బెన్నెట్‌ను సూటిగా సవాల్ చెయ్యటమే! బూగాస్, బ్రెకర్, డేవిస్, ఫోర్డు - నల్గురూ ఒకపక్షంగా తయారయారు. తమ రహస్యసమాలోచనలకు కంపెనీ ఆవరణలో తగినంత ఆస్కారం లేదని, డిట్రాయిట్ దిగువపేట క్లబ్‌లో కలుసుకొనేవారు.

చివరికి 1945 సెప్టెంబరు 21 న బోర్డు ఆఫ్ డైరక్టర్ల సమావేశంలో, చిన్నఫోర్డుని అధ్యక్షుణ్ణి చేశారు. సభ్యులంతా ఇంకా వెళ్లి పోకముందే, ఫోర్డు ఒక్కడూ, బెన్నెట్ ఆఫీస్ గదిలోకి వెళ్లాడు. బెన్నెట్‌తో ఒంటరిగా కొన్ని నిమిషాల తరబడి మాట్లాడాడు.

ఆ గదిలోంచి ఫోర్డు బైటికి వచ్చేటప్పటికి, ఫోర్డు కంపెనీ సర్వాధిపత్యం బెన్నెట్ చేతుల్లోంచి జారిపోయింది

వెంటనే కంపెనీలో కనరాని విప్లవాత్మకమైన మార్పులు జరగసాగాయి. ఒక పెద్దతుపాను కంపెనీ నిర్వాహకవర్గంమీదుగా ప్రసరిస్తూందా అనిపించింది. నిర్వాహకోద్యోగాల కుర్చీలు వరుసగా డజన్లకొద్దీ ఖాళీలవటం ప్రారంభించాయి. ఆ ఉద్యోగులంతా వీథులు బట్టారు. కొద్ది నెలలో పెద్దపెద్ద మార్పులన్నీ జరిగిపోయాయి.

అసలు ఫోర్డు మోటారు కంపెనీ తదంగం అంతా, అతి గుట్టుగా, పరుల కభేద్యంగా, సంఘంతో అంటీ ముట్టకుండా ఉండేది. అల్లాంటిది ఒక్కసారిగా, ఫోర్డు కంపెనీ నిర్వాహకోద్యోగులంతా, పౌరజన వ్యవహార సంఘాలలో, క్లబ్బులలో, ప్రముఖపాత్రలు వహిస్తూ కలిసిమెలసిపోతూవచ్చారు. ఏమన్ను రిపోర్టర్లు కంపెనీ ఛాయలకు పోవీలుండేదికాదు. ఇప్పుడు కంపెనీ ఉద్యోగులే రహస్యం అనేది లేకుండా, బాహాటంగా తమ విషయాలు పత్రికలకు చెప్పుకొనే స్థితికి వచ్చారు.

చిన్న ఫోర్డు దేశమంతా పర్యటన ప్రారంభించాడు. మూలమూలల ఉన్న తమ ఏజంట్లు, డీలర్లు, అక్కడక్కడి సంఘపెద్దలు, అందర్నీ కలుసుకొని సంప్రదింపులు సాగించి, పరిశ్రమనభివృద్ధిపరచటం సాగించాడు. ఫోర్డు యంత్రాగారాలు ఉన్నచోట, పెద్దా మనుకొన్నచోటా ప్రతిచోటా ఈ విధానం అవలంబించాడు. ధరలను తగ్గించేందుకు వీలైన విధానాలన్నిటిమీద, అందరి సలహాలు పుచ్చుకొన్నాడు. ఆ సలహాలు కోట్ల ఆదాయపు రూపంలో ఫోర్డు కంపెనీపట్ల ఫలించాయి.

శ్రీమతి సరోజినీదేవి

శ్రీమతి కమలాదేవి చట్టోపాధ్యాయ

[ఈ వారంలో 13 వ తారీఖుకు శ్రీమతి సరోజినీదేవికి 70 ఏండ్లు నిండినవి. ఆమె జన్మదినోత్సవం జరిగినది. సరోజిని భారతీయ మహిళా లోకానికి ఆదర్శప్రాయమైనది. సరోజినీదేవి బాంధవ్యంలో ఆత్మీయమైన పరిచయంగల శ్రీమతి కమలాదేవి చట్టోపాధ్యాయ, ఆమెనుగూర్చి వ్రాసిన వ్యాసమును ఇక్కడ ప్రచురిస్తున్నాము.]



ఇరవయ్యోశతాబ్దం మహిళాయుగ మని కొందరు అభివర్ణిస్తుంటారు. కల్లోలతరంగాయితమైన మానవజీవితంలో ఇదొక తరంగమై వెల్లువకు కాంతివికాసాల నిచ్చింది. పందొమ్మిదవ శతాబ్దిలో ఉన్నతాశయాలతో ఉద్యమ మారంభించిన మహిళామణులు కొద్దిమందే అయినా, ఇప్పుడు మహిళోద్యమం మహా ప్రవాహంగా విస్తృతి చెందింది. ప్రతిదేశంలోనూ మహిళోద్యమకారులు స్త్రీ పురుష వివక్షత పక్షపాతాలుతే కాకుండా, సమాజంలోని పీడిత వర్గాల పక్షానకూడా నిలిచి పోరాడుతున్నారు.

భారత దేశంలో స్త్రీలకు పరంపరాగత సంస్కృతి, ఆచారాలు ఈ ఉద్యమంలో చక్కగా తోడ్పడినాయి. పూర్వకాలంలో ప్రతిరంగంలోనూ స్త్రీలు పాల్గొనేవారు. జాతీయ జీవనంలో ప్రతి ఉద్యమంలోనూ వారి కృషి చిహ్నాలు స్పష్టంగా గోచరిస్తాయి. విజ్ఞానాభివృద్ధికి వారు చేసిన సేవ అపూర్వమైనది.

శ్రీమతి సరోజినీ నాయుడు—గవర్నరు పదవి కుంటే ఓరుదుల్లోకూడా పిలవకపోయినా ఆమె గౌరవానికి భంగం కలగదు. ఆమె వ్యక్తి ప్రతిభకి, గుణసంపదకి ఇటువంటి ఆడంబరాలు మెరుగుపెట్టలేవు—ఆ పురాతన సంస్కృతిని సంపూర్ణంగా గడించుకొన్న భారత మహిళామణుల్లో శ్రీమతి సరోజినీదేవి ఒకామె. ఉన్నతస్థితిని, పదవిని పొందడానికి ఆమె శ్రమ పడవలసిన అగత్యం లేదు. నాయకత్వం ఆమె సహజ గుణసంపదలో ఒకటి అనిపిస్తుంది.

ఆమెకు నాయకత్వం నైసర్గిక స్వభావమేనని తోస్తుంది. ఎవరూ ప్రత్యర్థిగా ఉండరు. అధిక్షేపించలేరు. ఆమె నాయకస్థానంలో ఉండడం గర్వకారణం. అందువల్ల ఆమెరికా పదవి నివ్వడం గౌరవంగా భావిస్తారు.

భారతదేశ మామెను గుర్తించి ఆమెకు నీరాజనాలెత్తి, తద్వారా, స్త్రీత్వం పట్ల తన కున్న సహజగౌరవ ప్రపత్తులను వెలువర్చి, "భారతనారీత్వా"నికి నీరాజనా లెత్తింది.

ప్రపంచంలో, ఎంతెంతటి తీవ్రప్రతిఘర్షణలను ఎదుర్కొని, ఎంతటి విషమస్థితుల ననుభవించి, ఎంతటి విపత్తికర్తమైన నిరసనాలను, ఈసడింపులను, వ్యగ్రతలను భరించవలసివస్తోందో తెలిసికోవాలంటే భారతదేశపు పొలిమేరలను దాటి వెళ్తేగాని మనవాళ్లకి తెలియదు. అప్పటికిగాని; ఎంతటి స్నేహపూరితమైన వాతావరణంలో, ఎంతటి సౌహార్ద్రమధ్యంలో, ఎంతటి సానుభూతి, సహాయాలతో తాము ఆదరింపబడి పెంచబడ్డారో భారతనారీమణులు సమంగా అవగాహన చేసికోలేరు. అల్లాంటి దేశం కనకనే తన కవిత్వం మొగ్గవిడుస్తున్న ఆ పసిరోజుల అబలాత్వంలో, సరోజినికి సమమైన పుష్టినీ చేకూర్చగల శుభ్రవాతావరణం, తన కవిత్వపు మొగ్గ పరిపూర్ణంగా వికసించగల, సహృదయాభినందనమూ, పుష్కలంగా చేకూరాయి.

బానిసదేశమై, సంఘము క్షీణించి పోతూ, ఆర్థికంగా సర్వవినాశనమై పోయిన కాళరాత్రి యుగపు మేఘాచ్ఛన్న ఆకాశ వినీలములో ఉజ్జ్వల తారగా మినుకుమినుకు మంటూ ఆమె వెలుగసాగింది.

ఆధునిక యుగంలో ప్రఖ్యాత నారీమణుల శ్రేణిని పరికించుకొంటే, ఒక్క భారత దేశ స్త్రీలలో మాత్రంగానే కాకుండా, ప్రపంచ నారీమణుల శ్రేణిలో కూడా, సరోజినే ప్రఖ్యాతంగా నిలుస్తుంది. ఆమెలో భారతదేశ పురాణపుణ్యసందయే యేదో మూర్తీభవించు కొంది. ముక్కవోయి, జీర్ణ స్థితిలో నున్నా కూడా, ఆ భారతమాతృపురాణ సంపద్విశేష మేదో;—తన ఉజ్జ్వలకాంతిని, తన ఆత్మవిశిష్టతను,—గంభీరానుభవదత్తమైన ప్రశాంతిని—వివిధ వ్యవస్థా విధానాలను సమ్మేళనమొనర్చుకొని, ఏకీకృత సుందర ప్రౌఢిమతో పరిఢవిల్ల చేసే సమన్వయతను— విశాలదృష్టితో మానవ లోకాన్ని చూచి, తాదాత్మ్య మనుభవించి, గమనించగల మానవత్వాన్ని,—ఆమెలో మరల లోకానికి ప్రసరింపచేసుకొంది.

ఈ సంపద అంతా కూడా, సరోజిని గీతాలు రచించినప్పుడు, పాడినప్పుడు, ఉపన్యాసవేదికలపై నుంచి ప్రజా సమూహాల నుద్బోధ లూగించినప్పుడు, మహాసభామంటపాల నలంకరించినప్పుడు—ఆమెకు అండగా, భూమికగా, అగోచరంగా ఆమెవెనకనే నిలచింది.

సరోజినికీ ఆమెచుట్టునున్న తక్కినవారికీ ఎప్పుడూ పోలిక లేదు. ఆమె ధరించిన దుస్తుల వద్దనుంచీ, ఆమె కొక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని చ్చేవి. ఆమె నలుగురిలో అల్లా ప్రత్యేకవిశిష్టతతోనే నిలచేది. అంతర్జాతీయసమావేశాలలో ఆవిడను చూచినవారు ఆ ప్రత్యేకవిశిష్టతను గమనించిఉంటారు. ఆమె మాట్లాడినప్పుడు ఒక కొత్తనాదం వినిపించేది. భారతమాతృభూత భవిష్యత్ స్థితులు రెండూ ఆ మాటలలో ప్రతిధ్వనించేవి. నిరాయుధులైన నలువదికోట్లమంది భారతీయులు సాయుధుడైన ప్రబలవైరితో యుద్ధానికి పూనుకోగలిగేందుకు మూలశక్తి యేదో ఆ మాటలమరుగున శ్రోతలకు గోచరించేది. ఆ పలుకుల ద్రాక్షాపాక లాలిత్యంలోనే, భారతీయ హృదయమార్దవము, వైశాల్యము, సత్యసంపద గోచరించేవి. ఆత్మవిశ్వాసంతో, ఐహికవాదాల మరుగున ఆత్మబలంగోల్పోకుండా, అజేయమైన ధర్మపథాన్ని అంటిపెట్టుకొని భారతీయులు ప్రవర్తించగలిగిన ఆత్మబల మేదో, అది ఆమెమాటలలో గోచరించేది.

ఆమె అన్నిమతాల ప్రజలకు నచ్చేటట్లు మాట్లాడగలిగేది. అన్నిరకాల ప్రజానీకానికి అర్థమయ్యేటట్లు చెప్పగలిగేది. కారణం ఆమె ఏ ప్రజలలో జన్మించిందో ఆ ప్రజలకు, "విశిష్టమతం" అన్న అహంభావం లేదు. "ఈ మతంలో చేరకపోతే నరకానికి పోతారు" అన్న వాదం లేదు. యుగయుగాలుగా భారతదేశం సంచయపరచుకొన్న ఈ విజ్ఞానమే ఆమె ప్రార్థనగీతాలలో వ్యక్తమవుతుంది. ఆస్తికనాస్తికవిభేదం కూడా లేకుండా సర్వజన సౌజన్యాన్ని గుర్తించిన మతం భారతదేశ మతం. కారణం, విజ్ఞానానికి మానదండాలు వేరు. మానవత్వము, సచ్ఛీలము, సౌజన్యము - ఇవి కొలతలు. వీటనే సత్య అహింసా, రూపాలలో గాంధీజీ తనలో మూర్తీభవింపచేసుకొన్నాడు.


సాంప్రదాయికమై పరంపరాగతమైన ఈ భారతీయ సంపద్విశేషంవల్లనే, సరోజినీ, సహజంగానే విశ్వజనీనగా విలసిల్లగల్గింది. ప్రపంచంలో, ఆమెకు తనదే, గానిదీ, అన్నచోటు లేదు. అందుకనే గర్భదరిద్రులతో కూడా అంత మమైక్యం పొందగల్గింది. వాళ్ళ నిరాశలలో, వాళ్ల నిస్పృహలలో తానూ ఒకర్తిగా అవగలేది. మళ్లీ ఇటు మహారాణులు, మహిళా సంఘాల ... వాళ్ళతో కలిసిపోగలిగేది. అసలు వీళ్ళతో కలిసిపోగలగటమే మరీ కష్టం. కేవలం పౌడర్ల పూతలతో తమ ముఖాలకు అందాలు తెచ్చుకో ప్రయత్నించే ఈ సీతాకోకచిలకల్లోనుంచికూడా, కొన్ని నిప్పురవ్వలను ప్రజ్వలింపచేయగలిగినందుకు ఆమె నెంతైనా అభినందించాలి. సరోజిని ఈ ఈడు, ఆ యీడు అని కాకుండా అన్ని 'యీడు ల'కు చెందిన వ్యక్తి. పసిపిల్లలతో పసిపిల్లయైపోయి వాళ్లతోపాటు ముద్దుమాటలతో అలపించగలదు శతవృద్ధులప్రక్కన కూర్చుని పురాణ కాలక్షేపం చేసి, వాళ్ల కన్నులలో ఆనందం నెలకొల్పగలదు. అన్నిటికీ కారణం ఒక్కటే. ఆమె సంపూర్ణ మానవత్వంతో నిండిన స్త్రీమూర్తి. అందుకనే అందరికీ అంత తేలికగా అందుబాటులో ఉండేది. నీరసులకు, అసహాయులకూ అంత అండగా అనిపించేది.

సరోజిని అనేకవిధ కార్యకలాపాలలో పాల్గొన్నది. అనేకవ్యక్తిత్వాలను తనలో లీనమొనర్చుకొంది. ప్రతీదానిలోనూ విశిష్టతనే వెలువర్చుకొంది. కవయిత్రి - సమర మొనర్చిన వీరనారి - విప్లవనాయకి - నేడు రాష్ట్రగవర్నరు - విస్తృతజీవనరంగమామెది. లక్నో ప్రభుత్వ భవనం, ఆమె వ్యక్తిత్వముద్రనే తనపైకూడా ముద్రించుకొంది. గృహిణినిబట్టే గృహము! ప్రభుత్వపు బాదరాబందీతో ఇరకాటకంగా కంటకంగా కనిపించాల్సిన ప్రభుత్వ గృహం కూడా, ఆడగవర్నరువాసనతో, అందాలు ఒలికించుకొంటూ ఒయ్యారంగా కనిపించి, అతిథులకు ఆకర్షణీయమైన గృహంగా తయారయింది.

ఆనందంతో కలకలలాడే ఇల్లుగా తయారయింది. సరోజినికి నిజంగా ఈ పదవి చాలా సముచితమైన పదవి. ఏ పూర్వయుగానికో చెంది ఉంటే, ఆమె బహుశా ఏ మహారాణియో అయి తన చల్లని పరిపాలనలో, ప్రజలకు జీవితసౌఖ్యాలు ఒనగూర్చి, శాంతంగా, పరస్పరసౌహార్ద్రంతో బ్రతికటమెల్లాగో వాళ్లకు నేర్పి ఉండేది.

సరోజినిని, కవయిత్రిగా, వక్తగా, రాజకీయ వేత్తగా, ఈనాడు గవర్నరుగా చాలా మంది ఎరుగుదురు. కాని ఆమెలోని మాతృహృదయము బహుకొద్దిమందికే ఎరుక. తన పిల్లలకై ఎంత జాగ్రత్త తీసుకొంటుందో; వంటల్లో ఎంత నేర్పరో, తన బిడ్డలు తిండితినవని మారాం చేస్తే ప్రత్యేకఫలహారాలు చేసి వాళ్లకెల్లా నోరూరిస్తుందో; తన బిడ్డల భంగిమలను, పరివర్తనలను, చిరాకుపరాకులను కనిపెట్టి, ఎల్లా హృదయంతో లాలించి, వాళ్లను ఇట్టే నవ్వుపువ్వుల్లో తేలుస్తుందో—ఆమెలో ఎంత మాతృత్వముందో—అది చాలా కొద్దిమందికే ఎరుక. ఎల్లాటి కష్టాల్లోనైనా, అంత చిరునవ్వుతో ధైర్యంగా ఉండగలగటం బహు కొద్దిమందికే చేతవుతుంది. ఆ కారణం చేతనే ధనికులు బీదలు పెద్దలూ పిన్నలూ, పండితులూ, పామరులూ, ఆబాలగోపాలమూ, తరతమభేదాలు లేకుండా, "అక్క" అని పిలవగల్గుతారు. ఆమె అందరికీ "అక్క" అయింది. (N.I.P.P.)


రోపర్ నిర్వచించిన నాలుగు కార్మికావసరాలలోను ప్రథమ అవసరం తీర్చటంలో ఫోర్డు ఉత్తీర్ణుడయాడు. ఆ మార్గం పట్టటంవల్ల తక్కినవాటిపట్లకూడా శ్రద్ధా, కృషీ చూపిస్తున్నాడు. చేయవలసినపని చాలా ఉండవచ్చు. కాని అనుసరించవలసిన మార్గం స్ఫుటంగా, సూటిగా అనుసరించటంవల్ల, ఆ విషయం అక్కడ పనిచేసే కార్మికులందరికీ ప్రస్ఫుటం చేయటంవల్లా అతని మార్గం కొంత సుకరమయింది. కాని ఆ దేశమంతటా ఫోర్డు కంపెనీలలో 1,30,000 మంది కార్మికు లున్నారు. అందరికీ విస్తృతంగా ఈ విధానం అవలంబింపచెయ్యగలగటంలో ఫోర్డుకి కొంత కాలవిలంబన మనవచ్చు. కాని అవలంబించిన విధానం, అక్కడి కార్మికులకు ఉత్సాహజనకంగానే ఉంది. ఫోర్డు తన కంపెనీవిషయంలో పూర్తి ఫలితాలను చూపించగలిగితే, ప్రపంచ పారిశ్రామిక శాంతిమార్గం చూపించి యజమాని-కార్మిక క్లిష్టసమస్యలో ఉన్న ప్రాథమిక సమస్యను పరిష్కరించుకొనేందుకు మార్గం చూపించగలడేమో అనుకొంటున్నారు. ఫోర్డు కృతకృత్యుడౌతాడా అన్న అనుమానంగలవాళ్లు కూడా, "ఏమో మార్గం మంచిది. ఆశయం ఫలించే ఆస్కారంకూడాఉంది" అంటున్నారు.



సర్వోదయ దినమున హనుమకొండలో కాంగ్రెసువారు వీధులు శుభ్రపరచుచున్నారు.

అబ్రహాం లింకన్

ఈ ఫిబ్రవరి 12న, అమెరికా, అబ్రహాం లింకన్ 140వ జన్మదినోత్సవం జరుపుకొంది. లింకన్‌కు, మహాత్మాగాంధికి ఒకే విధమైన మృత్యువు సంభవించింది. లింకన్‌ను ఆదర్శపురుషుడుగా అమెరికన్లు చెప్పుకొంటారు. కాని అల్లాంటివాడైనా అక్కడ పేరులోకి రావాలంటే, ఇక్కడ మన గాంధీకి వలె కాకుండా, ఇతర ఆగంతుక కారణాలు ఎన్ని ఎల్లా కలిసిరావలసి వచ్చిందో ఈ వ్యాసంలో తెలుస్తుంది. సంగ్రహంగా అతని జీవితచరిత్ర ఇది: లింకన్ ఫిబ్రవరి 12, 1809లో కెంటుకీ రాష్ట్రం, హార్డియన్ తాలుకాలో జన్మించాడు. అతనికి ఎనిమిది ఏళ్ల అప్పుడు అతని కుటుంబము ఇండియానా రాష్ట్రానికి వచ్చింది. సరిగ్గా బడి కెళ్ళి చదువుకుండే అవకాశం ఎక్కువ కలగ లేదు. కాని లింకన్ ఇంటిదగ్గిరే అనేక గ్రంథాలు, అతి శ్రద్ధగా ఆ ఈడు లోనే చదివాడు. 1832లో మిలిటరీ శిక్షణ అందుకొన్నాడు. 1833లో పోస్టు మాస్టరు పని చేశాడు. ఆ రోజుల్లోనే లా చదివి, తర్వాత ఇలినాయిస్‌లో ప్రాక్టీసు చేశాడు. 1846లో, అమెరికన్ హౌస్ ఆఫ్ రిప్రజెంటెటివ్స్‌కు, ఇలినాస్ రాష్ట్ర ప్రతినిధిగా ఎన్నికయాడు. 1856లో రిపబ్లికన్ పక్షంలో చేరాడు. 1860లో అధ్యక్షుడయ్యాడు. 1864లో మళ్లీ అధ్యక్షపదవికి ఎన్నుకొన్నారు. 1865 ఏప్రెల్ 14న, ఫోర్డు థియేటరులో ప్రదర్శనం చూస్తుండగా, హంతకుడు అతన్ని తుపాకితో కాల్చి చంపాడు.



వాషింగ్టన్‌లో లింకన్ స్మారకవిగ్రహం

"అబ్రహాం లింకన్ అమెరికా అధ్యక్షుడయ్యేందుకు ఐదు కారణాలు. పరస్పర సంబంధము లేనివి—దేశకాలపాత్రసమైక్యం లేనివి—ఐదు కారణాలు [illegible] కలిసివచ్చాయి" అని లిన్ సమ్మర్ అనే ఆయన "మీట్ అబ్రహాం లింకన్" అబ్రహాం లింకన్‌తో పరిచయం—అన్న అర్థం ఇచ్చే నామంగల గ్రంథంలో విశదీకరించాడు.

అతని శీలచరిత్రము, అతని వచోగాంభీర్యము, శ్రోతలను వశపరచుకోగల వక్తృత్వము, అతని రాజకీయవిజ్ఞానము ఇత్యాదులు కారణాలనుకొంటారేమో—కాదట—వేరే ఐదు కారణాలున్నాయట.

ఆ ఐదు కారణాలు ఇవిట: "200 డాలర్లు ఇస్తాను, ఒక ఉపన్యాసం ఇవ్వవలసింది" అని ఒక సభవారి ఆహ్వానం - ఫలానా విద్యార్థి ఒకడు హార్వర్డు ఎన్ట్రెన్సు పరీక్ష తప్పటం - ఇలియనస్ రాష్ట్రం డెకటూర్ పట్టణంలో ఒక రాజకీయ నాయకుడికి అమాంతంగా ఓ బ్రహ్మాండమైన సంకల్పం కలగటం - ఒక అచ్చాఫీసు మేనేజరు తాను అచ్చువేసి ఇస్తానన్న కాగితాలు సకాలానికి ఇయ్యలేక పోవటం - ఈ నాల్గింటికీ తలమానికంగా, ఐదోది - ఓ రాజకీయముఠావారు ఓ అర్ధరాత్రివేళ గూడుపుఠాణీ చెయ్యటం— ఈ ఐదూనట అబ్రహాం లింకన్ అధ్యక్షుడవటానికి కారణాలుగా ఉపకరించినవి - కాకపోతే మామూలుగా తెలిసిన చరిత్రకు ఇవి భిన్నంగా ఉన్నాయని అనిపిస్తే, కాస్త ఆ నాటి చరిత్రనంతా మరిచిపోయి, యథార్థాలను జ్ఞాపకముంచుకొని, లింకన్ అధికారంలోకి ఎల్లా ప్రాకివచ్చాడో కాస్త శాంతంగా పరికించమంటాడు సమ్మర్.

ముందు, ఇలియనాస్ రాష్ట్రపు స్ప్రింగ్‌ఫీల్డ్‌లో లా ఆఫీసులో పెద్ద ప్రాక్టీసు లేక నిస్పృహుడై నీరవుడై చతికిలబడివున్న వ్యక్తిని జ్ఞాపకం చేసుకో మంటాడు.

అది 1859 సంవత్సరాంతము. అప్పటికి లింకన్‌కు 50 ఏళ్ళు. గత ఇరవై ఏళ్ళనుంచి న్యాయవాద వృత్తిలో ఉన్నాడు. సాలీనా 3000 డాలర్ల ఆదాయం. అది కూడా అతని కంపెనీకి డబ్బు రావటం ఆమధ్యే కాస్త మొదలు పెట్టింది. అతని కున్న ఆస్తి, నివసిస్తూన్న యిల్లూ, క్రాఫర్డు టామా జిల్లాలలో 160 ఎకరాల భూమి ఇంకేదో అక్కడక్కడ మరో నాలుగైదు ఎకరాల భూమీ-ఇది ఆస్తి. చేతులో నగదు బహుస్వల్పము - పట్టుమని పదివేల డాలర్లు అప్పుపుట్టే పరపతికూడా లేదు ఆనాటికి.

అతని స్నేహితుల్లో కొందరు అధ్యక్షపదవికి అబ్రహాంను అభ్యర్థిగా నిలబెట్టామని కబుర్లు మొదలు పెట్టారు. అతను వాళ్ళను సన్నసన్నగా మందలించాడు. "న్యూయార్కునుంచి విలియం హెచ్ సీవార్డు, ఓహియోనుంచి సాల్మన్ పిచేజ్, ఇల్లాంటి పెద్దలంతా ఉంటూండగా రిపబ్లికన్ పార్టీవారు నన్నెందుకు ఎన్నుకొంటారయ్యా!" అనేవాడు. కాని మనస్సులో అవాలని అపేక్షగానే ఉండేది. ఎందుకైనా ప్రజలతో కాస్త పరిచయం ఉంచుకోటం మంచిదని, ఉపన్యాస వేదికలెక్కటానికి పూనుకొన్నాడు. అదే కాకుండా, ఈ ఉపన్యాసాల వల్ల కొంత డబ్బు గాబడి ఏర్పరుచుకోటం కూడా చాల అవసరం అనిపించింది. బ్రూక్లిన్, ప్లిమత్ చర్చిలో ఉపన్యాసానికి 200 డాలర్లు ఇస్తామని వాళ్ళు పిలిచారు. లింకన్ వెంటనే ఒప్పుకొన్నాడు. ఆ ఒప్పుకోటానికి ఇంకో కారణం కూడా కలిసి వచ్చింది. లింకన్ కుమారుడు, హార్వర్డు విశ్వవిద్యాలయంలో చేరుదామని కేంబ్రిడ్జి ఎంట్రన్సు పరీక్షకు వెళ్ళాడు. 16 సబ్జక్టులలోనూ 15 సబ్జక్టులలో ఫేల్ అయాడు. ఇంక హార్వర్డు ఆశ వదులుకొని న్యూహాంప్‌షైర్‌లో ఉన్న ఫిలిప్స ఎగ్జిటర్ ఎకాడమీలో చదువు మొదలు పెట్టాడు. కొడుకు చదువు విషయం లింకన్‌కు మనాద పట్టుకొంది. ఈ ఉపన్యాసం మిషతోనైనా ఆ వైపు ఊళ్ళకి వెళ్ళి, అబ్బాయిగారు చదువెల్లా వెలగపెడ్తున్నాడో చూద్దామనుకొన్నాడు.

తీరా ఉపన్యాసానికి తిరుగుతుంతా జరిగాక, రాజకీయఉపన్యాసం గనక కాస్త జనం ఎక్కువ పట్టేహాలులో సభ పెట్టకోడం మంచిది అని, సభానిర్వాహకులు, సభను న్యూయార్కు కూపర్ యూనియన్ మందిరానికి మార్చారు. ఫిబ్రవరి 27 వతారీఖు, రాత్రి, గాలీవానా, ఎక్కువగా ఉన్నా కూడా, "ఈ పడమటి ఊళ్ళ ఒక్కనరం లాయరు ఎల్లామాట్లాడుతాడో, ఏదో వింతగా చెప్తున్నా"రనుకొంటూ దాదాపు 1500 మంది జనందాకా సభకు హాజరయ్యారు. అడ్మిషన్ టిక్కట్టొక్కంటికి పాతిక సెంట్ల చొప్పున 367 డాలర్లు దాకా గేటుదగ్గిర వసూలయింది. (అక్కడ ఉపన్యాసాలకు కూడ టిక్కట్లు ఉంటాయి.)

"న్యూయార్కులో మనవాడు మాట్లాడుతాడట" అనేటప్పటికి లింకన్ ముఖ్యస్నేహితులకే ఏమాకుందో అని బెరుకు పట్టుకొంది. కాని ఆ వేళ శ్రోతల్లో ఒకళ్ళు ఇల్లా వ్రాశారు. "కాని సభాభవనం అంతా నిశ్శబ్దంగా అతని ఉపన్యాసం వింటూ కూర్చుంది. అతని తార్కిక ప్రజ్ఞతో అందరూ విస్మితులయారు. ఉపన్యాసం ముగిసేటప్పటికి సభ్యులంతా ఎడతెగని హర్షధ్వానాలతో ఉపన్యాసకుని అభినందించారు.



అబ్రహాం లింకన్
(1860 లో డాగుర్రో విధానంలో తీసిన ఛాయాచిత్రం).

మర్నాడు న్యూయార్కు పత్రికలు ఈ ఉపన్యాసాన్ని ప్రముఖంగా ప్రకటించాయి. దాంతో న్యూయింగ్లాండులోని రిపబ్లికన్ పక్ష నాయకులు, ఎగ్జిటర్‌కు వచ్చే దోవపొడుగునా ఉపన్యాసాలియ్యవలసిందని లింకన్‌కు ఆహ్వానాలు పంపించారు. ఉపన్యాసాల వేడి అద్భుతంగా అంటుకొంది. దోవపొడుగునా "అఖండ"మైన స్వాగతాలూ, "బ్రహ్మాండ"మైన ప్రజాదరణా లభించాయి. ఆనాడు, తను పరీక్ష తప్పి న్యూహేంప్‌షైర్‌లో ఉంటున్నందుకు తన్ను చూద్దామని తండ్రి బయలుదేరకపోతే ఇదంతా జరిగేది కాదనే అంటాడు, అబ్రహాం లింకన్ కుమారుడు రాబర్టు లింకన్!

ఈ పర్యటనంతో తాను నిజంగా అధ్యక్షుడవవచ్చునేమో నని ఆశ పుట్టింది. ఇలియనాస్ రాష్ట్రంలో తన ఓట్లు తను తెచ్చుకోవచ్చును గానీ, దేశమంతటా ఓట్లు తెచ్చుకోవాలి. అందుకని రిపబ్లిక్ నాయకులకు ఉత్తరాలు వ్రాశాడు. వాళ్ళ ప్రోత్సాహం అర్థించాడు. నార్మన్ బి. జడ్ అనే నాయకుడు లింకన్ పక్షాన పూనుకొన్నాడు.

డికాటూర్‌లో ఓగిల్స్బే అనే మరో ఘట్టి స్నేహితుడు దొరికాడు. లింకన్ పూర్వాశ్రమంలో తనిజిల్లాలో ఇనుపపట్టాలు పగలకొట్టూ జీవనం సాగించాడని అతను విన్నాడు. లింకన్‌తో కలిసి ఆ రోజుల్లో పట్టాలు పగలకొట్టిన హాంక్ అనేవాడిని కనిపెట్టారు. అప్పటి రోజుల్లో పగలగొట్టిన రెండు పట్టాలతో సహా హాంకుని తీసికొని వచ్చి, ఎలక్షన్ ప్రాపగాండాలో రంగంమీద కెక్కించాడు. రంగం రక్తి కట్టింది. లింకన్ పేరుని అధ్యక్షస్థానానికి రిపబ్లిక్ కన్వెన్షన్ సమావేశము ఉపపాదించిరి.

మరో రెండు విషయాలుకూడా తోడ్పడ్డాయి. 1860 మే 16 వ రిపబ్లికన్ నేషనల్

(20 వ పేజీ చూడుడు)



లింకన్ కుటుంబము : భార్య, ముగ్గురు కుమారులతో



చిత్రం. 1857 నాటిది.

భారతీయ శాసనసభలో

★ బ్యాంక్ వ్యవహార నియమాలు
★ నిర్బంధసేవా నిషేధం
★ మనోవృత్తి నియమాల సవరణ

భారతీయ శాసనసభలో గతవారం బాంకులకు సంబంధించిన ఒక శాసనంపైన చర్చ జరిగింది. ఈవారం శాసనవివరాలపై చర్చజరుగుతోంది.

ఈ శాసనంలో సెలక్టుకమిటీ కొన్ని ముఖ్యమైన మార్పులు చేసింది. సెలక్టుకమిటీ విచారణ సందర్భంలో ఇండియన్ బాంక్స్ ఎసోసియేషన్ ప్రతినిధులనుమాత్రమే విచారించింది. సెలక్టుకమిటీ చేసిన మార్పులను, ఆర్థికమంత్రి డా॥ జాన్ మత్తయ్‌గారి వైఖరిని శ్రీ టి. టి. కృష్ణమాచారి, ప్రొఫెసర్ కె. టి. షా, శ్రీ యన్. జి. రంగా, టంగుటూరిప్రకాశం, మొదలైన వారందరూ తీవ్రంగా విమర్శించారు.

శాసనాన్ని ముందు వారంలో ప్రతిపాదించినప్పుడు ఆర్థికమంత్రి శాసనోద్దేశాలు వివరిస్తూ, బాంకుల వ్యవహారాల్లో కొన్ని దురభ్యాసాల్ని మాన్పి, దేశంలో ఆర్థిక సంపద్వృద్ధికి బాంకులు తోడ్పడే విధంగా ఈ శాసనం తయారుచేసినట్లు చెప్పారు. సభ్యుల కోరికపైన పరిశీలన నిమిత్తం సెలక్టుకమిటీకి ఒప్పగించడానికే అంగీకరించారు.

ఇప్పుడు చర్చకు సమాధాన మిస్తూ మంత్రిగారు ఈ శాసనం సమగ్రమైనది కాదని అంగీకరించారు.

దేశంలోని బాంకుల్లో, వ్యాపారాలకి పెట్టుబడి పెట్టుతున్న వానిపైన రిజర్వుబాంక్కు, అజమాయిషీ చేసే అధికారం, ఉత్తరువు లిచ్చే అధికారం ఈ శాసనం ఇస్తుంది. (రిజర్వుబాంకు ఇప్పుడు భారతప్రభుత్వ నిర్వహణలో ఉంది.)

అయితే ఈ శాసనం విదేశీ మారకపు బాంకులకు, ప్రైవేట్ బాంకులకు వర్తించదు.

సామాన్యంగా వ్యాపార బాంకులు డిపాజిట్లు ద్వారా తీసుకున్న ధనంలో ఎంత భాగాన్ని వ్యాపార, పరిశ్రమాదులకు పెట్టుబడి నిమిత్తం ఇవ్వవచ్చునో ఇంతవరకు ఎట్టి నియమం నిర్బంధం లేవు. ప్రస్తుత శాసనాన్ని అనుసరించి మొత్తముమూల ధనంలో నూరింట 20 వంతులకంటె అధికంగా పెట్టుబడి కివ్వరాదనీ, మిగతాది డిపాజిటర్లు అడిగినప్పు డివ్వడానికి ఉంచాలని విధించబడింది.

బాంకులు ఏ వ్యాపారంలోగాని, పరిశ్రమలోగాని వాటాలు తీసుకునేటప్పుడు ఆ పెట్టుబడి ఆ వ్యాపారసంస్థల మూలధనంలో నూరింట 20 వంతులకు మించరా దని శాసనంలో మొదట ఉన్న దానిని సెలక్టు కమిటీ నూటికి 40 వంతులకు హెచ్చించింది. నూటికి 40 వంతులకు అంగీకరిస్తే నష్టమేమీ లేదని డా॥ మత్తయ్ అన్నారు.

ఇటువంటి నియమం అవసరాన్ని వివరిస్తూ, ఇది లేకపోతే కొన్నికొన్ని వ్యాపార సంస్థలపైనా పరిశ్రమలపైనా బాంకులు పూర్తిగా అధికారం చలాయించడానికీ, గుత్త తీసుకోవడానికీ అవకాశం ఏర్పడుతుం దన్నారు. అటువంటి అవకాశం ఇవ్వడం మంచిది కాదు. ఒక్కొక్కప్పుడు బాంకుకీ, తద్వారా డిపాజిటర్లకీ తీరని నష్టం రావచ్చును.

1949 జనవరి 15 తేదీ తరవాత స్థాపించబోయే బాంకులు మూలధనంపైన నూటికి 9 వంతులకుమించి డివిడెండ్లు వాటాదార్లకు ఇవ్వకూడ దని మొదట శాసనంలో ప్రతిపాదించబడింది. కాని సెలక్టుకమిటీ ఈ నియమాన్ని పూర్తిగా తొలగించివేసింది. పాత బాంకులపైన ఇటువంటి నియమం విధించకుండా కొత్త బాంకులపైనే విధించడం న్యాయం కాదనీ, ఇతర వ్యాపారసంస్థలకీ, బాంకులకీ మధ్య పక్షపాతం చూపించకూడ దనీ సెలక్టుకమిటీ అభిప్రాయపడిందట. అయితే వ్యాపారసంస్థలన్నీ నూటికి 6 వంతులకంటె డివిడెండ్లు ఇవ్వరా దని విధించే శాసనం ఇంకొకటి ప్రస్తుతం పరిశీలించబడుతోంది కాబట్టి ఇట్టి నియమం ప్రస్తుత శాసనంలో లేకపోయినా ఫరవాలేదని మంత్రిగారన్నారు.

హామీ లేకుండా ఋణా లిచ్చే పద్ధతిని ఈ శాసనం పూర్తిగా నిషేధిస్తుంది. బాంకు డైరక్టర్లే స్వంత వ్యాపార పారిశ్రామికాది సంస్థలకు హామీ లేకుండా ఋణా లివ్వడంవల్ల అనేకసార్లు బాంకులు దివాలా తియ్యడం జరిగింది దివాలా తియ్యకపోయినా డిపాజిటర్ల డబ్బుని స్వంత వ్యాపారంలో హామీలేకుండా ఋణంతీసుకోవడమనేది డైరెక్టర్లకు సబబుకాదు. అయితే ఆ బాంకు డైరెక్టరు ఆ వ్యాపారసంస్థలో డైరెక్టరుగా ఉన్నంతమాత్రంచేత హామీ లేకుండా ఋణం ఇచ్చినా ఫరవాలేద నీ, మేనేజింగ్ ఏజంటుగారి హామీపైన ఋణాలు తీసుకునే భాగస్థుడుగాగాని ఉండకూడ దని ఈ సవరణ ద్వారా నిషేధించబడింది.

సెలక్టుకమిటీ చేసిన సవరణల్లో ముఖ్యమైన ఒక సవరణను ఆర్థికమంత్రిగారు అంగీకరించలేరని చెప్పారు. తదనుసారం క్లాజువారీ చర్చలో ఒక సవరణ ప్రతిపాదించగలరు.

అడిగినప్పుడు ఇచ్చే షరతుపైన డిపాజిట్లు తీసుకుని వ్యాపారంచేసే బాంకుల్ని ఈ శాసనం నుంచి మినహాయిస్తూ సెలక్టుకమిటీ శాసనంలో సవరణ చేసింది. దీనివల్ల శాసనోద్దేశమే విఫలమౌతున్నదని మంత్రిగారన్నారు. అందువల్ల ఆ మినహాయింపు తొలగిస్తూ మంత్రిగారు ఒక సవరణను ప్రతిపాదిస్తున్నారు.

దీనిపైన జరిగిన చర్చలో తీవ్రవిమర్శనలు వచ్చాయి. ఈ శాసనం సమగ్రంగా బాంకుల వ్యవహారాల్ని నియమబద్ధం చేయడం లేదనీ, శాసనోద్దేశం నెరవేరడంలేదనీ శ్రీ టి. టి. కృష్ణమాచారిగారు, ప్రొఫెసర్ కె. టి. షా మొదలైనవారు విమర్శించారు.

బాంకు డిపాజిట్ల ధనంలో పెట్టుబడి ఋణాలుగా ఎంతభాగం ఇవ్వవచ్చునో నిర్ణయించే విషయమై పరిశీలించేటప్పుడు సెలక్టుకమిటీ చిన్న బాంకుల అభిప్రాయం తెలుసుకోకపోవడం పెద్దలోపమని కృష్ణమాచారిగారన్నారు. వాస్తవానికి వ్యవసాయానికి, కుటీరపరిశ్రమలకి తోడ్పడుతున్నవి చిన్న బాంకులేగాని పెద్ద బాంకులు కావు. అసలు ఇటువంటి శాసనాన్ని ప్రవేశపెట్టేముందు బాంకుల పరిస్థితుల్ని, ఏయే బాంకులు ఎక్కడెక్కడ ఏ వ్యాపారపరిశ్రమాదులకు తోడ్పడుతున్నాయో అనే విషయాన్ని సమగ్రంగా పరిశీలించడానికి ఒక ఎంక్వయిరీ కమిటీని నియమించిఉండవలసిందన్నారు.

డివిడెండ్ల విషయంలో బాంకుల పరిస్థితి ఇతర వ్యాపార సంస్థలకంటె తేడా ఉందన్నారు. ఇతర వ్యాపార సంస్థల్లో వాటాదార్లు స్వంత ధనం పెట్టుబడి పెట్టి ఆటుపోటులకు తట్టుకుని, దానిపైన వచ్చే లాభాల్లో డివిడెండ్లు తీసుకోడం లేదు. డిపాజిటర్ల డబ్బుకు పెట్టుబడిపెట్టి (లేక ఋణం ఇచ్చి) దానిపైన వచ్చే లాభాల్లో డివిడెండ్లు తీసుకోడానికి డిపాజిటర్లందరికీ హక్కుండగా, మూలధనంపెట్టినవారే డివిడెండ్లు తీసుకోవడం అన్యాయం. అందువల్ల బాంకుల డివిడెండ్ల పద్ధతి వేరుగా ఉండాలి. ఈ శాసనంలోనే డివిడెండ్లు ఫలాని ప్రమాణానికి మించి తీసుకోకూడ దని నియమం విధించడం అవసరం.

ప్రొఫెసర్ కె. టి. షాగారు ప్రైవేట్ బాంకులికి, మారకపు బాంకులికీ ఈ శాసనాన్ని వర్తింపచేయకపోవడం న్యాయం కాదన్నారు. ఈ శాసనం డిపాజిటర్లకు కావలసిన రక్షణ ఇవ్వడం లేదన్నారు.

బాంకులు ముఖ్యంగా నాలుగు కర్తవ్యాలు నెరవేర్చా లన్నారు.

1. సాధ్యమైనంతవరకు నాణేలు, కరెన్సీ నోట్ల వాడకాన్ని తగ్గేవిధంగా వ్యవహరించాలి. కాని శాసనంలో దీనికి సంబంధించిన ప్రస్తావనైనా లేదు.

2. దేశంలో ఆర్థికసంపద్వృద్ధికి తోడ్పడాలి. దేశఆర్థికపరిస్థితుల్ని సహజసంపదని దాని వృద్ధి అవకాశాల్ని దృష్టిలో పెట్టుకుని సక్రమవిధానంలో ధనాన్ని పెట్టుబడికి వినియోగించాలి. కాని ప్రస్తుతం బాంకులన్నీ ధనవంతుల లాభాల వృద్ధికే వినియోగపడుతున్నందువల్ల, నిర్వాహకులకు దేశంగురించిన చింతే లేదు. ఈ సందర్భంలో ప్రస్తుతశాసనం ఏమీ ప్రయోజనం ఉండదు. బ్రిటిష్‌వారు మనదేశంలో సంపదను దోచుకోడానికి ఒక విధానం అవలంబించారు. ఆ విధానమే ఇంకా మనవారు అనుసరిస్తున్నారు. ఈ పద్ధతుల్ని సంస్కరించడానికి శాసనంలో ఏమీ సూచనలు లేవు.

3. పెట్టుబడిధనాన్ని సక్రమంగా దేశీయోత్పత్తివృద్ధికి, పరిశ్రమాభివృద్ధికి వినియోగపరచాలి. కాని ఫలానిపద్ధతులు అవలంబించా లనిగాని, ఫలాని అభ్యాసాలు మానాలనిగాని ప్రస్తుతశాసనంలో విధించబడలేదు. ఇంక ఈశాసనం దేని కుపయోగపడుతుంది?

4. బాంకులు చేసే ద్రవ్యవ్యాపారం దేశంలో అవసరపదార్థాల ఉత్పత్తికీ, పంపకానికీ, వినియోగానికీ సక్రమంగా తోడ్పడాలి. ఇందులో అదీ లేదు.

తరవాత షాగారు మారకపుబాంకుల్ని ఇంపీరియల్ బాంకుని ప్రస్తుతశాసనం వర్తించకుండా మినహాయించడం అన్యాయం అన్నారు. ఇంపీరియల్ బాంకు దేశీయసంస్థల్ని నిరుత్సాహపరుస్తోంది. విదేశీవ్యాపారాన్ని ప్రోత్సహిస్తోంది. విదేశీయులు పెట్టుబడి పెట్టి నడుపుతున్న బాంకు లన్నిటిపైనా కఠినిర్బంధాలు విధించవలసిన అవసరం ఉంది. ఇంపీరియల్ బాంక్‌ని ప్రభుత్వం స్వాధీనపరుచుకుని నిర్వహించవలసిన అవసరంఉందని షాగారు నొక్కి చెప్పారు.

ప్రభుత్వం బాంకుల వ్యవహారాలను స్వయంగా అజమాయిషీచేసి ఉత్తరువు లిచ్చే అధికారం తీసుకోవా లన్నారు. బాంకులికి ఏదో ముప్పు వచ్చిన తరవాతనే రిజర్వుబాంకు జోక్యం చేసుకోవాలని శాసనంలో విధించినది బొత్తిగా చాలదు. ఇటువంటి నియమంవల్ల ఒనగూడే ఉపకారం ఏమీ ఉండదు. ఎప్పుడూ బాంకుల్ని తనిఖీ చెయ్యడానికి ప్రభుత్వం ఇన్స్పెక్టర్లని నియమించాలి. అప్పుడే డిపాజిటర్ల ధనాన్ని రక్షించడానికి వీలుపడుతుం దన్నారు. ఇంపీరియల్ బాంకుని ప్రభుత్వం స్వాధీనపరుచుకోవాలని, శ్రీ యన్. జి. రంగా, శ్రీ టి. ఏ. రామలింగంచెట్టి మొదలైన సభ్యులు చాలామంది సూచించారు.

సహకారపద్ధతి బాంకుల్ని ప్రోత్సహించాలనీ, ప్రస్తుతశాసనంవల్ల ఆ బాంకులి కేమీ ఉపకారం కలగదనీ రామలింగంచెట్టిగారన్నారు. దేశంలో వ్యవసాయదారుల కుపయోగపడుతున్న సంస్థ లేవైనా ఉంటే అవి సహకారబాంకులే. సహకారబాంకులపై డైరెక్టర్ల సంఖ్యలో నూడింట రెండు వంతులు ఋణాలు తీసుకునేవారు, మిగిలిన ఒక వంతు డిపాజిటర్లు. అయినా ఈ బాంకులికి డిపాజిట్లు ఎప్పుడూ లోటు రాలేదు. పెట్టుబడికి ధనం లోటులేదు. ఈ బాంకులు వాటాదార్లకు నూటికి 3½ వంతులకు మించి డివిడెండ్లు ఇవ్వవు. నూటికి 2¼ వంతున వడ్డీకి రైతులకు ఋణా లివ్వడ మగుతున్నాయి. అందువల్ల సహకారసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం ఇంకా తోడ్పడా లన్నారు.

శ్రీ రంగాగారు చెన్నరాష్ట్రంలో సర్కారు జిల్లాల్లో రైతులపెట్టుబడితో స్థాపించిన 129 సహకారసంస్థలకి (ఉత్పత్తి వినిమయదారుల సమిష్టి సహకారసంఘాలు) రెండున్నర మాసాల్లో కోటిన్నరరూపాయల మూలధనం చేర్చారని చెప్పారు. ప్రజలకు పెద్దబాంకుల్లో విశ్వాసం లేదు. పెద్ద బాంకు లెప్పుడూ వాస్తవంగా ప్రజల కుపయోగపడటంలేదు. ఇటువంటి వానిని సంస్కరించడంలో ప్రభుత్వం కనికరం చూపకూడ దన్నారు.

ఆర్థిక మంత్రి డా॥ జాన్ మత్తయ్‌గారు చర్చకు సమాధాన మిస్తూ వ్యాపార బాంకులు ప్రభుత్వం స్వాధీనపర్చుకోతగినవి కావన్నారు. ప్రస్తుత శాసనం సమగ్రమైనది కాదని అంగీకరించారు. కొన్నికొన్ని దురభ్యాసాలు మాన్చడానికి వెంటనే ఇది అవసరం వచ్చింది.

మొదట ఇటువంటి శాసనం 1939 లో తలపెట్టబడింది. అప్పటినుంచీ మొత్తం మూడు సెలక్టు కమిటీలు ఈ శాసనాన్ని పరిశీలించాయి. ఈ మధ్య సంవత్సరాల్లో బాంకుల వ్యాపారానుభవాన్ని బట్టి ప్రస్తుత శాసనం అత్యవసరమైనదిగా తలిచి ప్రవేశపెట్టారు. కాని ఇది సమగ్రమైనది కాదు.

ఇప్పుడు వస్తువుల ధరలు చాలా అధికంగా ఉన్నాయి. చలామణీ పరిమాణం అపారంగా పెరిగిపోయింది. కాని ఇవి పెరగగలిగినంత పెరిగాయనీ, ఇప్పు డొక్కసారిగా ఆర్థిక దుస్థితి వస్తుందేమోననీ చాలామంది భయపడుతున్నారు. ఇక్కడతో ధరలు, చలామణిమొత్తం నిలిచిపోవడమేనా జరుగుతుంది. లేదా ఒక్కసారిగా ధరలు పడిపోయి పెట్టుబడిదారులు దెబ్బ తినవలసిన అవసరం రావచ్చు.

ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వ్యాపార సంస్థల భవిష్యత్తును నిర్ణయించాలే గాని బాంకుల్ని ప్రభుత్వం స్వాధీనపరుచుకోలే దని విమర్శిస్తే లాభం లేదని చెప్పారు.

ఇంపీరియల్ బాంక్ విషయమై ప్రభుత్వం స్వాధీనపరుచుకోవడం మంచిది కా దన్నారు. అయితే ఆ బాంకు వ్యవహారాలు ప్రభుత్వానికి కూడా అసంతృప్తికరంగానే ఉన్నాయి. అందువల్ల ఇంపీరియల్ బాంక్ శాసనాన్ని సవరణచేసే విషయమై త్వరలో ప్రభుత్వం ఆలోచిస్తుం దన్నారు.

సహకారసంస్థల నిర్వహణలో స్వయంగా అనుభవం ఉందని మత్తయ్‌గారు చెప్పారు. ఒకప్పుడు సహకారోద్యమంలో పెద్దఆశలు పెట్టుకొని పాల్గొన్నప్పటికీ మనదేశంలో ఈ ఉద్యమం వాస్తవంగా ప్రయోజనకరం కాలే దని అనుభవంపైన తెలుసుకున్నట్లు చెప్పారు. సహకారోద్యమంపైన వ్యవసాయం ఎన్నడూ ఆధారపడలేదు. ఆధారపడినట్లయితే ఎన్నటికీ వృద్ధికాదు.

తరువాత బాంకులు పెట్టుబడి పెట్టడంలో వ్యాపారసంస్థల మూలధనంలో నూరింట 40 వంతులకు మించి పెట్టుబడి పెట్టకూడ దనే నియమాన్ని నూటికి 30 వంతులకు మార్చడానికి కృష్ణమాచారిగారు ప్రతిపాదిస్తున్న సవరణను, బాంకుల వాటాదార్ల సంఘాల్లో ఏ ఒక్కవ్యక్తికీ మొత్తం వోట్లలో నూరింట 10 వంతులకు మించి ఇవ్వకూడ దనే నియమాన్ని నూరింట 5 వంతులకు మార్చడానికి ప్రొఫెసర్ షా ప్రతిపాదిస్తున్న సవరణను అంగీకరిస్తున్నట్లు కూడా మత్తయ్‌గారు చెప్పారు.


తేయాకు పరిశ్రమ

బాంకుల శాసనం కాక గతవారం తేయాకు పరిశ్రమకు సంబంధించిన శాసనం ఒకదాన్ని వాణిజ్యశాఖామంత్రి కే. సి. నియోగిగారు ప్రతిపాదించారు. ఈశాసనంవల్ల ఇప్పుడున్న ఇండియన్ టీ బోర్డుస్థానే ప్రభుత్వం ఇండియన్

(20 వ పేజీ చూడుడు)

గాంధీజీహత్యాభియోగవిచారణసమాప్తి

గాడ్సే, ఆప్టేలకు మరణదండన, అయిదుగురికి యావజ్జీవకారాగారవాసం, ఒకరికి క్షమాదానం, ఒకరి నిర్దోషనిరూపణ



నాథూరాం గాడ్సే, ఎమ్. దత్తాత్రేయ ఆప్టే

గాంధీజీహత్య జరిగి సరిగ్గా సంవత్సరంపైన పది రోజులు గడిచింది. భారతీయులు యావన్మందీ ఉత్కంఠతో నిరీక్షిస్తున్న హత్యాభియోగఫలితం ఫిబ్రవరి 10 వ తేదీ గురువారం ఉదయం 11-30 గంటలకు ప్రకటించబడింది. ఆ రోజున ఢిల్లీ నగరంలో పురాతన దుర్గమైన లాల్ ఖిల్లా ఆవరణ అంతటా, చుట్టూ, రక్షణనియమాలు అతికఠినంగా విధించారు. పోలీసులు, సైనికులు దుర్గప్రాంతాన సాయుధులై నిలిచారు. న్యాయస్థానానికి వెళ్ళే ప్రతి ఒక్క మనిషినీ పరిశీలించి మరీ లోనికి వెళ్ళనిచ్చారు. 11-20 గంటలకు నిందితులను పోలీసులు తీసుకువచ్చారు.

న్యాయమూర్తి శ్రీ ఆత్మాచరణ్ గారు సరిగ్గా 11-30 గంటలకు వచ్చి తీర్పు చదివారు. నిందితులు ఒకరితరువాత ఒకరు లేచి శిక్షలను విన్నారు. నాథూరాం వినాయక గాడ్సే, నారాయణ దత్తాత్రేయ ఆప్టేలకు మరణశిక్ష విధింపబడింది. విష్ణు రామచంద్ర కర్కారే, మదన్లాల్ కాశ్మీరీలాల్ పహవా, శంకరకిష్టయ్య, గోపాల్ వినాయక గాడ్సే, డా॥ దత్తాత్రేయ సదాశివ పర్చూరేలకు యావజ్జీవ కారాగారవాసశిక్ష విధించబడింది. హిందూ మహాసభ సంస్థాపకులు వినాయకదామోదర సావర్కర్ గారిపై దోషము నిస్సందేహముగా నిరూపించబడలేదని చెప్పుచూ వారిని వెంటనే విడుదల చేయవచ్చునని చెప్పారు. దిగంబర రామచంద్రబాడ్గే క్షమార్హుడైనందున క్షమాదాన మివ్వబడింది.

గాంధీజీని హత్య చెయ్యడానికి పైతొమ్మిది మందిలో ఎనిమిదిమంది (సావర్కర్ మినహా) మరి ముగ్గురు వ్యక్తులతో చేరి కుట్రచేసినట్లు నిరూపించబడిందని శ్రీ ఆత్మాచరణ్ గారు తీర్పులో వివరించారు. మిగతా ముగ్గురు నిందితులు, గంగాధర దండవతే, గంగాధర యాదవ్, సూర్యదేవశర్మ పరారయినారు. పోలీసులకు దొరకలేదు. నిందితుల దోషనిరూపణలో తోడ్పడి, నేరానికి పశ్చాత్తాపం వెలిబుచ్చినందువలన దిగంబర రామచంద్ర బాడ్గేను క్షమించారు. సావర్కర్ గారిపై నేరానికి అప్రూవర్ బాడ్గే సాక్ష్యం తప్ప వేరే ఆధారం లేదు. ఆ సాక్ష్యమైనా నేరాన్ని స్పష్టంగా ఋజువుపరచలేదు. సందేహానికి తావున్నది. అందువలన వారిని నిర్దోషిగా పరిగణించి విడుదలచేయవచ్చునని చెప్పారు.

హత్య చేసినవాడు గాడ్సే. కుట్రను పన్నుటలో ప్రధాన పాత్రలు వహించిన వాడు ఆప్టే. మిగిలిన వారు కుట్రలో పాల్గొని హత్యాక్రియలో తోడ్పడినారు. శంకర కిష్టయ్య కేవలం తన యజమానిని (బాడ్గే) అనుసరించిన వాడే కాబట్టి ప్రభుత్వం కనికరించదలచినట్లయితే అతనిపై శిక్షను ఏడు సంవత్సరాల కఠిన శిక్షకానికి తగ్గించవచ్చునని చెప్పారు.

ఈ సందర్భంలో పోలీసుశాఖవారి అశ్రద్ధను విమర్శించుచూ శ్రీ ఆత్మాచరణ్ గారు తీర్పులో కొందు మాటలు చెప్పారు. జనవరి 20 వ తేదీని గాంధీజీ ప్రార్థన సమావేశంలో బాంబు పేల్చిన మదన్లాల్ ను అరెస్టు చేసిన తరువాత గాంధీజీని హత్యచేయడానికి కుట్ర జరుగుతున్నదని పోలీసు శాఖవారికి తెలిసింది. బొంబాయిలో ప్రొఫెసర్ జైన్ మంత్రి మురార్జీ దేశాయిగారికి ఈ విషయం తెలిసినప్పుడు దేశాయిగారు బొంబాయి పోలీసు శాఖకు ఇది తెలిపారు. అప్పుడు బొంబాయి, ఢిల్లీ పోలీసు శాఖలు ఈ విషయమై కొంత సంప్రదించాయికూడా. అప్పుడే పోలీసు శాఖవారు జాగ్రత్తపడి ఉన్నట్లయితే ఈ విషాదసంఘటన సంభవించి ఉండేది కాదని న్యాయమూర్తి చెప్పారు. పోలీసు శాఖవారు అశ్రద్ధ చూపారన్నారు.

నేరనిరూపణనిమిత్తం తేబడిన వస్తువుల్ని, అనగా గాంధీజీ శరీరంనుంచి తీయబడిన పిస్తోలు గుళ్లు, పిస్తోలు మొదలగు వస్తువుల్ని కేంద్ర ప్రభుత్వం ఏమి చేయదలచిందో వారికే విడిచి పెట్టాలని కూడా న్యాయమూర్తి చెప్పారు.

ఇవి జాతీయ ప్రదర్శనశాలకు అవసరం కావచ్చును. శిక్షితులు ఈ తీర్పుకు విరుద్ధంగా హైకోర్టుకు (తూర్పుపంజాబ్) అప్పీలు చేయదలచినట్లయితే పదిహేనురోజులు గడువు నిస్తున్నట్లు కూడా న్యాయమూర్తి చెప్పారు.

ఈ శిక్షలపై గాడ్సే అప్పీలు చేసుకోడని తక్కినవారు అప్పీలుచేసుకుంటారని తెలుస్తూంది. ఈ కేసు విచారణ నియమబద్ధంగా, సక్రమంగా జరిపించడానికి తోడ్పడిన న్యాయవాదులు మొదలైనవారిని ఆత్మాచరణ్ గారు అభినందించారు. తరువాత పశ్చాత్తాపహీనులైన శిక్షితులందరూ లేచి హిందూధర్మానికి, అఖండ హిందూస్థాన్ కి జయజయ నినాదాలు చేశారు.

హత్య జరిగిన తరువాత సరిగ్గా సంవత్సరంపైన పది రోజులకు తీర్పు వచ్చింది. కేసు విచారణ ప్రారంభమైనది మే 27 తేదీని. జూన్ 22, 23 తేదీల్లో ప్రాసిక్యూటర్ దప్తరీగారు నేర వృత్తాంతం వివరించారు. సాక్షుల వాఙ్మూలం తీసుకోడానికి 84 రోజులు పట్టింది.

ప్రాసిక్యూషన్ తరఫున 143 మంది సాక్షుల్ని విచారించారు. ఈ సాక్షులలో బొంబాయి మంత్రి మురార్జీ దేశాయి, ఇద్దరు మఠాధిపతులు, ఒక కళాశాలాధ్యాపకుడు, ఒక సినీమాతార, పత్రికారచయిత, విద్యార్థి, ప్రభుత్వోద్యోగులు, టాక్సీ డ్రైవర్లు, బంట్రోతులు మొదలైనవారున్నారు. కేసును పరిశోధించినవారు అప్పుడు బొంబాయిలో డిప్యూటీ కమిషనరుగా ఉన్న జె. డి. నగర్వాలాగారు.

హైదరాబాదులో జాగీర్లకు నజరానాలకుస్వస్తివాచకం

హైదరాబాద్ లో ఇకనించి ప్రజలు నజరానాలు చెల్లించవలసిన అవసరం ఉండదు. నజరానాలంటే ఏమిటో, ఆ సంస్థానంలో ప్రజలకి బాగా తెలుసును. అవి వారి రక్తమాంసాలను పీల్చేశాయి. అనేక కుటుంబాలు తరతరాలుగా ఋణగ్రస్తులై పడి ఉండవలసిన స్థితి తెచ్చిపెట్టాయి. రైతులకు కృషిఫలితంలో గింజైనా మిగలకుండా చేశాయి. వారిని బలవంతంగా భూమి యజమానుల ఇళ్లలో చాకిరీకి పాల్పడ చేశాయి. బ్రిటన్ లో ఇటువంటి భూస్వామ్య విధానంపైన ప్రజలు శతాబ్దాలకు పూర్వమే తిరుగుబాటు చేశారు. హైదరాబాద్ లో ఇప్పుడు ముక్తి పొందుతున్నారు.

ఉత్తరాన గోదావరి, వర్ధానదులు, దక్షిణాన కృష్ణా, తుంగభద్రనదులు హైదరాబాద్ సంస్థానానికి సరిహద్దులు. వీని పాయలు సంస్థానంలో చాలా ఉన్నాయి. అపారమైన అడవులున్నాయి. ఖనిజసంపద ఉంది. జనాభా తక్కువలేదు. నూటికి 70 మంది వ్యవసాయం చేస్తారు. వేరుసెనగపంటలో ప్రపంచంలోకల్లా భారతదేశం అగ్రస్థానం వహించగా, భారతదేశంలోకల్లా హైదరాబాద్ అగ్రస్థానం వహించింది. కాని రైతుఋణం మొత్తం రు. 66 కోట్లకు మించిఉంది. దీనికి కారణం ఏమిటి?

హైదరాబాద్ లో దాదాపు మొత్తం 5 కోట్ల ఎకరాల్లో రెండున్నకోట్ల ఎకరాలకు పైగా జాగీర్దార్లకు చెంది ఉన్నాయి. అంటే నూటింట 42 వంతు లన్నమాట. జాగీర్దార్లలో అందరికంటె పెద్ద జాగిర్దారు నిజాం నవాబే. నవాబుగారి జాగీరు భూముల్ని సర్ఫ్-ఇ ఖాస్ అంటారు. మొత్తం 78 లక్షల ఎకరాల పైగా ఉంటుంది. [దాదాపు 8110 చతురపు మైళ్లు. మొత్తం సంస్థానపు భూముల్లో ఏడోవంతు.] వీనిపైన సాలీనా రెండున్నర కోట్లు రూపాయలు నవాబుగారికి ఆదాయం వస్తుంది. తరవాత పెద్ద జాగీర్దారు సాలార్ జంగ్ (సైన్యాధిపతి). సంస్థానంలో నవాబుగారి సన్నిహిత బంధువుల్లో ముగ్గురు పైగా అమీర్లున్నారు. అంటే సాలార్ జంగ్ తరవాత పెద్ద జాగీర్దార్లన్నమాట. ఈ అమీర్ల జాగీర్లను పైగాలు అంటారు. ఆ తరవాత మిగతా జాగీర్దార్లు, ఆ పైన వనపర్తి, గద్వాల్ మొదలైన సంస్థానాధిపతులు వస్తారు. వీరి చేతుల్లో ఉన్న రెండు కోట్ల ఎకరాలు కాక పైన ఒక కోటి ఎకరాలు పెద్దపెద్ద భూస్వాముల చేతుల్లో ఉన్నాయి.

వీరి ఆస్తులు వందలాది ఎకరాలు. మిగతా భూముల్లో మాత్రమే రైతులు చెల్లించు శిస్తులు హైదరాబాదు ప్రభుత్వ కోశానికి వెడతాయి. ఈ భూముల్ని దివానీ అంటారు.

దివానీభూములపైన వచ్చే రెవిన్యూ దాదాపు రు. 20 కోట్లు. జాగీర్దార్లవద్దనుంచి వచ్చే రెవిన్యూ దాదాపు రు. 10 కోట్లు.

నవాబుగారు సర్ఫ్ - ఇ - ఖాస్ పై వచ్చే రు. 2½ కోట్లు కాక, స్వంతఖర్చులకోసం దివానీ నుంచి రు. 70 లక్షలు సాలీనా తీసుకుంటారు.

ఇవికాక అదనంగా కోట్లకొలది ధనం నవాబుగారికి నజరానాలద్వారా వస్తుంది.

నవాబుగారి సర్ఫ్ - ఇ - ఖాస్ భూములు దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఉన్నాయి. ఈ భూముల్లో నవాబుగారి దయనుబట్టి రైతుల శిస్తులు ఏర్పాటవుతాయి. నవాబుగారి దయకు పాత్రులైనవారు ఎకరానికి రు. 10 చొ॥ శిస్తు చెల్లిస్తారు. కొందరు రు. 200 చొ॥, లేదా 20 బస్తాల ధాన్యాల చొ॥ కూడా చెల్లించాలి. రైతుల్ని భూముల్నించి వెళ్లగొట్టడానికి కారణాలేమీ ఉండక్కరలేదు. కాని అది తరుచు జరుగుతూ ఉంటుంది. ఈ శిస్తులు కాక నవాబుగారికి నిత్యం నజరానాలు అర్పించుకోవాలి. నవాబుగారి ఇంట్లో పండగలకీ పబ్బాలకీ, పెళ్ళిళ్లకీ, అపరకర్మలకీ అందరూ నజరానా లివ్వాలి. నవాబుగారి బంధువులిళ్ళల్లో కూడా ఏదిజరిగినా నవాబుగారిపేరన జరానాలు తీసుకుంటారు.

హైదరాబాద్ ప్రభుత్వపు పోలీసు దళాలు, సైన్యమూ కాక, నవాబుగారికి సర్ఫ్-ఇ-ఖాన్ లో అదనంగా స్వంత రక్షకభటదళం, సైన్యం ఉన్నాయి. సర్ఫ్-ఇ-ఖాస్ భూములు దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఉన్నాయి. ఇవి ఉన్నచోటెల్లా నవాబుగారి స్వంతభటులు వారి ఆస్తిని కాపాడి, శిస్తులు నజరానాలు వసూలుచెయ్యడంలో తోడ్పడతారు. హైదరాబాద్ పోలీసులికి నెలకి రు 18 జీతమైతే, స్వంత పోలీసులకి నెలకి రు 8 నుంచి రు. 10 జీత మిస్తారు. శిస్తులు వసూలుచేసే ఉద్యోగులు కూడా ఇలాగే బాగా తక్కువ జీతాలకి పనిచెయ్యాలి. జీతాలు చాలడం లేదని సర్ఫ్-ఇ-ఖాస్ లో నవాబుగారి స్వంత సైన్యం (ఇర్రెగ్యులర్ ఫోర్సెస్) ఒకసారి సమ్మెకూడా చేశారు. చాలకపోతే రైతులవద్ద, వర్తకుల వద్ద వసూలుచేసుకోవచ్చని నవాబుగారు అప్పుడు అనుమతించి సమ్మె మానిపించారు. సంస్థాన పోలీసులకి పేరుకైనా న్యాయశాస్త్రం వర్తిస్తుంది కాని వీరికి ఏ న్యాయం, నియమం వర్తించవు.

ఇప్పుడు ఈ సర్ఫ్-ఇ-ఖాస్ ను దివానీలో కలిపివెయ్యడానికి నవాబుగారు అంగీకరించినట్లు మిలిటరీ గవర్నర్ మేజర్ జనరల్ చౌదరిగారు ప్రకటించారు.

"కాలం మారింది" అంటూ నవాబుగారు ఫర్మానాలో చెప్పారు. ఈ మార్పు ముఖ్యంగా రైతులకి కొత్తగా ప్రాణం పోసింది. ఇకనించి నజరానా లివ్వ నక్కరలేదు. శిస్తులు దివానీ భూముల్లో శిస్తులమాదిరిగానే ఇవ్వవచ్చును.

జాగీర్లను రద్దుపరచడానికికూడా తాత్కాలిక ప్రభుత్వం ఒక ఏర్పాటుచేస్తోంది. జాగీర్లలో రైతుల అవస్థ చెప్పతరం కాకుండా ఉండేది. రైతుల్ని, వర్తకుల్ని జాగీర్దార్లు అమానుషంగా పీడించేవారు. జాగీర్దార్లందరూ దుర్మార్గులేనని చెప్పడంలేదు. కాని జాగీర్లలో విధానాన్ననుసరించి రైతుల బాధమాత్రం ఎక్కడా తప్పలేదు. జాగీర్దార్లుకూడా స్వంతరక్షకభటదళాల్ని నియమించారు. కొందరు జాగీర్దార్లకు న్యాయశాఖా నిర్వహణాధికారాలుకూడా ఉన్నాయి. శిస్తులు, నజరానాల వసూళ్లు చెయ్యడంలో ఒకర్ని మించి ఒకరు విపరీతపద్ధతులు, మార్గాలు అవలంబించేవారు. ప్రజలకు కగౌరవంగా జీవించడమే అసంభవం చేశారు. ప్రతిరైతు శిస్తు నిమిత్తం ఎకరానికి 10 మొదలు 15 బస్తాలు ధాన్యం చెల్లించవలసివచ్చేది. (దివానీలో రైతులు చెల్లించే శిస్తు ఎకరానికి రు. 15) నజరానాలు ఈ శిస్తులపైన రెండు రెట్లు మొదలు ఒక్కొక్కప్పుడు ఎనిమిదిరెట్లవరకూ వసూలు చేసేవారని అంచనా వెయ్యబడింది.

ఇప్పుడు జాగీర్లనుకూడా రద్దుపరచడానికి తాత్కాలిక ప్రభుత్వం ఒక ఏర్పాటు చేస్తోంది. దీనిప్రకారం వచ్చే తరంవారికి జాగీర్లనేవి ఉండవు. ఈ తరంవారు అంత శిస్తుమొత్తాలు, నజరానాలు చెల్లించనక్కరలేదు. వారికి ఇంక జాగీర్దార్లతో నిమిత్తమే ఉండదు. ప్రభుత్వమే రైతులవద్ద శిస్తు వసూలుచేసి అందులో మూడో వంతు జాగీర్దార్లకు ఇస్తుంది.

సర్ఫ్ - ఇ - ఖాస్, లోగాని, జాగీర్లలోగాని భూములు చాలాచోట్ల సర్వే చేయబడలేదు. శిస్తుప్రమాణం నిర్ణయం (సెటిల్మెంట్) అసలే జరగలేదు. జాగీర్ల రద్దుతోపాటు వెంటనే కొత్త సర్వే సెటిల్మెంటుల నింపని ప్రారంభించవలసిన అవసరం ఉంటుంది. సెటిల్మెంటు చెయ్యడంలో ధాన్యరూపేణా శిస్తులు చెల్లించే పద్ధతిని పూర్తిగా విరమించాలి.

రైతుల రు. 66 కోట్ల రూపాయల ఋణాన్ని తగ్గించడమో, పూర్తిగా రద్దుపరచడమో పరిస్థితులనుబట్టి నిర్ణయించాలి. దీనినిమిత్తం ఋణముల వివరాలను గురించి విచారణ జరపవలసిన అగత్యం ఉంది.

వ్యవసాయానికి పెట్టుబడికి వడ్డీ వ్యాపారుల్లు నూటికి 150 వంతుల వరకూ కూడా వడ్డీ నిర్ణయించి ఋణాలిచ్చేవారు. తనఖాపైన ఋణాలు తీసుకొన్న రైతుల్లో ఋణవిముక్తులైనవారెవరూ లేరు. సంస్థానంలో నూరింటికి 8 వంతుల భూమిపై తనఖా లున్నట్లు అంచనా

(20-వ పేజీ చూడుడు)

కథానిక

చిన్నముల్లు-పెద్దముల్లు

శ్రీ యం. గున్నేశ్వరరావు

అలా యిప్పటికి కొన్నిరోజులనుండి జరుగుతోంది. ప్రతిమారు ఆనాలుగుకళ్ళూ కలుసుకున్నాయంటే, ఆనాడు ఓ నవకాళీ యుదంతం ఆ యింట్లో జరుగబోతుం దన్నమాటే! ఎంత ప్రయత్నించినా ఆయిరువురిమధ్యా సంధి పొసగే మార్గం కనబడలేదు. శకుంతలమాత్రం ఎన్నాళ్లని ఓర్పు వహిస్తుంది. ఎంత ఆడజన్మఅయినా, దేనికయినా ఒక అంతూ, దరీ వుండాలి.

ప్రతి ఉదయం బాధితహృదయాలతో, సడలిన నరాలతో లేచేవారు. ఎందుకో? ఎవరికి తెలుసు...ఎవరు చెప్పగలరు! చివరకు ఏ ఒక్క సామాన్య విషయం మీదకూడా ఆ భార్యాభర్తలిరువురు ఐక్యతకు వచ్చింది కనబడదు.

ఆమె "యీ వేళ ఎంత వేడిగా వుంది" అని ఫాన్ వేసుకుందా—శంకరం "ఆ! చక్కటి చల్లటి గాలి వీస్తోంటే!" అంటూ గదిలో తిరిగే ఎలక్ట్రిక్ ఫాన్ స్విచ్ ఆఫ్ చేస్తాడు.

ఏ ఉదయాన్నో "ఇదిగో! కాఫీ కాస్తావా యీ పూట" అని అతనంటే-

శకుంతల "ఛా! కాఫీకంటె యీ శీతాకాలం "టీ"యే బాగుంటుంది" అంటుంది.

శంకరం ముచ్చటపడి ఏ ఆదివారమైనా "మెరీనా బీచ్‌కి పోదాం వస్తావా!" అంటే ఆమె వంటింటి పనులలో నిమగ్నురాలవుతుంది.

ఒకరిని మించిన దొకరి పట్టుదల. ఒకరు ఉత్తరధృవం - మరొకరు దక్షిణధృవం. ఇక యీ విభిన్నప్రకృతులకు కలయిక ఎక్కడిది? ఇరువురలో ఏ ఒకరు మరొకరి కోరిక నిరాకరించినా ఒకవారం దినాలు ఆ యింటిలో పొగ రాజుతూనే వుంటుంది. అతను షికారుకు పోదాం రమ్మన్నప్పుడు యీమె రాకపోయిందా - మరొకమారు ఆమె రమ్మన్నప్పుడు శంకరం ససేమిరా అని కుర్చీలో కూర్చుని సిగరెట్ల పొగలు వదులుతూ కదలక మెదలక బిట్రగుంటలో బొగ్గువేసుకొనే "ఎక్స్-బి" ("X-B") యింజను జ్ఞప్తికి తెస్తాడు. ఆ సమయంలో "యీ మనిషి నేమి చెయ్యాలి" అన్నంత పట్టరానికోపం వస్తుంది శకుంతలకు. ఒకసారి యిద్దరూ కొట్టుకుంటారా అనిపిస్తుంది. చివరికి ఓనాడు అంత పనీ జరిగింది. కోపం వచ్చిన శంకరం చేతిలోవున్న చంచా శకుంతలముఖంపై విసరడంతో ఆమె నుదుటిమీద గట్టి దెబ్బ తగిలి పెద్ద బొప్పి కట్టడంకూడా అయింది.

ఇంత జరిగినా పరిస్థితులు ఎప్పటిలా వుండటమే ఆశ్చర్యకరమైన విషయం.

ఆనాటి శంకరంచేష్టకు ఆ రాత్రి అంతా శకుంతలమనస్సు కష్టపడింది. శంకరంమాత్రం ఏమీ జరుగనట్లే నిశ్చింతతో నిదురబోయాడు. ఇలా జరిగినప్పుడల్లా మనశ్శాంతికి శంకరం ఏ స్నేహితుని యింటికో పోవడం, మళ్లీ అంతా మరచిపోయి కొంతసేపటికి మామూలు మనిషిలా వస్తూ వుండటం...... లేదా - ఏ "సెక్షన్ బ్లేక్" (Setxion Blake) నవలో చదువుతూ సిగరెట్ల నిషాలో సేద దేరుతూ వుంటే - శకుంతల అప్పటికి జరిగిన సంఘటన మరచిపోవడానికని ఏ లేసు కుట్టో పనిలోనో లీనమవడం జరుగుతో వుంటుంది.

ఈ నిత్యసంఘటనల మధ్య ఒక్కొక్కమారు ఏకాంతంగా, కూర్చున్నప్పుడు శకుంతల తన గత జీవిత పుటల నెమరుకు తెచ్చుకుంటూ వుంటుంది. కోరి, ప్రేమించి పెండ్లిచేసుకున్నందుకు యిదేనా వివాహపు జీవితం? ఇటువంటి మనిషినేనా తాను అంతగా ప్రేమించింది - ఆ రోజులలో తనంటె అంతగా "తహ-తహ" లాడినదీ మనిషేనా? ఆ వ్యక్తేనా యీ శంకరం?

ఆ రాత్రి అలా ఎంతసేపని యీ విషయంపై చర్చించి విసుగుచెందిందో, తుదినిర్ణయంగా కన్నవారింటికి పో నిశ్చయించింది. "దినదిన గండం, నెయ్యేళ్లు ఆయుస్సు" అన్నట్లు సామరస్యతలేని యీ సంసారం యీవిధంగా యింకా కొనసాగించుటలో ప్రయోజనం?

కాపరానికి వచ్చిన క్రొత్తలో సంతోష, సంభ్రమాల మధ్య తాను - ఆనందంతో ఆతురతతో తనదరి ఎప్పుడు జేరుతుందా అని నిరీక్షించే అతని కౌగిట జేరిన ఆ జరిగిన రోజులే మంచివేమో! అదీ నిజమే! ఇరువురు విడువక ఎప్పుడూ కలిసివుంటే వివాహజీవితంలో ఆ నూతన ప్రణయమాధుర్యం మాత్రం ఎన్నాళ్లు వుంటుంది? గడచిన యీ మూడేళ్ల తమ దాంపత్య జీవితంలో ఒకరి నొకరు విడచి ఒక్కనాడైనా వున్నారా? ఇన్నాళ్లూ ఏ సెలవులకో ఏడాదికోమారు, అత్తవారింటికో సారి, తనపుట్టింటికోసారి భర్తతో వెళ్లడం, తిరిగి అతనివెంటనే రావడం జరిగింది. ఎప్పుడైనా తన తల్లి తాను పుట్టింట నాల్గురోజులుండి వస్తుంటంటే శంకరం "అమ్మో! శకుంతలనా!" అని తన ఎడబాటు సహించలేకపోవటం చూసిన తనవారు, తనభర్తకు తనపై ఎంత ప్రేమో అనుకున్నప్పుడు తానెంత గర్వించేది. ఆరోజులలో తనభర్త ప్రేమకు తానే ఆశ్చర్యపడేది. కాని - యిప్పుడో! అది పగలు - యిది రాత్రి వలె ఆ నటనంతా ప్రేమ అనే స్వలాభకాంక్ష అని స్పష్టంగా తెలుస్తూలేదూ! భత్యం లేని బానిసవృత్తి అంతా చేసేది గనుక భార్య అంటే ఆ రోజులలో కొంగుపట్టుకొని వ్రేలాడేవాడు. పెళ్లాం, భార్య, అర్ధాంగి - అనే యీ వివిధ విపరీతమాటలకు అర్థమేమిటో శకుంతలకు యిప్పుడు తెలియవచ్చింది. దినమంతా జీతం, భత్యంలేని పతిసేవలో మునిగితేలే, నోరులేని మూగబానిసేగా! ఇంతకు పదిరెట్లు ఖర్చుపెట్టినా యిటువంటి నోరులేని సంఘముద్రగల మరొక జీవి లభించదూ! అతనైనా యింతవరకు యీవిషయం గ్రహించకపోతే, తానైనా యిప్పటికి తెలుసుకుంది; మంచిదికాదూ! అలా ఆరాత్రి టంతవరకు ఆలోచించినా, చివరకు ఏమైనా సరే మరునాడు తన కన్నవారి ఇంటికి పోవడంతప్ప వేరే మార్గం గోచరించలా! ఆ నిశ్చయంతోనే "రేపు వెళ్లాలి - ఏమైనాసరే వెళ్లి తీరాలి" అనుకుంటూనే నిదురబోయింది.

ఆ ఉదయం శకుంతల కొంచెము ఆలస్యముగానే లేచిందని చెప్పవచ్చు. శంకరం మాత్రం అప్పటికప్పుడే అద్దంలో వివిధ ముఖభంగిమలతో గడ్డానికి నగిషీ చేస్తున్నాడు. తనపని కానిస్తూనే శకుంతల అప్పుడే లేవడం గమనించిన శంకరం "ఓయి భగవంతుడా! ఎనిమిది గంటలకు లేచే యిల్లాలి యింట్లోనా నన్ను సంసారం చేయమన్నావ్" అన్నాడు ఎత్తిపొడుపుగా. ఇదే మరోనాడైతే శకుంతల మాటకు మాట వెంటనే జవాబు యిచ్చిఉండేది. ఎందుకు? ఆ రోజు ముగియకుండానే తాను వెళ్లిపోబోతోందిగా! కడపటి రోజున ఏమైనా, ఏమన్నాసరే అన్నీ సహించ దలచింది. ఈ ఒక్క రోజు తన శత్రువుని ఓర్పుతో క్షమించి, తనదారిన తాను మంచిగా వెళ్లుతుంది. ఆ సమయంలో, అంతలో ఆమె కంత ఓర్పు, దయార్ద్రత, నెమ్మది, నమ్రత - ఆ మార్పు, ఎందుకు వచ్చిందో శకుంతలకే తెలియలేదు. "మాటకు మాట తెగులు-నీటికి నాచు తెగులు" అని తలచి వ్రేలాడే పమిటకొంగు సవరించుకుంటూ శకుంతల గదినుండి బయటకు వెళ్లింది. తన మాటకు శకుంతల ఏదో చేయబోతుందని తలచిన శంకరం ఆమె నిర్లక్ష్యతతో తననుగాదన్నట్లు అక్కడనుండి వెళ్ళడంతో నిర్విణ్ణుడయ్యాడు.

ఏవిధంగా శకుంతలను ఏడిపించటం అనే వుద్దేశ్యంతో భోజనందగ్గర కూర్చున్న శంకరం "ఛా! ఏమిటి యీగ్లాసు నీళ్లు - రామ - రామ నలకలు - నానాచెత్తానూ" అంటూ పరిశుభ్రంగా వున్న గ్లాసునీళ్లు ప్రక్కకు నెట్టివేశాడు. అందుకు శకుంతల బదులు పలుకలేదు సరిగదా, ఆస్థానే మరొక గ్లాసునీళ్ళు వుంచింది. అంతా ఎంత పరిశుభ్రంగా వుండాలో అంతలోను అమర్చబడివున్నాయి. పరిశుద్ధముగా తయారుచేయబడ్డాయి. అయినా "శంకలేనమ్మ డొంక పట్టుకు ఏడ్చింది" అని, శంకరం అన్నం తిన్నంతసేపు ఏదో సణుగుతూనే వున్నాడు. దేనికీ శకుంతల మాట్లాడలేదు. చివరకు జ్ఞాపకం వచ్చినట్లుంది "తగుదునమ్మా అని ఆడది ఎనిమిది గంటలకు లేస్తే ఎల్లా వుంటుంది" అన్నాడు కూడా మరొకసారి ఎత్తిపొడుస్తూ. అందుకు తనను కాదన్నట్లు వూరుకుంది శకుంతల. ఇక కొన్ని గంటలలో తాను ఏలాగూ వెళ్ళిపోతుందిగా - ఎందుకీ రచ్చ!

శంకరానికి శకుంతలలో యీ తలవని తలంపు మార్పు చూస్తే ఆశ్చర్యం వేసింది. ఇంతకంటె ఆశ్చర్యకరమైన విషయం ఒకటి ఎదురైంది, అతను ఆఫీసునుండి సాయంత్రం యింటికి వచ్చేసరికి. ప్రయాణానికి సంసిద్ధము చేయబడిన ఓ బెడ్డింగు, పెట్టె, హాలులో వున్నాయి. నిలువుటద్దంలో తల దువ్వుకుంటున్న శకుంతల వెనుకనుండి శంకరం వచ్చిన జాడ తెలుసుకుని వంటయింటిలోనికి వెళ్లింది.

"ఎవరివి సామానులు?" శంకరం టీ కప్పు చేతితో పుచ్చుకొని.

"నావే!" ముక్తసరిగా - మురిపెంగా - శకుంతల.

"నీవంటే?"

"నే గుంటూరు వెళ్లుతున్నా."

"ఓ! నువ్వా!"

"అవును - నేనే!"

"వీలులేదు."

"చూద్దాం!"

"నీ చూద్దాం! వెళ్లుతాం! అవేమీ యిక్కడ పనిచేయవు. నీవువెళ్లడానికి వీలులేదు-తెలుసా?" శంకరం కోపంతో—

"శాంతంగా ముందు టీ తీసుకోండి. భార్యగా మీకు ఎల్లాగూ బానిసను కాదూ! మరి యజమాని మాటకు బానిస "జో - హుకుం" అనవలసిందేగా!"

"జో - హుకుం. లేదు - ఛీ! ఛా! కాదు, యిక్కడ విషయం." శంకరం అతికోపంతో- "నిన్ను వుండమని నిర్బంధిస్తున్నానని తలుస్తే యిక్కడ నీవు వుండనక్కర్లేదు. అలా చేయడానికి నీ వేమీ నా బానిసవూ కాదు.

శంకరం పై మాటలకు శకుంతల ఏమీ బదులు పలుకలేదు.

కొంతసేపటి తరువాత మళ్లీ శంకరం "తప్పక యీ రాత్రే వెళ్లాలా?"

"అవును."

"ఈమాట ముందే చెప్పివుంటే యీరాద్ధాంత సిద్ధాంతం, యింతసేపు యీ మహాభారత యుద్ధం అవసరం లేకపోయేదిగా?"

"ఏవరైనా ఒక ఆడది తన పుట్టిల్లు చూడబోవడానికి వెళ్లే ముందు యింత రచ్చ జరుగుతుందని నే ఊహించలేదు...నే వెళ్లితే మాత్రం మీ కేం? మీ అభిరుచులన్నీ తెలిసిన రంగడు ఉన్నాడుగా!"

ఆవలిస్తూ నిర్లక్ష్యంగా శకుంతల లేచి "వేళ అవవస్తోంది. నేను మిగిలిన సామానులు సర్దుకోవాలి."

"అయితే నీవు తప్పక వెళ్లా లన్నమాట."

"అంతే మరి."

"ఇక నీకు యిక్కడ వుండే ఉద్దేశ్యం లేదనుకుంటా."

"నా అవసరం యిక్కడ వుందనుకోను."

"సరే! అయితే - ఫో!" చేతిలో కప్పు అక్కడ పడేసి, కూర్చున్న కుర్చీ పడుతుందేమో అన్నట్లు చివాలున లేచాడు-బయటపోనుద్యుక్తుడవుతూ.

ఎదుట జరిగే విచిత్రసంఘటన చూస్తున్న కొలదీ శకుంతలకు నవ్వు వస్తోంది. త్వరగా తల దువ్వుకొని, ప్రయాణానికి సిద్ధమయింది. ట్రైన్ బండికి యింకొక గంట వుందని గోడగడియారం చెపుతోంది.

కోపంతో ఎక్కడికో పోయివుంటా డనుకున్న శంకరం ప్రక్కగదిలో కిటికీచెంత నిలబడి శూన్యాకాశంలోకి చూస్తూ వుండటం చూసింది. మెల్లిగా అతనిని సమీపించి వెనుకనుండి—

"నే వెళ్లుతున్నా!"

శంకరం స్తబ్ధుడై నిలబడివున్నాడు.

"వింటున్నారా! నే వెళ్లుతున్నా"

దీనికి బదులు పలుకలేదు.

మూడోసారిగ "నే వెళ్లుతున్నా! కొంచెం ముందు బయలుదేరుతే మంచిదిగా బస్ మీద స్టేషన్‌కు వెళ్ళవచ్చు. రంగడు నాతో వస్తున్నాడు. నే తీసుకపోను - మరేం భయపడకండి, రైలు ఎక్కడంతో నే వాడిని వదలివేస్తా; ఏం?" అంటూ శకుంతల ఓ అడుగు ముందుకు వేసిందో, లేదో అతని గుండె గతుక్కుమంది. ఆమె అడుగు సవ్వడి దూరమైన కొలదీ శంకరం శరీరంలోని నవనాడులు పట్లు విడిన ట్లయింది. ఇక ఒక క్షణమైనా ఆమె లేని ఆయింటిలో నిలువలేకపోయాడు. నిర్లిప్తహృదయంతో పార్కు చేరాడు. ఎక్కడకు వెళ్లినా వెంటాడుతా నన్నట్లు అక్కడా ఛాయావాణిలో "తరిపి వెన్నెలలో చిరునవ్వులేలా......జానకిలేనియీ సౌందర్య శోభా..యీ పాడు లోక మీ బ్రతుకు నా కేలా" అనే వందేమాతరంలోని రఘు విరహగీతికావిలాపం శంకరంవిలాపాన్ని యినుమడింప జేసింది.

"ఏం? శంకరం......నిన్నే?"

"ఎవ్వరు?"

"తెలుసుకోలేవు...ఇన్నాళ్లూ నీ బొందెతో స్నేహంచేస్తూ నిన్ను అంటిపెట్టుకున్న నీ ఆత్మను నీవే గుర్తించలేని పరిస్థితిలో వున్నావా?"

"ఆ! నా...ఆ...ఆత్మ!"

"అవును."

"అయితే ఏమి చేయమంటావ్"

"వెఱ్ఱివాడా! యీ క్షణంలోకూడా ఏమి చేయమంటావని నన్ను సలహా అడుగుతావా? నీవు చేసింది ఘనకార్యం అని ఉబలాటపడుతున్నావా? వేసిన తప్పటడుగు సరిదిద్దుకోలేక మానసికాందోళనతో ముందు వెనుక లూగిసలాడుతున్నావు కాదూ!"

"నే నేం తప్పు చేశాను?—ఎవరి విషయంలో?"

"ఎవరా! నీభార్య...శకుంతలను..."

"ఆ విభిన్న మనఃప్రవృత్తికి నేనేమిచేయను?"

"ఆమె ఆ పరిస్థితికి రావడానికి నీవేగా కారణం? మగవాడవనే గర్వంతో స్త్రీని ఎంతవరకు నీ ఆటబొమ్మగా ఉపయోగించదలచావు? ఏ స్త్రీ అయినా తన భర్తను సంతోషపరుచుటకు ప్రయత్నించుటలో ఒక పరిమితి వుందని గ్రహించాలి? మానవజీవితమే విచిత్రమైనది. అందులో సంసారజీవితంలో భార్యాభర్తలిద్దరు గడియారంలోనిచిన్నముల్లు, పెద్దముల్లు అనుకో. గడియారం సరియైన స్థితిలో వుండి, యీ


(21 వ పేజీ చూడుడు)

అహో

నారసింహా

అనేకశతాబ్దాలుగా వైష్ణవదివ్యా[లయంలో] ఈనాటికి నిత్యధూపదీపనై వేద[...] తప్ప (అనగా చైత్రశుద్ధపౌర్ణమికి) ఏ[...] ఉంటుంది. ప్రాంగణమంతా దుబ్బుకట్టి[...] పోవలసిందేనా ?

చెప్పనవసరం లేదు. దేవాలయం పేరు చెబితే తల[...] పంచేవాడనీ, భగవచ్చింతనాపరు డనీ పేరుపడిన ఒక వ్యక్తి ప్రధానిగా వచ్చి రెండేళ్లు గడచినా ఈ దేవాలయాల స్థితి ఏమాత్రమూ బాగుపడక పోవటం, బాగుపడకపోయినా జనం మిన్న కుండటంకన్న శోచనీయం మరొకటి ఉండదు. అమాత్యద్వయ సందర్శనంతోనన్నా ఈ దేవా



ఓబలేశుని ఆలయసమీపమున శిల్పవిశేషము.

వర్తమాన స్థితి


అహోబిలతీర్థాన్ని గూర్చిగాని, అహోబలేశుని గూర్చిగాని తెనుగుదేశానికి చెప్పబూనటం అస్మదాదులకు సాహసమేనని చెప్పాలి. నరసింహ స్వామిని స్తుతించడానికి, ప్రహ్లాదుఁకన్న మిన్న ఎవరు? లక్ష్మీనరసింహస్వామి సౌందర్యాన్ని గానం చేసిన శ్రీ శంకరులు త్యాగరాజువంటి మహాను భావు లెందరో ఉన్నారు. అహోబలక్షేత్ర మాహాత్మ్యాన్ని అభివర్ణించడానికిగాని ఓబులేశుని ఔన్నత్యాన్ని నతించడానికిగాని నాకుస్మృతి శాస్త్రపురాణేతిహాసాదులు తెలియకపోయినా ప్రస్తుతం ఆ క్షేత్రం ఉన్న దౌర్భాగ్యస్థితిని చూస్తేమటుకు వళ్లు గగుర్పొడిచి భగవత్సేవా పరాయణుల జిజ్ఞాసను, ప్రభుత్వాధికారుల జడ త్వాన్ని యతిక్రమించి త్రయినా కదిలించగలమేమో ననే సంకల్పంతో నాల్గుమాటలు వ్రాయాలనే ఉబలాటం కల్గింది. ఆ క్షేత్రరాజాన్ని సంద ర్శించడానికి సరియైన బాటలేదు. 364 రోజుల్లో 330 రోజులు స్వామికి అర్చనలే జరగని స్థితి ఏర్పడింది. అమాత్యశేఖరులు వస్తున్నారనే కబురు అంది మంత్రిబృందం అహోబలం చేరే నాటికి ధర్మకర్త కోయంబత్తూరునుంచో, కుంభ కోణంనుంచో అవతరించాడు. మంత్రుల పర్యటన ధర్మమా అని దేవుని కోవెలతలుపుల తాళం తెరువబడింది.

ప్రజల శ్రద్ధాభక్తులు

చంద్రదర్శనంకోసం చకోరపక్షులలాగ, నీల మేఘ ఆగమనానికి చాతకపక్షులలాగ, చక్ర వాకం సూర్యునికోసం ఎతపించినట్లు, పరిసర గ్రామవాసులు లక్ష్మీనరసింహస్వామి దర్శనా పేక్షతో తండోపతండాలుగా వచ్చారు. వచ్చి, అమాత్యాగమనంతో, భగవద్దర్శనం ప్రాప్తించి నందుకు ఆనందాశ్రువులు రాల్చారు. కొంచెం అటూ ఇటూ అయితే ధర్మకర్తపై చెయ్యి చేసుకొనేవారేగాలి, సర్వధారి సం॥ త్సరంలో మార్గశిర బహుళ త్రయోదశినాటికైనా తమకు స్వామిదర్శనం లభించిన దనే తాదాత్మ్యంలో ముక్కుదాకా వచ్చిన కోపాన్ని కంఠం దాటి రాకుండా మ్రింగేశారు. ధర్మకర్త అర్చకులకు జీతాలివ్వక వాళ్లను నానాఅవస్థలపాలు చేస్తు న్నాడనీ అందువలన వాళ్లకు కటకట అవుతోం దనీ, స్వామికి నిత్యార్చనలు లేనందున తమకు వానలు లేక కాటకం వచ్చినదనీ మంత్రులకు మనవి చేసుకున్నారు. దేవాలయ ప్రాంగణంలో భక్తులు ప్రదక్షిణం చెయ్యడానికి వీలులేకుండా ముళ్లూ, పల్లేరుకాయలూ కొల్లలుగా కని పించాయి. దేవాలయానికి, అహోబలానికి వచ్చే బాటలో మటుకు అక్కడక్కడ కొంత మట్టి, ఈతఆకులు, తాటిఆకులు వేసి, రస్తా కొంత మరమ్మతుచేసినట్లు కనిపించేట్టు చేశారు. మంత్రుల ధర్మమా అని అని ఈ ఏడాది యాత్రికు లకు అహోబలంబాట కొంచెం ముందుగానే బాగుపడింది. అధికారులకు మెత్తమెత్తగా మంద లింపులు తగిలినందున తాత్కాలికంగానైనా అచ్చటివారికి కొంత ఉపశమనం కలిగేట్లు తోచింది.

వైష్ణవ క్షేత్రం


శ్రీశైల క్షేత్రం శైవుల కెంత ప్రాణప్రదమో అహోబలం శ్రీ వైష్ణవుల కంత ప్రీతి కరము. శ్రీ వైష్ణవ మఠాధిపతి ప్రస్తుతం అహోబలంలో ఉండ టంలే దన్నారు. శ్రీశైలం మాదిరి ఇచ్చట ఒక పూజా సమితిగాని, క్షేత్రాన్ని అభి వృద్ధి చేసి, సులభసాధ్యము చేద్దామనిగాని యత్నంగూడా చేసినట్లులేదు. ముప్పయ్యేళ్లుగా శ్రీశైలం ఆలయాన్ని పునరు ద్ధరించడానికి ప్రాణధనాలను అర్పించిన పాణ్యం రామయ్య గారిని హిందూ దేవాదాయ ఉన్నతాధికారి ఒకాయన తన కేమో అగౌరవం జర్గిన దనే కారణాన ఏతదాధిపత్యాన్నుంచి తప్పించాడని అక్కడి వారు తెలియచేశారు. మనసా, వాచా, కర్మణా, త్రికరణశుద్ధిగా దైవారాధనలో నిమగ్నులైన వారికే అధికారుల అహంకారచర్యలు ఆటంకాలవుతూఉంటే, సబత్వంలో పడిఉన్న గ్రామీణులకు వాళ్లి అండఆసరా ఎల్లా ఉంటుందో



దేవాలయప్రాకారమున



శిథిలావస్థయందున్న ఒక తటాకము.




అహోబిలం తీర్థప్రాంగణమున చేరిన యాత్రికబృందము. గోపవరం వెంకటరెడ్డిగారలు

౦బిల క్షేత్రము

స్థలమైన అహోబిల నారసింహ
స్వాదులు లేవు. ఉత్సవ సమయాల్లో
ని కేడాదీ దేవాలయం పాడుపడి
గోయింది. ఈ క్షేత్రం ఇలా అయి

ఆలయాల వర్తమాన దైన్యస్థితి అంత మవుతుందని సహృదయుల ఆశ.



మహానంది సరస్సు: పరిసరమంటపములు, గోపురములు.

మహానంది తపోవనం

మా యాత్ర మూడోరోజు సంధ్యారాగంతో పెద్ద చెర్వు మజిలీ వదిలి రాత్రికి తామ్ర మ్ర శాఖావిలసితమూ, శోభస్కరమూ అయిన మహానంది తపోవనము చేరుకున్నాము. మాకు మన్య మార్గంలో "అంబర చుంబిశిరస్సరజ్ఝరీ పటలముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగనిస్వనము" లంతగా వినిపించకపోయినా "స్ఫుటనట నానుకూల పరిఫుల్ల కలాప కలాపి జాలముల్" మటుకు తారసిల్లకపోలేదు. మహానంది తపోవనాంతరంలో అవతరించన మా బృందం నిమిత్తం డేరాలు వేశారు. స్వచ్ఛమూ, స్ఫటిక సదృశమూ అయిన మహానంది సరోవరంలోని నులివెచ్చని నీటిలో ఉల్లాసంతో స్నానపానాదులొనర్చి భగవత్సేవా కర్యం చేసుకున్నాము. మహానందీశ్వరుని ఆరాధనలో శ్రద్ధాసక్తులు చూపుతున్న శ్రీ సుబ్రహ్మణ్యశర్మగారు అచ్చటి వనంలోని చిన్న చిన్న చెట్లను ఛేదించి యాత్రికులకు సౌకర్యం ఏ విధంగా చెయ్యవలసినదో అనుభవపూర్వకంగా నివేదించారు. మంత్రులు వారి నివేదన నవధరించి తగు చర్య తీసుకుంటామన్నారు.



ఉన్న వటవృక్షపు ఊడలు.


ప్రకృతి రామణీయకత

నాలోరోజు స్నానసంధ్యార్చనానంతరం మా బృందం సంతోషాంతరంగంతో అహోబిలం వపు జీపులలో పరుగులెత్తి ప్రారంభించింది. మేము దిగువ అహోబిలం చేరేసరికి పంటిగంట అవటంతో మా మేనులు "మధ్యందినా తపోష్మ హతి గంది." అప్పయ్యపాద్యాయుల దీర్ఘకోని దైవదర్శనాత్పూర్వమే సిద్ధముగా ఉన్న ప్రసాదములు స్వీకరించి, వెంటనే గిరిపై నెలకొన్న అహోబిలేశుని దర్శనార్థం మళ్లీ వాహనారూఢులమై ప్రయాణం ప్రారంభించాము. ఆ నాల్గు మైళ్లలో పెద్దపెద్ద గాళ్లు, ప్రక్కన చక్కని పొదరిళ్లు, అచ్చటచ్చట సెలయేళ్లు ఎంతో సొగసుగా ప్రత్యక్షమైనయ్. ఆ వనాంతరకాంతార సీమలు ఉద్యానతపోవనాలు, జ్యోతిర్లతానిలయాలు హృద్యమై, మనోరంజకంగా ఉన్నయ్. చిన్ననాటినుంచి మన అమ్మమ్మలు తెల్లవారుఝామున వర్ణించే సప్తమస్కంధం, ప్రొద్దున్న బళ్లలో పిల్లలు చదివే నరసింహశతకపద్యాలు, సంతర్పణలో శంకరవిరచితమని చెప్పే లక్ష్మీనరసింహస్తోత్రశ్లోకాలు మనఃఫలకంలో ఒక్కసారి సినిమా ఫక్కీగా నడచినయి. చిన్న ప్పుడు వెంచిత "చుక్కలు లెక్కగలవా నరహరి, పుట్టలెక్కగలవా" అని పాడే పాట స్ఫురణకు వచ్చింది. "ఇందుగల డందు లేడని సందేహము వలదు" అనే ప్రహ్లాదుని పద్యం ప్రబోధంవలె జ్ఞాపకం వచ్చింది. "లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబం" అనే శ్లోకతరంగాలు మానసక్షేత్రంలో కెరటాలు కొట్టినవి. మధ్యాహ్నం రెండు ఝాముల కల్లా దేవాలయ సింహద్వారాన్ని చేరుకున్నాము. అచ్చట ఉన్న కోలాటతీర్థంలోని చల్లని జలాలతో ముఖాలు కాళ్లు చేతులు కడుక్కొని సేద తీర్చుకున్నాము. ఆలయప్రదక్షిణం చేసి ఆలయంలోనే ఒక గుహలో వెలసిఉన్న ఉగ్రనారసింహస్వామిని కన్నులార దర్శించుకొని అర్చించుకున్నాము. హిరణ్యకశ్యపుని తొడలపై పెట్టుకొని పేగులు చీలుస్తూన్నట్లు స్వామి వారక్కడ వెలసి ఉన్నారు. ఆ విగ్రహానికిముందు పంచలింగాకృతిలో స్వామి దర్శనం ఇస్తారు.


అహోబిలం

గుడి నడుమలో వస్తుంటా కొంగగా ఒక చలువరాతిబండ వేసి ఉన్నది. అక్కడనుంచి శిలశిఖరానికి ఒక బిలం ఉన్నది. వైష్ణవస్వాములొకరు నాల్గువందలఏళ్ల క్రితం తపస్సుకోసం ఆ మార్గాన పైకి వెళ్లారని, వారు పోయాక ఆ బిలద్వారం మూయించవేయమన్నారనీ, వారి ఇచ్ఛానుసారం అది మూసి వేశారనీ అక్కడివారు చెప్పారు. దేవాలయగోడలపై భాగవతం

(18వ పేజీ చూడుడు)



మంత్రులు సీతారామరెడ్డి,మాధవమీనన్ దంపతులు, చిత్రమున కనిపించుచున్నారు.



అహోబిల సింహద్వారము.



"ముగ్గురు అత్తయ్యలు"

శ్రీ పాలంకి వెంకటరామచంద్రమూర్తి

అనగనగా ఓ ఊరుంది ఆ ఊళ్లో అంతా రాట్నాలమీద నూలు తీస్తారు. కాని కామాక్షీ అనే పిల్లకి మాత్రం నూలు తియ్యడమంటే ఇష్టముండేదికాదు. ఆ పిల్ల ఎప్పుడూ ఏదో చదువుకుంటూ కాలక్షేపం చేసేది.

కాని వాళ్లమ్మకి కూతురలా కూచోడం కిట్టేది కాదు. అదికూడా తనకిమల్లే నూలు వడకటం లేదని రోజూ దాన్ని తిడుతోండేది. కాని కామాక్షి మాత్రం నూలు తీసేదికాదు. ఆఖరికోనాడు వాళ్లమ్మ కోపం పట్టలేక కామాక్షిని బాగ మొట్టికాయ మొట్టింది. మొట్టడంలోనూ గిద్దెడు చమురు ఇగిరేటట్టు మొట్టింది. కామాక్షి 'మొర్రో' అని ఏడవడం ప్రారంభించింది. వీధమ్మట వెడుతూన్న ఆ ఊరు రాణీగారికి ఈ ఏడుపు విని పించి ఆవిడ లోపలికొచ్చింది.

"ఎందుకమ్మాయ్, అలా ఏడుస్తూన్నావ్?"

"మా అమ్మ కొట్టింది."

రాణి కామాక్షితల్లితో, "ఏం అమ్మా, అంత అలా కొట్టేవ్?" అని అడిగింది.

తనకూతురు అస్తమానూ పుస్తకాలు పెట్టుక్కూచుంటుందనీ, నూలు కొంచెంకూడా వడకదని రాణీతో చెప్పడానికి కామాక్షితల్లికి ఇష్టంలేక ఓ పెద్ద అబద్ధం ఆడేసింది. "ఏం చెప్పను రాణీగారూ! మాపిల్ల తిండనక, నిద్రనక, ఆటనక, పాటనక, అస్తమానూ రాట్నందగ్గర కూచుని నూలు తీస్తుంది. ఎన్ని యేకులు తెచ్చినా ఇట్టే వడికేస్తుంది. నేను ఏకులు తెచ్చిపడెయ్యలేక వేగిపోతున్నాను. 'వడకడం మానెయ్యవే' అంటే మానదు! ఏంచెయ్యమంటారు? ప్రాణం విసిగి ఒక్కటేశాను."

ఆ మాటలు విని రాణీగారు ఎగిరి గంతేసింది. "ఇంత శ్రద్ధగా పనిచేసే పిల్ల ఉండడం ఎంత అదృష్టం; మీ పిల్లని నాతో పంపించెయ్. నేను కావలసినన్ని యేకులిస్తాను."

కామాక్షి తల్లి సంతోషించింది. "కామాక్షి, ఇంట్లో సోమరితనంతో కూచున్నా రాణీగారింట్లో అలా కూచోడానికి వీలా? ఆవిడ మెడలు వంచి పని చేయిస్తుంది! పిల్లకప్పుడు నూలు వడకడం బాగా అలవాటవుతుంది! బాగా ఉందీ ఆలోచన!" ఇలా అనుకుని ఆ అమ్మ కామాక్షిని రాణీగారితో పంపేసింది.

కామాక్షికి రాణీగారి గుఱ్ఱబ్బండిలో కూచుని దర్జాగా కోటలోకి వెళ్లడం మొదట సరదాగానే ఉందిగాని, కోటలోకి వెళ్లి అక్కడ మూడు గదులలో గడ్డిమేట్లలా మల్లే ఎత్తుగా పడి ఉన్న ఏకుల కట్టలు చూసేటప్పటికి, గుండె 'లటుకూ, లటుకూ' మంది.

రాణీ కామాక్షికి మంచి రాట్నం ఒకటి తెప్పించి యిచ్చి, "చూడు పిల్లా, ఈ యేకులన్నీ మూడు రోజుల్లో నూలు తీసెయ్యాలి. అలా తీస్తే, నా పెద్దకొడుక్కిచ్చి నిన్ను పెళ్లి చేస్తాను. 'నేను పేదదాన్ని నన్ను రాజకుమారుడికి పెళ్లి చేస్తారా? ఉత్తిది' అని సందేహిస్తావేమో. అలాంటి సందేహం పెట్టుకోకు. ఏమంటావా? నాకు 'పేదవాళ్లు అనీ, ధనవంతులు అనీ,' 'కొద్దివాళ్లు అనీ గొప్పవాళ్లనీ' తేడాలు లేవు. పాటుపడి పనిచేసే పిల్లవుతే చాలు, నాకు కోడలు కావటానికి నువ్వు పడే పాటూ, పనిలో చూపించే నేర్పూ— ఇదే మా అబ్బాయికి కట్నం అనుకుని నీకు పెళ్లి చేసేస్తాను." అని చెప్పి చక్కాపోయింది.

కామాక్షికి రాజకుమారుణ్ణి పెళ్లి చేసుకోడమంటే సంబరంగానే ఉంది గాని ఏకుల మేటీ, రాట్నం చూసేటప్పటికి మళ్లీ గుండె గుభిక్కుమంది. రాణీగారు ఫలహారాలు, భోజనం పంపుతోండేది కాని, పాపం కామాక్షి యేకుల మాట తలుచుకుని బెంగెట్టుకుపోయి ఒక్కటీ నోట్లో పెట్టుకోలేకపోయింది.

ఇలా బెంగతో మేడమీద అటూ ఇటూ తిరుగుతూ, కామాక్షి ఏమీ తోచక ఓమాటు కిటికీలోంచి వీధిలోకి చూసింది. నడివయస్సులో ఉన్న ముగ్గురాడవాళ్లు ఆ దారిని పోతూ కనబడ్డారు. వాళ్లలో ఒక మనిషికి కుడిపాదం ఏనుగ కాలుకుమల్లే లావుగా పెద్దదిగా ఉంది. రెండో అమ్మకి కింది పెదవి రామాఫలానికిమల్లే దళసరిగా పెద్దదిగా ఉండి బరువుచేత కిందికి దిగబడుతో కనబడింది. ఇంక మూడో ఆవిడకి కుడిచేతిబొటనవ్రేలూ, చూపుడువేలూకూడా రుబ్బురోలపొత్రాలకుమల్లే లావెక్కిపోయి ఉన్నాయి. ఆ ముగ్గురు ముత్తయిదువలూ యధాలాభంగా కిటికీకేసి చూచేటప్పటికి కామాక్షి ఏడుస్తో కనపడింది. "ఏమిటమ్మా, నీ బాధ?" అని అడిగేరు వాళ్లు. "మీరు ఆర్చేవాళ్లా? తీర్చేవాళ్లా?" అని నిట్టూర్పు విడిచింది కామాక్షి "అలా కాదు. చెప్పు" అని వాళ్లు బలవంతపెడితే, సంగతంతా చెప్పేసింది కామాక్షి. "ఓస్, ఈమాత్రందానికేనా ఇలా బెంగెట్టుకుపోయావ్? ఆ యేకులేవో చూపించు. మూడు మేట్లూ మూడు రోజుల్లో వడికి అక్కడ పెడతాం!" అన్నారు వాళ్లు. "రండలాగైతే!" అని ఆమె తలుపు తీసి వాళ్లని పైకి ప్రవేశపెట్టింది. ఐతే అమ్మాయి, నీకు మేం యీ సాయం చేసినందుకు మాకు నువ్వేం చేస్తావు?" అని అడిగేరు వాళ్లు.

"మీ రేం చెయ్యమంటే అది చేస్తాను."

"పెద్ద దేం కాదులే. నీ పెళ్లికి మమ్మల్ని పిలిచి, బూరిముక్క పెట్టి చాలి. రాణీగారూ, నీ మొగుడూ 'వీళ్లెవ' రంటే, 'మా మేనత్త' లని చెప్పాలి."

"ఓస్, ఇంతే గదా! తప్పకుండా చేస్తాను."

మాట్లాడకుండా ఆ ముగ్గురు ముత్తయిదువలూ నూలు వడకడం ప్రారంభించారు. ఆరోజుల్లో రాట్నాలు ఇప్పటి కుట్టుమిషనుకుమల్లే ఉండేది. కాలితో తొక్కితే 'చక్ చక్' మంటూ చక్రం తిరిగి దానిమూలాన కదురు తిరిగి నూలువచ్చేది. లావుకాలావిడ ఆ కాలితో 'చక్ చక్' మని తొక్కుతో నూలుతియ్యడం మొదలెటుంది. మధ్యమధ్య దారం తెగిపోతోంటే వ్రేళ్లులావావిడ. పెదిమిలావావిడ పెదిమిమీద తన లావువేళ్లు అంటించి తడిచేసి, ఆ తడితో దారం అతుకుపెట్టి నలుపుతోండేది. కామాక్షి చూస్తూండగా మూడు

(18-వ పేజీ చూడుడు)

పిల్లల కథ:

లోభి

ఆధారం: బెర్టా మెట్జర్ వ్రాసిన "సుసీల్ ది మైజర్"

అనుసరణ: శ్రీ అత్యం జగన్మోహన్

ఒక రాజ్యాన్ని ఒక రాజు పరిపాలిస్తూండేవాడు. అతని కోశాధికారి చాలా ధనాన్ని కూడబెట్టాడు. అతని పేరు "చౌదరి".

చౌదరికి ఎంత ధనమైతే వుందో అంత లోభిత్వంకూడా వున్నది. జన్మంలో 'పిల్లికి బిచ్చం పెట్టి యెరుగడు' తిండికూడా తను కడుపునిండా తినడు. పిల్లలకు పెట్టడు.

బండెక్కితే ఖర్చవుతుందని ఎప్పుడూ నడిచే వెళ్తూంటాడు ఒక రోజున రాజసభనుండి నడిచివస్తూండగా, 'ఫలహారశాలలో' ఎవరో 'నేతి రొట్టె' తినడం చూచాడు. "నోరు వూరింది" కాని, అక్కడ కొంటే డబ్బైపోతుందని బెంగ. ఇంటిదగ్గర చేయించుకొందా మంటే పెళ్ళాం బిడ్డలుకూడా కావాలంటారని భయం. సరే, ఎలాగో 'గూని' నడుంతో నెమ్మదిగా కాళ్లీడ్చుకుంటూ యింటికి చేరాడు. వెంటనే పక్కమీద పడుకొన్నాడు దిగులుగా.

ఎంత సేపటికీ లేవకపోతే, భార్య వచ్చి—

"రాజుగారేమైనా అన్నారా?" అని అడిగింది.

"అబ్బె, అదేం లేదు" అన్నాడు.

"అయితే మరెందుకిల్లాగున్నారు?"

"ఏమీ లేదు— కాని..."

"ఏమిటో చెప్పండి, పర్వాలేదు."

"అబ్బె! ఏమీ లేదు—'నేతిరొట్టె' తిందామని బుద్ధి పుట్టింది."

"ఓస్! యీ మాత్రానికేనా? అయితే వూరంతా సరిపోయేటన్ని రొట్టెలు చేయించి విందు చేద్దాం."

"మతి పోయిందా ఏం? అందరికీ ఎందుకు?"

"పోనీలెండి, మన వీధికి మాత్రమే"

"గడించుకు తినలేరూ...?"

"సరే! అల్లాగైతే యింట్లోవాళ్లకి మాత్రమే"

"అందరికీ ఎందుకే పిచ్చిదానా?"

"మనిద్దరికీనూ"

"నీకుకూడా ఎందుకు? కొద్దిగా బియ్యం - నూక, పిండి, నెయ్యి తీసి కొని ఎవరికీ తెలియకుండా ఎడవ అంతస్థుమీద తయారు చేయి."

ఆ యిల్లాలు అల్లాగే కష్టపడి, అన్నీ తయారుచేసింది చౌదరి గూనితో ఏడు అంతస్థులూ ఎక్కి కొన్నిరొట్టెలు, 'డబ్బైపోతూందే' అనే బాధతోటి తిన్నాడు.

ఈ పరిస్థితంతా చూచే సరికామెకు యేడుపు వచ్చింది. తన భర్తను 'దాన ధర్మ' పరునిగా మరల్చమని 'బుద్ధ దేవుని' లోపల్నే ప్రార్థించింది. అతని మూర్ఖత్వానికి కన్నీళ్లుకూడ విడిచింది.

చౌదరితండ్రి, తనుచేసిన దాన ధర్మాలవల్ల అప్పుడు దేవలోకంలో 'బుద్ధ' పదవిలో వున్నాడు తను కూర్చున్న బంగారు పద్మము వేడెక్కడంమూలాన, ఎవరో తనను ప్రార్థిస్తున్నారని గ్రహించాడు. దివ్యదృష్టివల్ల అది తన కొడుకు, కోడలుకు సంబంధించిన విషయం అని గ్రహించాడు. చౌదరివేషంలో, అంటే తన కుమారుని రూపంలో, భూలోకంలోకి వచ్చాడు.

దేవచౌదరి రాజువద్దకు వెళ్ళి యిల్లా అన్నాడు:

"రాజా! నావద్ద ధనం చాలా పెరిగిపోయింది. అది నీ బొక్కసంలో దాయాలి."

"చౌదరీ! నాడబ్బుతోనే బొక్కసం నిండిపోయింది. నీ డబ్బు దాయడానికందులో చోటు లేదు."

"ఐతే నా యిష్టం వచ్చినట్లా డబ్బంతా ఖర్చు పెడతాను."

"నీ యిష్టం. నా కేమీ అభ్యంతరం లేదు."


ఇంటికి వచ్చేసరికప్పుడే అసలు చౌదరి షికారుకు వెళ్ళాడు. దేవచౌదరి వెళ్లి భార్యను పిలిచాడు. "నా డబ్బంతా దానం చేస్తా"నన్నాడు. "సరే" అన్నది, మగని వింతమార్పుకి ఆశ్చర్యంతో సంతోషిస్తూ. వెంటనే ఊరంతా డప్పు వేయించి వచ్చిన వాళ్ళందరికీ దోసిళ్ళతో ధనం పంచి పెట్టాడు. "తనలాగే వున్న ఎవళ్ళైనా వస్తే, వాడు దొంగ" అని చెప్పి "యీడ్చి తన్నండి" అన్నాడు అందరి సేవకులతోటీను.

ఇంటికి వస్తూ తన యింట్లో ధనమంతా తీసుకువెళ్లడం చూచిన అసలు చౌదరి క్రోధంతో కొందరిని ఆపు చేయబోయాడు. వెంటనే వాళ్లు "వీడే దొంగ" అని చావతన్ని వెళ్ళిపోయారు. ఎల్లాగో లేచి యింటికి వెళ్ళేసరికి, అక్కడకూడా తన మాటలు చెల్లకపోవడమే గాకుండా దెబ్బలు తిన్నాడు. ఆలోచించి నెమ్మదిగా రాజుగారిదగ్గరకు బయలుదేరేడు.

అక్కడ, రాజుగారి దగ్గర మొఱ్ఱ పెట్టుకోగా, "అయినా చూద్దాం" అని యింటికి కబురు పంపించారు. అప్పుడు దేవచౌదరికూడా వచ్చాడు. ఇద్దరిలో అసలు "చౌదరి"గా దేవచౌదరినే అంతా చెప్పారు. అప్రను మరి మంచి బుద్ధి కలిగి వున్నాడుగా. చివరి కాలోచించి అసలు చౌదరి తన మంగలిని కనుక్కోమన్నాడు. మంగలి కూడా పరీక్షించి యిద్దరూ ఒకటేరకంగా వుండేసరికి దేవచౌదరినే అసలు చౌదరి అన్నాడు. అపుడసలుచౌదరి ఏమీ చేయలేక "మూర్ఛ" పోయేడు.

అప్పటికి దేవచౌదరికి దయకలిగి, తన నిజస్వరూపంతో బంగారు కమలం మీద కూర్చొని గాలిలో మెరుగుతూ యిల్లాగ అన్నాడు: "కోడలా! యిది నీ ప్రార్థనాఫలితం. కుమారా! యింకెన్నడూ లోభిగా వుండకు. నీ పాపాలిప్పటికి నశించాయ్. నాకు 'స్వర్గం' ప్రాప్తించడం కోసం నేను పడ్డ కష్టం యిది. తాతలు కట్టించిన ధర్మసత్రము త్రగులబెట్టావ్. తిరిగి దానిని బాగు చేసి, దానధర్మపరుడవై మెలగుతూ వుండు. లోకంలో యెవ్వరైతే అల్లాగ దానధర్మపరులై వుంటారో వారంతా ముక్తి పొందుతారు."

అంతా చేతు లెత్తి నమస్కరిస్తూండగా చౌదరి తన యావజ్జీవితం దానధర్మపరుడుగా వుంటానని ప్రమాణం చేశాడు.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౧౪

పెద తిరుమలయ్య రచన: (సంపు. ౨; ప. ౨౮౭)

భైరవి రాగం - రూపకతాళం

రాగలక్షణం:

సుప్రసిద్ధమైన రక్తి రాగం వెంకటమఖిప్రకారం ౨౦ వ మేళంలో జనించినది. ఈ మేళము 'రీతిగౌళ' మేళ మన్నాడతడు. కాని అతనితండ్రి గోవిందదీక్షితుడు భైరవినే మేళముగా గ్రహించెను. (సంగీతసుధ. పు ౨౦౯) చ-రి, సా-గ, శు-మ, శు-ధ, కై-ని స్వరములు గలది. లక్ష్యములో ఎక్కడనైనా ఒకచోట పంచశ్రుతిధైవతంగూడా వినవస్తుం దన్నాడు గోవిందదీక్షితుడు. (సం సు. పు. ౨౦౯) వెంకటమఖిగూడా ఈ మాట అనువదించినాడు (చ. ప్ర అను. పు ౧౧) ఈ తీవ్రధైవతస్వరమే ప్రధానంగా గమనించి సోమనాథుడు దీన్ని శ్రీరాగమేళంలో చేర్చినాడు. (రా. వి. వివే. 3 ౪౯) అతని ౨౩ మేళాలలో ఈ మేళమే లేదు. అతనికంటె మొదలే రామామాత్యుడున్నూ ఇట్లే నిర్ణయించెను (స్వరమేళ (ప. ౪, ౧౮) కాని గోవిందదీక్షితుల కాలానికే దీనిలో శుద్ధధైవతం కాలూది నిలిచినది. ఆకస్మికంగా అక్కడక్కడ తీవ్రధైవతం తోచినంత మాత్రాన 'మేలాంతరం తేన నకల్పనీయం' అని నిర్ణయించినాడతడు. (సం-సు. పై) ఆనాడు మొదలు నేటిదాక శుద్ధధైవతమే ఈ రాగానికి స్వరూపదానం చేసింది.

ఈ రాగంలో చతుశ్శ్రుతిధైవత మున్నదా లేదా అనే విషయంలో కొన్ని యేండ్లుగా పెద్ద పెద్ద విద్వాంసులు హోరాహోరిగా వాదం చేసినారు. త్యాగయ్యపుణ్యాన క్రొత్తగా ప్రచారానికి వచ్చిన ఖరహరప్రియను పాడమరిగిన ఆధునికవిద్వాంసులలో అనేకులు చతుశ్శ్రుతిధైవతాన్ని మితిమీరి ఇందులో కలుపుచున్నారు ఇందుచేత ఇప్పుడు ప్రాయశః ఈ రెండు రాగాలకూ కల భేదం అంతరిస్తూవున్నది. ఆరోహావరోహాలలో స్వరముల వర్జ్యావర్జ్యతలకంటె, అల్పత్వబహుత్వము లనే రాగస్వరప్రధానధర్మాలను గమనించకపోవడంమూలాన వచ్చిన బెడద ఇది.

చ-ధైవతం ఇందులో ఉన్నది; కాని దాని గతి, మితి ఎట్టిది? శుద్ధమైనా చతుశ్శ్రుతియైనా ఈ రాగంలో అది న్యాసస్వరం కాదు: ధా, నిదా, పధని సనిధా, గమపధా, — ఇత్యాదిగా విన్యసింపరాదు. ధైవతాన్ని తాకినవంటనే పంచమానికో నిషాదానికో దూకవలసినదే. ఆరోహణంలో చతుశ్శ్రుతి యని, అవరోహణంలో శుద్ధమని చెప్పడంగూడా చాలా స్థూలమైన లక్షణమే చతుశ్శ్రుతిధైవతస్థానం మొదలు షడ్జంవరకూ 'ఝారి' గమకంతో నిషాదం సంచరించేది ఈ రాగం ముఖ్యలక్షణాలలో ఒకటి గనుక, పధనీ, స, సనిధనీ, స ఇత్యాది ప్రయోగాలలో పా పధధనీ, సని నిస ధనీ - ఇట్లు ధైవతాన్ని పంచమానికో నిషాదానికో అతికించే ప్రయోగించేది సంప్రదాయం. నిజం చూడబోతే ప-ని స్వరాల నడుమ చిక్కి నలుగుతుంది ధైవతం ఈ రాగంలో. అవరోహణంలో శుద్ధధైవతమూ ఇట్లే నిధా ప అన్నప్పుడు జారి దిగును; పధప అన్నప్పుడు అతికోమలమై పంచమాన్ని అంటుకొనే ఉండును. ఎంత ప్రధానమైనా కేవలం పరతంత్రమైన స్వర మిది

దీనివంటిదే ఈ రాగంలో గాంధారంగూడా ఇదిగూడ న్యాసస్వరం కాదు. రి-మ లలో ఏదో ఒకదానితో గాంధారపు నడక ముక్తాయింపు కావలెను. 'గా రి' అనే ప్రయోగం రిరిరి గారి అని కాని, మామ గారి అని కాని చేయవలయును. ఇంకా రెండవదానిని మరిరి గారి అన్నట్లు గమనంతో సంచరిస్తే ఈ రాగం ఎక్కువగా స్ఫురిస్తుంది రిగరీ, రగారి, నిగారి, మగారి, రిగమా పా—ఇత్యాది నడకలలో గాంధారం సాధారణగాంధారంకంటే ఒక రేఖ తక్కువగానే పలుకును. మధ్యమం న్యాసార్హమైన స్వరమైనా పంచమందాకా పోయే సందర్భాలలోనూ, స్వతంత్రంగా నిలిచే సమయాలలోనూ, స్వస్థానం మొదలు పంచమస్థానంవఱకూ ఆక్రమించుకొని తూగుచుండును; రిగమా అని శుద్ధంగానూ, రిగమ పామపమ అనియును ప్రయోగించవచ్చును శుద్ధంగా స్వస్థానంలో నిలిచేవి ఈ రాగంలో స, రి, ప స్వరములుమాత్రమే. 'ఈ భైరవిరాగమందు ప్రకృతివికృతులైన ద్వాదశస్వరములును, అన్నిగమకములును స్ఫురించుచున్నవి' అని సుబ్బరామదీక్షితులు వ్రాసినమాట నిజము. (సం. ప్ర. ౪౬౨) కాని ఆ గౌరవం ఇప్పుడు శంకరాభరణాదులగు పెద్ద రాగాలకన్నిటికీ ఇంచుమించుగా చెల్లును. ఈ రాగాన్నిగూర్చి సుబ్బరామదీక్షితు లిచ్చిన వివరణ చాలా శ్రద్ధగా గమనింపవలసినది.

[పల్లవి]

(౧) ని ని స రి గా రి స స ని సీ, రి స ని ధ ప ధ మ । ప పా, ధ సీ ని సా , , , ,
ప రి పూ ర్ణం డ వు నీ కు ప రా కు న్న దా

(౨) ని ని స రి రి స రి మ గ రి స ని స ర స రి గ రి స ని ధ ప ధ మ । ప పా, ధ ని స రి గా రి సా , , , ,
ప రి పూ ర్ణం డ వు నీ కు ప రా కు న్న దా

(౩) రి ని సా ప మ గా రి స ని స రి గ సా రి నీ ధ ప ధ మ । ప ధ ని స రి గ మ ప ధ ప గ మ ప మ గ రి సా , , స స
ప రి పూ ర్ణం డ వు నీ కు ప రా కు న్న దా ని ను

(౧) రి గ మా మా ప మ గ రి గ మ పా । ప రి గ మ ప ధ ని ధ ప ధ మ పా ధ మా ప గ రి స
మ రి గి యుం డ నీ దే మా వ ల్ల తె ప్పు గా క

(౨) రి గ మా, గ రి గ మ ప ధ ప ధ మ ప గ గ మ పా । మ పా సా, ని ధ ప ప సీ ని ధ మ ధ ప మ గ రి గ స
మ రి గి యుం డ ని దే మా వ ల్ల తె ప్పు గా క

(౩) రి గ మ పా గ రి గ మ ప ధ ని సీ ని ధ ప ధ మ పా । ధ ని సా రి సీ ని రి సీ ని ధా పా మ ప ధ ని సీ ప ప గా, రి స , , , ,
మ రి గి యుం డ ని దే మా వ ల్ల తె ప్పు గా క (పరి)

[చరణం]

(౧) , ప ధా పా, పా ప ధ ప ధ మా మా ని ధ నీ । , ని ని రి సీ ని ధ పా పా ని ప ధ మ ధ పా
వి న వా నీ వె మి యై న వి శ్వ మె ల్ల ని ని ను లే

(౨) , ప ధా పా పా ధ ప మ గ రి గా మ ప ప సీ నీ । , పా ప ధ ని స గ రి సా సీ రి ని ధ ప మ ధ పా
వి న వా నీ వే మి యై న వి శ్వ మె ల్ల ని వి ను లె

, ప ధ నీ ధ ప మ గ రి గ మ ప ధ ప ప మ గా రి స । , రి గ మ మా; ప మ గ రి గ మా ప ధ ప ధ పా
ఎ న సి వి న్న విం చ ని యొ డ్డె త న మిం [illegible]



"జరావ్యధ"
(పోర్ట్రెయిటు I ప్రైజు) హెచ్. వి. రామగోపాల్.



"విధి - జీవితము"
(బ్లాక్ అండ్ వైట్ I ప్రైజు) హెచ్. వి. రామగోపాల్.



"కోతులు"
(ప్రాచ్యచిత్రాలు II ప్రైజు) శ్రీమతి పంకజం పాల్‌రాజ్.

చిత్రకళాప్రదర్శనము - సమీక్ష

శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తి

తమిళరాష్ట్ర కాంగ్రెసుసంఘమువారు అఖిలిల భారతపారిశ్రామిక చిత్రకళాప్రదర్శనము ఏర్పాటుచేశారు. అది డిశెంబరు ఇరవైనాలుగు మొదలు జనవరి నెలాఖరువరకు జరిగింది. అందులో దాదాపు ఆరువందల చిత్రములు ఉన్నాయి. రాష్ట్రకాంగ్రెసు ఆధ్వర్యంలో జరిగే చిత్రకళాప్రదర్శనములు ఈమధ్య బాగుంటున్నాయి. కార్యదర్శిగారైన శ్రీ ఎన్. కె. వినాయకముగారు నలుగురనూ సమావేశపగుప గలిగిన నేర్పరి. పలువురు చిత్రకారుల సహాయముతో ప్రదర్శనము ఎంతో బాగుం దనిపించారు. శ్రీమతి రుక్మిణీదేవిగారి ప్రారంభోత్సవముతో, శ్రీ పి. వి. .రాజ మన్నారుగారి చేయూతతో, శ్రీ దేవీప్రసాదు రాయచౌదరిగారి ముగింపు ఉత్సవముతో ఈ ప్రదర్శనము జయప్రదముగా జర్గింది. దేవాలయగోపుర ద్వారమువలె చిరుగంటలతో సింహద్వారము, హాలుకి ఎదురుగా ధ్వజస్థంభమువలె అశోకుని జయస్తంభము కట్టించి అందచందాలు తీర్చిదిద్దారు. హాలు పెద్దది. ఆరువందలచిత్రములకు సరిపోయింది.

బొమ్మలు ప్రదర్శించిన చిత్రకారులు చాలామంది ఉన్నారు. వీరిలో అనేకులు చెన్నపట్టణములోనివారే. ఇతరప్రాంతాల నించి కూడా బొమ్మలు వచ్చాయి. ఎక్కువ బహుమతులు ఆంధ్రచిత్రకారులకే వచ్చాయి. చిత్రకారులందరి కృషిని గురించి చెప్పటము కష్టము. విషయవిస్తరణకు వెరచి సంక్షిప్తంగా చెప్పవలసివస్తోంది. ఇందులో ప్రదర్శించిన వారందరు చిత్రకళాధిదేవతను వారి హృదయపీఠాలలో అధివసింపచేసి, ఆదేవిపాదాల మ్రోల అంజలులు ఘటించినవారే. దేవికి ఎన్ని భావసుమాలు అర్పించుకున్నారో ప్రేక్షకులకు విదితమేకదా! వీటిలో దేనిపరిమళము - సొగసు దానిది. కొన్నిటికి పరిమళము లేకపోయినా శివప్రీతికరమైన తుమ్మిపూలవలె పవిత్రముగానూ ఉన్నాయి. కొన్ని తీగపూలు దూరాన్నించి ఆకర్షిస్తాయి. దగ్గరసావెళ్లి చూస్తే చిత్రముగాపువ్వులులా నే ఉండవు. అయినా వాటి సొగసు వాటిది. అల్లా ఉన్నాయి కొన్ని బొమ్మలు. కొన్నిటి భావపరిమళము ఆహ్లాదకరంగాను, కొన్ని ఘాటుగాను ఉన్నాయి. అనేక పరిమళ పుష్పశోభితమైన ఉద్యానవనములో ప్రవేశించినట్లు ఉంది ప్రదర్శనములోకి వెడితే. రంగురంగుల బొమ్మలు. రకరకాల బొమ్మలు. దూరానికి బాగుండేవి కొన్ని. దగ్గరకు బాగుండేవి కొన్ని. వీటిలో ఇది నాకు నచ్చింది అది నచ్చలేదు అనుకుంటే ఎందుకు నచ్చిందో ఎందుకు నచ్చలేదో పవిమర్శగా తెలుసుకోవటము అవసరము. ప్రతి చిత్రకారుని బొమ్మలూ వరుసగా పెట్టిఉంచే ఒక్కొక్కరి కృషినిగురించి సమగ్రముగా తెలుసుకుందుకు ప్రేక్షకులకు వీలు అవుతుంది. ఈ బొమ్మలన్నీ అల్లా పెట్టిఉంటే ఈ ప్రదర్శనము ఇంకా బాగుండేది. కేటలాగు ప్రకారము ప్రదర్శనములో పదిభాగము- లున్నాయి. అవి పాశ్చాత్య పద్ధతిలోని నీటిరంగుల బొమ్మలు. మూర్తిచిత్రములు. ప్రాచ్యసంప్రదాయ చిత్రములు, నలుపు తెలుపు బొమ్మలు, మహాత్ముని జీవితము - సందేశములను గూర్చినవి, చిన్నపిల్లలవి, మళ్లీ పాశ్చాత్య సంప్రదాయముతో నీటిరంగులతో వేసినవి, తైలవర్ణ చిత్రములు, శిల్పము, ఛాయాచిత్రములు, వ్యాపారచిత్రములుగాను ఏర్పరిచారు. ఛాయాచిత్రములలో మొదటి బహుమతి డి. శ్రీరామమూర్తిగారికి వచ్చింది. వ్యాపారచిత్రములలో కె. రామమూర్తిగారి చీరంచుబొమ్మలు బాగున్నాయి. ఇంకా తైలవర్ణచిత్రములలో రెండవ బహుమానము కూచి భాగేశ్వరశర్మగారి "నీటి కలవ" అనే బొమ్మకు వచ్చింది.

శిల్పము - అర్ధశిల్పము, ఈ రెంటిలో ను



"కునుకు"
(కాంపోజిషన్ I ప్రైజు) శ్రీ నరసింహాచార్య.

, పధని ధామ పా , ధ నీసరిసా । పధ నిసరి గారి స సా , నిరిసని ధాప
కన వా , నీ విన్ని యునీ కనులే రెండు జా చిన

, ధనీ సాగ రిసనీ నిసరీగరిసాగిస నిధప । ప పరిసరినిసపధమప మపనినిధపమ గారిసా ॥
పని తో నా భా వ ము జా ప ని నే ర మి గా క (పరి)

ఇట్లే ఈ క్రింది చరణాలు:

(౨) పలుకవా నీ వేమియైన - బహుళబ్దమయుండవు!
అలరి పిలువని నా - యవివేక మింతే గాక;
నిలువవా నా ముందర - నిఖిలస్వరూపుండవు!
తెలిసి చూడలేని సం - దేహ మింతే గాక॥ (పరి)

(3) మన్నించవా నీవె మీ - మఱుగుజొచ్చితి నంటే!
పన్ని మత్తుడనై యున్న - పాపకర్మము గాక;
యిన్నిట శ్రీవెంకటేశ! - యేలితివి నన్నునిట్టె,
యిన్నాళ్లెఱుగని భాగ్య - మిట్టుండె గాక॥ (పరి)


లఘుటీక: పరాకు = పరాఙ్ముఖత్వము; మరిగి = విడువరానంతటి తగులము కలిగి; ఎనసి = సమీపించి; పన్ని = బుద్ధిపూర్వకముగా.
ముద్రితపాఠము: విశ్వమెల్లా వీనులే.



"పల్లెతల్లి"
కె సి యస్ పణిక్కర్.

ఉత్కృష్టమైన భారతీయ సంప్రదాయాలు ఉన్నాయి ఎల్లోరా, అమరావతి, నాగార్జున కొండ మొదలైన బౌద్ధ, జైన, బ్రాహ్మీ శిల్పములు అనేకము ఉన్నాయి వీటి సంప్రదాయములు అపూర్వములు ఆ శిల్పసంపద నేటి చిత్రకారులు ఎంత వినిమయం చేసుకుంటే అంత గొప్ప శిల్పము అవతరిస్తుంది ఇక్కడ ప్రదర్శించిన శిల్పాలకు ప్రాక్ - ప్రతీచీ శిల్ప సంప్రదాయములతో వేటితోనూ సమన్వయము లేదు సరస్వతి, బ్రహ్మ మొదలయిన దేవతా మూర్తులను శిల్పించదలచుకుంటే - ఆ దివ్య మూర్తులతో తాదాత్మ్యము పొందాలి ఆ ప్రాచీనసంప్రదాయ మార్గములను హస్తగతం చేసుకోవాలి ఏ లలితకళలోనయినా పాత క్రొత్తల మేలు కలయిక సాధించాలి పాత విడచి సాము చేయలేము ఎంత విప్లవము తీసుకు వచ్చినా ఏ దేశకళాచరిత్రలోను - పూర్వ సాంప్రదాయముతో పూర్తిగా విడగొట్టుకొనిన యుగములేదు అల్లా ఉంటే అది చరిత్రలో అంధయుగము ఇక్కడ ప్రదర్శించిన శిల్పాలలో మూర్తిశిల్పములుకూడా ఉన్నాయి "మహాశివుని" మూర్తిశిల్పము పార్థసారథిగారు చక్కగా తీర్చారు ఇంకా ధనపాల్, సి. గోపాల్, రామగోపాల్‌రావుగారల "పద్మశాలి" "శివతాండవ" "బాపూజీ" అర్ధశిల్పములు బాగున్నాయి

ఇక్కడ ఒక్కమాట సత్యసుందర శివాత్మకమైన లలితకళాస్వరూపము అనంతము, అవ్యయము అనిర్వాచ్యము వివిధకాలముల యందు, వివిధదేశముల కళారాధకులు, చిత్రించి శిల్పించి, సాక్షాత్కరింపచేసుకున్నారు ఆ మాధుర్యమే మానవ పరమావధి కళా తపస్విలో మనకు అజ్ఞాతంగా ఉండిపోయినా, సహవాసము చేసిన ప్రజలు గొప్పచిత్రములను పూజించి నీరాజనమెత్తుతారు మనలో కళాభివృద్ధి తప్పక కావాలి తరువాత ప్రజాజీవితంలో కళలు ప్రతిఫలించి ప్రజలు - కళలు అన్యోన్య సహవాసములో పులకించిపోవాలి ఇది పూర్వులు సాధించారు ఒక్కొక్క యుగములో ప్రజాసామాన్యము మార్గములేక అంధకారములో ఉండి కొంతకాలానికి కళల వెలుగులోనికి ముందుకు సాగిపోయారు లేక లలితకళలు నిద్రాణంగా పడిఉంటే బుద్ధునివంటి యుగపురుషుడు పుట్టి కళలకు ప్రబోధము జరిగింది ఈ అన్యోన్యానుకరణంతో కళలు విజృంభిస్తాయి ఆనాడు కాని ప్రజలు - కళలు పరస్పర సౌశీల్యముతో చేతులు కలిపి నడవాలి ప్రజలయెడ-కళలు, కళలయెడల ప్రజలు ఉపేక్షా తిరస్కృతులు చూపటము అభివృద్ధినిరోధకము అంతే కాదు ఆత్మవినాశమునకు దారితీస్తాయి ఒక దేశములోని ప్రజల నాగరికత గొప్పదయితే ఆ దేశంలోని లలితకళలుకూడా గొప్పదశలో



'మహాత్మ గాంధి"
(గాంధీజీ చిత్రాలు II పైజు) హెచ్ వి రామగోపాల్

ఉన్నాయన్న మాట కాక మన దేశాభివృద్ధి చాలవరకు కళలపైనే ఆధారపడిఉంది ప్రజలు కళలు అభివృద్ధి చెందిననాడు కళారాధకుడు ధన్యుడు ఈ ప్రదర్శనములో చిత్రకారులలో ఇంకా రావలసిన పరిణతి రాలేదేమో అనే సంశయముకూడా కలుగుతోంది గాంధి, టాగూరులు జాతిని పునరుద్ధరించి దివంగతులైనారు మహాత్ముని ఆత్మార్పణముతో భారతావని కంపించిపోయింది నేడు ఆసేతుహిమాచలపర్యంతము ప్రజల్లో చైతన్యము తాండవమాడుతోంది కాని చిత్రకారులు మాత్రము ఇంకా స్వప్నాలుకంటున్నారు ఈ బంగారు కలలు కనటంతోనే సరిపుచ్చుతారో కళారంగములో కర్మవీరులు అవుతారో ఇకముందు చూడవలసి ఉంది! ఈ చిత్రకళా ప్రదర్శనము - కొంత ఉత్సాహము - సంచలనము కలుగచేయక పోలేదు ఆ సంతృప్తి వలన ఇంకా ముందుకు పోవాలనే ఆశాభావము లేకపోలేదు కాని నిస్పృహ నైరాశ్యము చిత్రకారులకు కలుగకూడదు

ఈ ప్రదర్శనములో పాశ్చాత్య చిత్రరచనా పద్ధతులలో వేసినచిత్రములు చాలా ఉన్నాయి వీటిని గూర్చి కూడా ఒకమాట. ఈ స్వేచ్ఛ వచ్చినట్లు వచ్చిపడ్డాయి పాశ్చాత్య నాగరికత సభ్యత, మన జీవితములో నేటి మనము కొన్ని శతాబ్దముల నాటి భారతీయులము కాము నేటి మనస్థితి, కళలో - జీవితములో - ఊహాలో - చేష్టల్లో అటు - ఇటుగాని అయోమయ స్థితి. నేటి చిత్రకళకు ప్రాచీన భారతీయ చిత్రకళకు సామీప్యమే లేదు నాటి చిత్రకళాసంప్రదాయాలతో మనకు బిగువు సడలిపోయింది శరత్కాలమేఘశకలాకవతె నేటి చిత్రకళాధిదేవత నిలువద్రొక్కుకొనలేక తికమక పడుతోందని ఈ ప్రదర్శనము చాటుతోంది అవనీంద్ర - నందలాలువంటి చిత్రకారులు-ల్లా ఆశాభావం కలుగుతూన్నా - ఇంకా చిత్రకళలో పాశ్చాత్య అనుకరణ యందు వ్యామోహం మనల్ని వదలలేదు చిత్రకారులు విశ్వవిశాలమయిన దృష్టి ప్రదర్శిస్తున్నామనుకోవటమే కాని క్రిందటి అనుకరణే మిగులుతోంది. ప్రాచ్యశిల్పాదర్శములు పరిశీలిస్తే భిన్న దేశముల కళాప్రాంతము కలిసినచోట్ల నేటికి మల్లే విపరీతము కాలేదు సాంకర్య మనిపించుకో లేదు.

అనిపించగా ప్రాచ్యశిల్పాదర్శములు సంపన్న సమృద్ధము కాని నేటి పాశ్చాత్య నీరస ప్రభావము మనచిత్రకారులను లోగొని నేటి చిత్రకళకు పుష్టి నీయలేదు పాశ్చాత్యులు అనగా నేతోసిపారవేయమని నే ననను అన్ని రచనా మార్గములు నిర్భయంగా పరిశీలనచేసి - రచనా పద్ధతులల్లో - ఎతివృత్తములో స్వాతంత్ర్యము, స్వేచ్ఛ, వ్యక్తిత్వము కనబరచాలి కొన్ని స్వల్ప ప్రయోజనములను దృష్టిలో ఉంచుకొని చిత్రించ

(21-వ పేజీ చూడుడు)



"పద్మావతి" (శిల్పము I పైజు) యస్ ధనపాల్



"కర్షకనవోదయం" (ప్రాచ్యచిత్రాలు-స్పెషల్ పైజు)
పి యల్ యన్ మూర్తి (వ్యాసరచయిత)



"... ..."
(బ్లాక్ అండ్ వైటు - I పైజు) కె. యల్.
యన్ మూర్తి (వ్యాసరచయిత)

నేటి కొండపల్లిదుర్గము

శ్రీ కప్పగంతు రంగయ్య

విజయవాడకు ఉత్తరదిశన పదునైదు మైళ్ల దూరమున కొండపల్లియను గ్రామము కలదు కొండపల్లిని గురించియు, దాని జాలించి యశశ్చంద్రికల వెదజల్లిన పూర్వరాజుల వైభవమునుగూర్చియు మన చరిత్ర చాటుచునే యున్నది విజయవాడనుండి బస్సుపైనను లేక రైలుపైనను కొండపల్లికి జేరవచ్చును ఇయ్యది హైదరాబాదునకు పోవు రైలుమార్గమున కలదు గ్రామమునకు ఫర్లాంగుదూరమున పడమరదిశగా ఎత్తైనకొండ గలదు ఇది మిగుల పొడవైనదని చెప్పవచ్చును ఈ కొండపై పూర్వరాజులచే కట్టించబడిన గొప్ప దుర్గము కలదు ఆ దుర్గము ఒకప్పుడు అత్యంత రమణీయమై వినూత్న కాంతులు వెదజల్లినది కాని నేటికి కాల ప్రవాహమార్పులచే కాంతివిహీనమయి శిథిలావస్థ ననుభవించుచున్నది అంతటి వైభవోన్నతు లందిన రాజమందిరమున నేటికి గబ్బిలములు చిరస్థాయి నేర్పరచుకొనిన వని కంటతడిబెట్టని తెనుగుబిడ్డ లుండరు

కొండపై దట్టముగా చెట్లు గలవు దూరము నుండి జూచువారికి చెట్లుతప్ప రాళ్లు గనపింపవు కొండపైగల దుర్గమును జేరుటకు కాలిమార్గము కలదు కాలిమార్గమును కలియుచు కొండను చుట్టివచ్చు రోడ్డు కూడ కలదు కాలిబాటన మెట్లు గలవు ఇయ్యవి శీతోష్ణస్థితుల మార్పులచేతనో, లేక కొన్ని సంవత్సరముల నాటి వగుటచేతనో, లేక మరమ్మతుచేయువారు లేని కారణముననో ననుపుబారి వాటివాటి స్థానముల దప్పియున్నవి అయినను మార్గము సాఫీగానే యున్నది

గ్రామమునుండి కొండ దిగువభాగమువరకును చక్కగ బాట కిరువైపుల శీతాఫలవృక్షములు గలవు వాటిపై జేరి కూనిరాగములుదీయు శుకపిక సంతానములు యాత్రికులకు మనోహరము గొల్పుచుండును శీతాఫలములు ఇచ్చట విరివిగా లభించును ఈ చెట్లను వ్యాపారులు గుత్తకు పుచ్చుకొనియుండిన కారణమున యాత్రికులు స్వేచ్ఛగా కాయలగ కోసికొన వీలులేదు చెట్లకు కావలికాయు పల్లెపిల్లల గేయములు నవ్వు పుట్టింపక మానవు మరియు నచ్చోట దిరుగాడు పక్షిజాలముకై, చెట్లకు వలువలుగట్టి కూర్చున్న కిరాతకులు మనకు గన్పడుచుందురు ఇట్టి విశేషణములచే నొప్పియున్న శిథిలదుర్గమును జూచుటకు నలువైపులనుండి నేటికిని అసంఖ్యాకులై యాత్రికులు వచ్చుచునేయుందురు

కాలిబాట కిరువైపులనున్న చెట్లతీగలు ఒకదాని కొకటి అల్లుకొని ఆర్చీలు తిరిగియుండును అందువలన కాలిబాట ననుసరించిన యాత్రికులకు చల్లని నీడ లభించును మార్గమధ్యమున నచ్చటచ్చట పుట్టలు గలవు కాలిబాటనగల బండలు నునుపుదేలుటవలన బాలురు, వృద్ధులు అతి జాగరూకతతో నడువవలెను నడువగా నడువగా

కొలదిసేపటికి కొండపైభాగము జేరగలము కాలిబాటను కలియుచు పోవు రోడ్డువద్ద ఆంజనేయుని విగ్రహము కలదు ఇది రాతిపై చెక్కబడినది ఈ విగ్రహమునకు నిత్యనైవేద్యములుగాని ధూపదీపములుగాని లేవు

రోడ్డు కూడ బాగానే యున్నది రోడ్డు వెడల్పు షుమారు రెండుగజము లుండును పూర్వము సైనికులు అశ్వములపై స్వారీచేయుచు ఈ మార్గమున పైకి పోవుచుండిరని చెప్పుదురు చివరకు పైభాగమున పెద్ద కవాటము గాన్పించును ఈ కవాటము నిడివిగల రాతి స్తంభములచే నిర్మింపబడియున్నది అటుపిమ్మట రెండు కవాటములు గలవు కవాటములు దాటినవెంటనే మసీదు గాన్పించును ఈ మసీదు ఇటీవల కట్టబడినట్లు చిహ్నములు గాన్పించుచున్నవి దీని తలుపులు ఏ కారణముచేతనో బంధింపబడి యున్నవి దీని వెనకభాగమున లోయ గలదు లోయచుట్టూ దట్టముగా చెట్లు గలవు ఇందొక చెఱువు గలదు దీన నట యాత్రికులు స్నానము చేయుచుందురు దీనిచెంతనే పెద్ద శాల గలదు ఇది నేడు పూర్తిగా శిథిలమైయున్నది. దీని పైభాగమున రాతిగోడలు గలవు. క్రింది భాగమున కవాటములు ఆర్చీలు తిరిగియున్నవి ఆ గోడల నాధారము చేసికొని చిన్న గదులను మనవారు నిర్మించియున్నారు దీనిని ఇపుడు బంగళా యందురు ఇందు "దుర్గము" ను జూచుటకు వచ్చిన యుద్యోగస్థులు మకాము చెయుదురు ఒక్క ఉద్యోగుననేల ? ఎవ్వరైనను రోజు కొక రూపాయి కిరాయి యిచ్చినచో అట నుండవచ్చును చుట్టు ఆవరింపబడిన పొదలలో భీకర మృగములు చిరుతపులులు మొదలుగాగల వన్యమృగములు గలవు ఇచ్చట కొండముచ్చులు లెక్కకు మిక్కిలిగా యున్నవి

ఈ బంగళాకు చేరువనే అగాధజలపూరితమగు సరస్సు గలదు దీనిలో నీరు ఆకు పచ్చవర్ణము కలిగియుండినను, త్రాగుటకు మధురముగా నుండును వన్య మృగములు దప్పి తీర్చుకొనుటకు రాత్రివేళ ఈ సరస్సునకు వచ్చుచుండునని అచ్చట కట్టెలు గొట్టుకొనువారు చెప్పుదురు సరస్సునకు ఎడమవైపున ఇరువది బారల దూరమున నొక కట్టడము గలదు ఇదియే చెఱసాల సరస్సునకు మైలు దూరముపైగా భోగముదాని మేడ గలదు ఇందు పూర్వ చిహ్నములు మచ్చుకైనా లేవు సాధారణముగా దీనిని జూచుటకు ఏ యాత్రికుడు ధైర్యము వహించి పోజాలడు ఈ మార్గము లతలచేతను, కంటకముల చేతను, ఆవరింపబడియుండును వివిధములగు మార్గములు ఒకదానినుండి మరొకటి బయలుదేరును మార్గము తప్పినచో మరల బాట కనుగొనుట ప్రయాసము కొంతమంది కొంత దూరము పోయి విసుగుజెంది మరల తిరిగి వచ్చుటయు గలదు గజశాలలు, అశ్వశాలలు గల స్థలములను వనము జూతుము కాని, అవి ఆ స్థలములనియే నిరూపించుటకు గుర్తులు గన్పింపవు

వటవృక్షమొకటి యూడలు దిగి యాత్రికుల సేద దీర్చుటకై చక్కని నీడ నిచ్చుచున్నది శీతాఫలవృక్షములు, ఫల్లరేగి చెట్లు కొండపై భాగమున మిక్కిలిగా ప్రబలియున్నవి ఈ పండ్లను స్వేచ్ఛగా కోసికొనవచ్చును ఇంకను వివిధములగు ఫలవృక్షములు గలవు దుర్గమంతయు నేడు చెట్ల పొదలతో ఆవరింపబడియున్నను కొన్ని కొన్ని మార్గములు బాగుగనే యున్నవి ఇంత విశాలమగుదుర్గమును శ్రమయని భావింపక నిర్మించిన రెడ్డిరాజులు ప్రశంసార్హులు ఈ శిథిల దుర్గమును పూర్తిగా జూచుటకు రెండు మూడు దినములు పట్టును మేడ స్తంభములు కాబోలు-వాటిపై తీర్చిదిద్దిన శిల్పకళానైపుణ్యము నేటికిని చక్కగా గన్పించుచున్నది ఇంకను జూడదగిన భాగము లనేకము గలవు అరుణకిరణములు తల్లిగర్భమును జేరు సమయమున యాత్రికులు కొండను దిగుట కారంభింతురు ఇయ్యది మన తెనుగురాజుల వైభవము తప్పక వెల్లడిచేయుచున్నది

తెనుగురాజుల పేరెన్నిక గన్న దుర్గములలో "కొండపల్లిదుర్గము," ఒకటియై యున్నది.

మంగూరు అత్తయ్యలు

(14-వ పేజీ తరువాయి)

రోజుల్లో మూడు వేట్ల యేకులూ దారాలుగా మారికూచున్నాయి. ముత్తయిదువలు ముగ్గురూ కామాక్షిని "తొరగా పెళ్లికూతురువు క"మ్మని దీవించి, "పెళ్లినాడు మామాట మరచిపోకు సుమా!" అని జ్ఞాపకం చేసి వెళ్లిపోయారు

రాణీగారు కామాక్షి ఏమాత్రం నూలు వడికిందో చూద్దామని వచ్చేటప్పటికి ఏకులన్నీ నూలుగా మారిపోవటం చూసి ఆశ్చర్యపోయింది. ఆ రోజుల్లో రాణీలు అన్నమాట తప్పేవారు కాదు అంచేత తక్షణమే కామాక్షిని తీసుకుపోయి తన కొడుక్కిచ్చి పెళ్లిచేసేసింది చెప్పడం మరిచిపోయాను కామాక్షి చాలా అందమైన పిల్ల. 'ఇంత అందగత్తె నాకు పెళ్లాం అయింది గదా' అని రాజకుమారుడు ఎంతో మురిసిపోయాడు.

పెళ్లినాడు పెద్ద విందు చేశారు కామాక్షి ఒక్క బూరికూడా నోట్లో పెట్టకోలేదు రాజకుమారుడు, "ఏం? అలా విచారంగా ఉన్నావ్ ?" అని అడిగేడు "నాకు ముగ్గు రత్తలున్నారు వాళ్లు విందుకు రాకుండా నాకు బూరెలెలా సహిస్తాయి ?" అంది కామాక్షి. అప్పుడు రాజకుమారుడు, "అయ్యో, చెప్పేవు కాదేం, ఇంత సేపూ ? గుఱ్ఱబ్బగ్గీ పంపించి, మీ అత్తల్ని రప్పించు" అన్నాడు.

గుఱ్ఱబ్బగ్గీమీద లావు కాలత్తా, రామాఫలపుపెదిమత్తా, పొత్రపు వేళ్లత్తా దిగి, పెళ్లికూతురూ పెళ్లికొడుకూ కూచున్న చోటికి చక్కా వచ్చారు ఆకాలూ, పెదిమే, వేళ్లూ చూచేటప్పటికి రాజకుమారుడికి డోకు రాబోయింది కాని పెళ్లాంమేనత్తలన్న గౌరవంకొద్దీ ఆతడు వాళ్లని ఆదరించి కూచోపెట్టేడు ఐతేం, ఆతడు వాళ్లని ఓ ప్రశ్న అడక్కుండా ఊరుకోలేకపోయాడు

"ఏం పిన్నీ ? నీ కాలిలా ఎందుకులా వెక్కింది ?"

"రాట్నం తొక్కడంచేత నయ్యా, రాజకుమారా !"

"ఓ! ఐతే రెండో పిన్నీ, నీ పెదిమె ఇట్లా ఎందు కయింది ?"

"తెగిపోయిన దారాన్ని తడిచెయ్యటానికి పెదిమను నొక్కడంవల్ల నయ్యా, పెండ్లికొడుకా !"

"అలాగనా ! ఐతే, మూడో పిన్నీ, నీ వేళ్లిలా గయా యెందుచేత ?"

"దారం అతుకెట్టి నలపడంవల్ల నయ్యా, నవమన్మథకుమారా !"

"నూలు వడుకుతే, కాళ్లూ, పెదిమలూ, వేళ్లూ ఇలా ఐపోతా యన్నమాట !" అని హడిలిపోయి, రాజకుమారుడు కామాక్షితో,"నువ్వీరోజు నుంచి నూలు తియ్యటానికి వీల్లేదు" అని బతిమాలుకున్నాడు. కామాక్షి అతనికోసమే అన్నట్లుగా, "ఐతే తియ్యనులెండి !" అని వప్పుగుని, మనస్సులో, ఆ పీడ తన కింకెప్పుడూ ఉండదుకదా అని సంతోషించింది.

అహోబిల నారసింహ క్షేత్రము

(13వ పేజీ తరువాయి)

గాథలు, ప్రహ్లాదుని బాలలీలలు, హిరణ్యకశ్యప సంహారం ఇత్యాది చరిత్రలు నయనమనోహరంగా చెక్కబడి ఉన్నయ్

ప్రతాపరుద్రుని ప్రసక్తి

ఈ గుడినిగూర్చి అర్చకు లీ కథలు చెప్పారు 'ఇది ప్రధానంగా శ్రీవైష్ణవక్షేత్రం అయితే ప్రతాపరుద్రుడు దీన్ని శివక్షేత్రంగా గూడా చెయ్యాలని, శివలింగాన్ని ప్రతిష్ఠించాలని ఆలోచించాడు అప్పుడు ఒకనాడు స్వామి అతనికి కలలో ప్రత్యక్షమై నే నక్కడ ఉండనే ఉన్నాను నువ్వు వేరే ప్రతిష్ఠ చెయ్య నవసరం లేదు అని చెప్పాడు ప్రతాపరుద్రుడు వచ్చి చూసేసరికి ఆలయంలోనే ఒక పెద్ద లింగాకృతిలో భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు అదీగాక శ్రీ మహాలక్ష్మి, చెంచులక్ష్మి గూడా రెండు చోట్ల ఆ గళ్లోనే ఉన్నారు హిరణ్యకశ్యప సంహారానంతరం లక్ష్మీనరసింహులు మనుష్యరూపంలో అక్కడ కాలక్షేపం చేస్తున్నారు ఒకనాడు నరసింహుడు ఒక చెంచుపిల్లను చూచి మోహించాడు 'భర్త లేదు, మా ఆవిడ మంచిదే, ఇంటికి రమ్మని తీసుకు వెడతాడు అక్కడ లక్ష్మి మొదట్లో రానివ్వదు సవతులు కయ్యం పెట్టుకుంటారు చెంచులక్ష్మి తండ్రి చిక్కనాయకుడు చెంచుమూకతో స్వామిపై యుద్ధానికి వస్తాడు చివరకు స్వామి చెంచుల్లో చేరిపోయి ఓబయ్య అనే పేరు పెట్టుకొని, చెంచులక్ష్మిని పెళ్లిచేసుకొని, స్థిరంగా అక్కడ ఉండిపోయేట్లు రాజీ జరుగుతుంది అల్లాంటి స్వామి పేరిట ఓబయ్య, ఓబుళయ్య పేర్లు చాలమంది పిల్లలకు పెట్టుకుంటూ ఉంటారు

ఒక దివ్యానుభూతి

రాత్రిపూట ఆలయంలో పడుకున్న వాళ్లకు 11 గం॥ మొదలు, ఒంటిగంటవరకు అవాఙ్మనస గోచరమైన జంత్రగాత్రములు, కిన్నెర పురుష గాంధర్వ నాట్యములు, స్వస్తివచనములు, దేవతార్చనలు జరుగుతున్నట్లు ఒక దివ్యానుభూతి కలుగుతుంది పర్వతాగ్రంనుంచి, ఉగ్రనరసింహస్వామి ఆలయంవరకు తొమ్మిదిచోట్ల స్వామి వెలసి ఉన్నాడు ఒక్కచోట ఉక్కుస్తంభం గూడా ఉన్నది స్వామి ఆలయము ఉన్న కొండ నల్లని తారుతో పూసినట్లు కొట్టొచ్చేట్లు ఉంటుంది అయితే ఈ నల్లమల పర్వతప్రాంతమంతా మలేరియా వ్యాపించిఉంటుంది దీనికి నివారణమార్గాన్ని అన్వేషించాలి స్వామివారి తీర్థప్రసాదముల సేవించి ఉల్లసితమానసాలతో గృహోన్ముఖుల మయ్యాము

గోసంపద

మధ్య మార్గంలో నాల్గుమైళ్లూ గూడా కార్ల చప్పుడు విని బిత్తరపోవు గోమాతలు తల్లి చాటుకు తప్పుకొనిపోవు లేగదూడలు, వాటి అంబారవములు ఎంతో అబ్బురాన్ని కల్గించినయ్ ఈ గోసంపదను పశుశాఖవారు, వ్యవసాయశాఖవారు సద్వినియోగం చేసుకొని అమెరికాలోవలె దూరప్రాంతాలకు గూడా వాటి పాలు, పెరుగు, వెన్న లభించేట్లు చూడాలి నాల్గుగంటలకు దిగువ అహోబిల లక్ష్మీనృసింహస్వామి దర్శనం చేసుకున్నాము. ఇక్కడే ప్రజలు ధర్మకర్తపై ఆగ్రహాన్ని కొంత వెలిబుచ్చారు ధర్మకర్త తిన్నగా పని చెయ్యాలని, ఉడుతా భక్తిగా తామూ తోడ్పడతామని విన్నవించారు అమాత్యులు పరిస్థితులు ఇకముందు చక్కబడగలవనీ, సహనం వహించవలసిందనీ ప్రజలకు హితోక్తులు బోధించారు రాత్రికి నంద్యాలచేరి గోపవరం వెంటిరెడ్డిగారిచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి పారంబంగళాలో నాల్గోరోజు రాత్రి ప్రొద్దుపుచ్చాము మర్నాడు ఎవరి లక్ష్యాలకు వాళ్లు చేరుకున్నాము కథ కంచికి మనం ఇంటికి

గత సంవత్సరములో మన ఆదాయ పరిస్థితి

శ్రీ నందివాడ కృష్ణమూర్తి

కాలగతి ననుసరించి, వస్తువుల ధరలతోపాటు, దేశీయుల ఆదాయములలోగూడ మార్పులు గల్గినప్పుడే, ఎవ్వరైనను వారి ఆదాయములవల్ల పరియగు లాభములను పొందగలుగుచున్నారు. వస్తువుల ధర లెప్పుడును, దేశమున చలామణిలోనున్న ద్రవ్యముపైనను (*Money in Circulation*) దాని కొనుబడి శక్తిపైనను (*Purchasing Power*) ఆధారపడియుండును వస్తువుల ధరలపై, ఆదాయముల కొనుబడిశక్తి, ఉపయోగము నిశ్చయింపబడును కావుననే, ప్రతి సంవత్సరాత్యమందును, ఆ సంవత్సరపు ఆదాయవ్యయముల అంచనా వేయబడుచుండును ఆ లెక్కలనే ఆదర్శముగా చూచుకొని, రాజ్యాంగవేత్తలు తమ దేశములో ఆదాయముల హెచ్చుచేయుటకు తగిన ప్రయత్నములు చేయుట తమ విధి కావున, తగిన సాధక బాధకముల నాలోచించుచుందురు

ఇట్టి ఆదాయపు పట్టీలను తయారుచేయుట మన దేశమునకు క్రొత్త గాదు 1876 నుండియు ఇట్టి పట్టీలు మన దేశమునందు కూడ తయారుచేయబడుచున్నవి అసలు, ఆదాయములందలి మార్పుల నర్థము చేసికొనదలంచినచో, ప్రస్తుత కాలము కన్న ఇంకను ముందు కాలములోని లెక్కలను పరిశీలించిన అవి బాగుగా నర్థమగుకాగలవు మొదటి ప్రపంచ సంగ్రామము నాటికి ముందు మన దేశపు ఆదాయపు పరిస్థితుల చూచినచో, మన పరిస్థితియందేమియు విశేషమగు అభివృద్ధి కన్పడుట లేదు ఇందులకు ఈ దిగువ సంఖ్యలే నిదర్శనము

లెక్కల తయారు చేసినవారు	ఏ సంవత్సరమునకు	లెక్కింపబడిన మనిషి ఒక్కనికి సరాసరి ఆదాయములు
దాదాభాయి నౌరోజి గారు	1868	రు 20/-లు
బేరింగ్ అండ్ బార్బరు గార్లు	1882	రు 27/-లు
లార్డు కర్జన్	1897-98	రు 30/-లు
విలియమ్ డిగ్బిగారు	1899	రు 18/-లు
అట్కిన్సన్ గారు	1895	రు 35/2/-లు
బి ఫ్లెన్ శిరస్ గారు	1911	రు 50/-/-లు
వాడియా అండ్ జోషీగార్లు	1913-14	రు 44/3/-లు
షకీల్ అండ్ మురంజన్ గార్లు	1910-14	రు 58/5/-లు

పరిపూర్ణమగు శాంతి పరిస్థితు లప్పుడే (1868 లో), మన దేశపు టాదాయములు సరిసరి, రూ 20/-లయి యుండెను అయినను, మహత్తరమగు ప్రపంచసంగ్రామ కాలమందుగూడ ఆదాయములు 58-5-0 కన్న హెచ్చు లేదు దీనికి కారణమేమని ప్రభుత్వమునందా కాలమున నెవ్వరును ఆలోచనచేసియుండలేదు.

మొదటి సంగ్రామమునకును (1914) రెండవ ప్రపంచయుద్ధమునకును (1939) మధ్యకాలమందలి పరిస్థితులుగూడ నిట్లే ఉన్నది. ఈ కాలమందలి లెక్కలను శ్రీ ఫ్రిండ్లే షిర్రాస్ దొరగారును (*Frindlay Shirrahs*), షా అండ్ కంబెట్టా గార్లును (*Shaw and Khambetta*) తయారు చేసియుండిరి. కాని వీరి లెక్కలయందు తేడా కన్పడుచున్నది. షిర్రాస్ లెక్కల ప్రకారము ఈ కాలమందు మన దేశీయుల సరాసరి ఆదాయము 107/-రూ. లుగా లెక్కించబడెను. కాని అదే కాలములో షా అండ్ కాంబెట్టాల లెక్కల ప్రకారము 74/- రూ.లుగనే అంచనా వేయబడెను. ఇట్టి తేడాలు కల్గుటకు అనేక కారణము లుండవచ్చును. అందువలననే ఆదాయపు పట్టీలను తయారుచేయుట కష్టముగా ఎంచబడుచున్నది.

రెండవ ప్రపంచ సంగ్రామానంతరము డా॥ వి. కె. ఆర్. వి. రావుగారు (*Dr. V. K. R. V. Rao*) శాస్త్రీయమగు పద్ధతులపై ఇదే లెక్కలను తయారుచేసియుండిరి. వీరు 1925-29 సంవత్సరములలో మన ఆదాయములు సరాసరి 76 రూ.లుగా నున్నప్పటికి 1931-32 నాటికి ఆదాయములు పెరుగుటకు బదులు 62 రూ లకు పడిపోయినట్లు అంచనా వేసియుండిరి

ఈస్టర్ను ఎకానమిస్టు (*Eastern Economist*) పత్రికయందు 1939-40 నుండి 1945-46 సంవత్సరములవరకు మన ఆదాయముల నొక విలేఖరి ఈ విధముగా లెక్కించియుండెను

1939-40	67	రూ లు
1940-41	70	,,
1941-42	78	,,
1942-43	112	,,
1943-44	139	,,
1944-45	139	,,
1945-46	137	,,

ఈ సంఖ్యలన్నియు అవిభక్తమైన భారత దేశపు ఆదాయపు లెక్కలేగాని విభక్తమైన హిందూదేశమున కనువర్తించవు కాబట్టి, హిందూదేశమునకు గూడ ఇప్పుడు ప్రత్యేకపు లెక్కల తయారు చేయవలసియున్నది అందువలన 1931-32 సంవత్సరమును ఆధారసంవత్సరముగా తీసికొని డా॥ వి కె ఆర్ వి రావుగారు మనదేశపు మొత్తపు టాదాయములను 12,240 మిలియన్ రూపాయిలుగను మనిషి ఒక్కంటికి 61 రూ॥లు సరాసరి ఆదాయములుగను లెక్క వేసియుండిరి ఈ లెక్కల ఆధారముతో 1947-48 సంవత్సరమునకు గూడ మనము ఈ లెక్కల తయారు చేయవచ్చును

నేటి మనదేశపు ఆదాయములు 49 328 మిలియను రూపాయిలుగా లెక్క వేయబడియున్నది దీనికి మరి 400 మిలియన్ రూపాయిలను నిర్దేశనాదాయములుగా (*Imputed incomes*) కలుపవలెను అనగా మన ఆదాయములు 49 728 మిలియన్లగుచున్నవి దేశమునందలి జనాభా లెక్కల జూచినచో నేటికి మనదేశమున 233 మిలియన్ ప్రజానీక మున్నట్లు లెక్కపడుచున్నది అనగా మన సరాసరి ఆదాయములు 213 రూపాయిలు మాత్రమే యగుచున్నవి. ఈ స్వల్పాదాయముల నిరుపయోగత నర్థముచేసికొనదలంచినచో, ఇదే కాలములో విదేశముల ఆదాయముల పరీక్షించవచ్చును

1947 లో విదేశములలో సరాసరి ఆదాయములు

ఆస్ట్రేలియా	2,160	రూ॥లు
కెనడా	2,826	,,
డెన్మార్కు	2,647	,,
ఇంగ్లాండు	2,356	,,
అమెరికా	4,643	,,
సిలన్	300	,,
పాకిస్థాన్	225	,,
ఫిలిప్పైనులు	278	,,
హిందూదేశము	213	,,

మనదేశమువలెనే, మొన్న మొన్నటివరకు బానిసలుగ యున్న సిలోన్, పాకిస్థానులందు గూడ సరాసరి ఆదాయములు మనదేశముకన్న హెచ్చుగనే యున్నవి పాకిస్థాన్‌లో సరాసరి ఆదాయములు హెచ్చుగానుండుటకు కారణము నూటికి 38 వంతుల భూమి సేద్యము చేయబడుచుండుటయే యని గమనించవలెను మనదేశమునందు నూటికి 20 వంతులు భూమిమాత్రమే వ్యవసాయమున కుపయోగింపబడుచున్నది

ఎవరికైనను, వారి ఆదాయములవలన గల్గు లాభముల కొలువవలెనన్నచో, వస్తువుల ధరలతో సరిపోల్చి చూడవలసి యుండును ధరలలో మార్పులు గల్గినప్పుడెల్ల ఆదాయములవల్ల లాభములు గూడ మారుచుండును ఆర్థిక సలహాదారుని సూచిక లెక్కల ప్రకారము (*Economic Advisor's Index*) 1939 సంవత్సరమును ఆధారముగా తీసికొని 1947-48 లో సరకు ధరల సూచీ సంఖ్య 307 గా తేల్చబడెను అనగా 1939 కన్న (అప్పటి సూచీ సంఖ్య 100 కాగలదు) 1947-48 లో ఆ సంఖ్య 3 07 రెట్లు పెరిగినదన్నమాట 1939 కన్న, 1947-48 నాటికి వస్తువుల ధరలు 3 07 రెట్లు పెరిగినవన్నమాట కాని అదే కాలమునకు మన సరాసరి ఆదాయములు 70 రూ॥లు మాత్రమే పెరిగియున్నవి అయినచో, మన నిజస్థితియందెట్టి మార్పులు కలుగలేదన్నమాట

దీనికికూడ కారణములు లేకపోలేదు సంగ్రామముల మధ్యకాలమంతయు కంటె, నేడు మన జనసంఖ్య చాల పెరిగియున్నది 1931-32 లో 198 మిలియన్లుగానున్న జనాభా నేటికి 233 మిలియన్లగునటు పెరిగి పెద్దదయినది అనగా 16 సంవత్సరముల కాలములో నూటికి 18 వంతులు లేక 35 మిలియనులు జనాభా అధికమయినను, మన సరాసరి ఆదాయములు మాత్రము రూ 51 నుండి రూ 70 ల వరకే పెరిగెను

1947-48 లో మన ఆదాయములలో 55.2 వంతులు వ్యవసాయమునుండి వచ్చియుండెను. (27 432 మిలియన్లు) అనగా వ్యవసాయపు వృత్తియందలి సరాసరి ఆదాయములు రూ 118 లుగా నిర్ణయించవచ్చును మన దేశీయుల నేటి సరాసరి ఆదాయములు 213 రూ లయినప్పుడు అందులో 118 రూ॥లు వ్యవసాయము మూలముననే కల్గుచున్నవి పరిశ్రమలనుండి మొత్తము 10 476 మిలియన్లు ఆదాయము కల్గుచున్నది. అనగా 21 3 వంతు లన్నమాట

వ్యవసాయము, పరిశ్రమలుగాక ఇతర వృత్తులనుండియు, వాణిజ్యమునుండియు, రాకపోక మార్గములనుండియు మొత్తముపై 8,456 మిలియను రూ॥లు ఆదాయము వచ్చుచున్నది. అనగా మొత్తములో 17 5 వంతు లన్నమాట. అందువలన ఈ వృత్తులయందు సరాసరి ఆదాయము 35 రూ॥లుగా లెక్కించవచ్చును

ఈ లెక్కలను 1931-32 సంవత్సరపు సంఖ్యలతో సరిపోల్చినచో, నేటి ఆదాయపరిస్థితి ఉత్సాహజనకముగా దని చూపించవచ్చును

ఈ వివిధ పట్టీల నాధారముగా చేసికొని 1947-48 లో మన మొత్తపు ఆదాయము 49,728 మిలియను రూపాయిలుగాను, సరాసరి ఆదాయము 213 రూ॥లుగను లెక్క వేయబడినది. యుద్ధపూర్వము ధరల చూచినచో మన ఆదాయము 70 రూ॥లు మాత్రమే పెరిగియున్నది. అదే సమయమందు వస్తువుల ధరలు మాత్రము 3 07 రెట్లు పెరిగినప్పుడు, ఆదాయములు పెరిగినను, ఈ హెచ్చు ధరలందు సమానలాభము కల్గించునంతగా మాత్రము పెరుగలేదు మన నిజస్థితియందును ఎట్టి మార్పు కలుగలేదు

ద్రవ్యోల్బణము మూలకముగా హెచ్చు పెరిగియున్న ధరల మున్ముందు తగ్గించవలెనని యుండును వ్యావసాయిక పారిశ్రామికాభివృద్ధుల ద్వారా, వస్తూత్పత్తి నధికము జేయనిచో దేశీయుల ఆదాయముల హెచ్చుచేయుట కష్టమగును వస్తువుల ధరలతోపాటు ఆదాయముల గూడ పెంచగలిగినప్పుడే దేశసౌభాగ్యము కూడ పెంపొందగలదు ధరల తగ్గించు నవకాశముల నదుపుచేసికొని, భారతీయుల జీవితప్రమాణముల హెచ్చుచేయగల ప్రయత్నము లీ సంవత్సరమున జరుగగలవని ఆశించవచ్చును

వృత్తులు	సంవత్సరము	రాబడి	సంవత్సరము	రాబడి
వ్యవసాయము	1931-32	52 8%	1947-48	56 2%
పరిశ్రమలు	,,	16 9%	,,	21 3%
ఇతర వృత్తులు	,,	22 6%	,,	17 2%



గవర్నర్ జనరల్ రాజగోపాలాచారిగారితో, ఆఫ్ఘన్ ఇరాన్ వ్యాపార రాయబారవర్గ ప్రతినిధులు.

భారతీయ శాసనసభలో

(9 వ పేజీ తరువాయి)

టీ కమిటి ఒకదాన్ని నియమిస్తుంది మనదేశం నుంచి విదేశాల కెగుమతిచేసే వస్తువుల్లో తేయాకు ప్రధానమైనది కాని ఇటీవల భారతదేశంతో సింహళం, ఆఫ్రికా పోటీచేస్తున్నందువల్ల మన ఎగుమతి క్రమంగా తగ్గుతోంది దీనికి కారణాల్లో ముఖ్యమైనవి, ధర ఎక్కువ కావడం, నాణ్యం తగ్గడం

అందువల్ల ఇకనుంచి తేయాకు పంటకు వృద్ధిపరచడానికీ, ఎగుమతి పెంచడానికీ ప్రభుత్వం తేయాకు పరిశ్రమ పైన కొంత అధికారం తీసుకోవడం అవసరమని తలిచి ప్రస్తుత శాసనం ప్రవేశపెట్టారు ఈ కమిటీలో తోటల యజమానుల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు, ఎగుమతి వ్యాపారుల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు నియమించబడతారు శాసనాన్ని ఒక సెలక్టు కమిటీ పరిశీలన కొప్పగించారు

మనోవృత్తి నియమాల సవరణ

శుక్రవారంనాడు అనధికార ప్రతిపాదిత శాసనాలపై చర్చ జరిగింది

భర్త మరొక స్త్రీని వివాహంచేసుకున్నా, లేక ఒక స్త్రీని ఉంచుకున్నా భర్తతో జీవించడానికి భార్య నిరాకరించినప్పటికీ భర్త మనోవృత్తి నిచ్చితీరాలని ఒక నియమం విధిస్తూ, క్రిమినల్ ప్రొసీజర్ కోడుకు శ్రీ ఆర్ కె సిధ్వా గారు ప్రతిపాదించిన సవరణ భారతీయ శాసనసభ చేత ఆమోదించబడింది

సంరక్షకుల సమ్మతి లేనిదే ఫలాని వయస్సు పైబడని బాలికల వివాహాది విషయాలపై ఇతరులేమీ చెయ్యరాదని ఇండియన్ పీనల్ కోడ్ (శిక్షాప్రమాణ నిర్ణయశాసనం), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (నేరవిచారణ శాసనం) విధించు నియమాలలో వయస్సు ప్రమాణాన్ని మార్పులు చేయాలని ఇదివరలో ఒక విచారణసంఘం కొన్ని సూచనలు చేసింది ఆ సూచనల ప్రకారం అవివాహితబాలికల వివాహాది విషయాలకు సంబంధించిన వయస్సుప్రమాణాన్ని 15 సంవత్సరాలకూ, తదితరులకు సంబంధించిన విషయాలలో వయస్సుప్రమాణాన్ని 18 సంవత్సరాలకూ మార్చవలెనని సూచించుచూ పండిట్ ఠాకూర్దాస్ భార్గవాగారు పై రెండు శాసనాలకూ సవరణలు ప్రతిపాదించారు ఈ సవరణలను శాసనసభ ఒక సెలక్టుకమిటీ కొప్పగించింది

కార్మికులకు ప్రావిడెంట్ ఫండు

కార్మికుల నిమిత్తం ప్రావిడెంట్ ఫండ్ ఏర్పాటుచేయని వ్యాపార, పరిశ్రమాది సంస్థలు నిర్బంధంగా ప్రావిడెంట్ ఫండ్ ప్రారంభించాలని విధిస్తూ ఒక శాసనాన్ని శ్రీ ఆర్ కె సిధ్వా గారు ప్రతిపాదించారు ప్రభుత్వమే స్వయంగా ఇట్టి శాసనం ఒకదానిని ప్రతిపాదించ యత్నిస్తున్నదని, తెలుపుతూ, ప్రజాభిప్రాయం తెలుసుకునే నిమిత్తం ప్రచురించాలనీ, అంతవరకూ చర్చ వాయిదా వేయాలనీ శ్రీ సత్యనారాయణ సింహా గారు ఒక సవరణ ప్రతిపాదించగా సిధ్వాగారు అంగీకరించారు

నిర్బంధ సేవానిషేధం

నిర్బంధంగా వ్యక్తులచేత చాకరీ చెయించుకునేవారిని శిక్షించాలనే నియమాన్ని విధించాలని సూచిస్తూ ఒక శాసనాన్ని శ్రీ ఆర్ కె సిధ్వాగారు ప్రతిపాదించగా, దీన్నికూడా ప్రజాభిప్రాయం తెలుసుకునే నిమిత్తం వాయిదా వేయాలని శ్రీ సత్యనారాయణసింహాగారు సవరణ ప్రతిపాదించగా ఆమోదించబడింది నిర్బంధంగా చాకిరిచేయించే పద్ధతి చెన్నరాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో, ముఖ్యంగా కొండప్రాంతాల్లో ఇంకా ఉందనీ, బీహారు, ఒరిస్సా రాష్ట్రాల్లోకూడా ఉందనీ సిధ్వాగారు చెప్పారు ఇటువంటి శాసనం ప్రతిపాదించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఒక ప్రత్యేకోద్యోగిని ఇదివరలో నియమించిందనీ, ప్రభుత్వమే స్వయంగా ఒక శాసనం ప్రతిపాదిస్తుందనీ సత్యనారాయణ సింహాగారు చెప్పారు

నేరవిచారణ కేసుల్లో హైకోర్టుల తీర్పులకు విరుద్ధంగా అప్పీళ్లు విచారించే అధికారాన్ని ప్రీవీకౌన్సిల్ నుంచి ఫెడరల్ కోర్టుకు మార్చాలని సూచిస్తూ పండిట్ భార్గవాగారు ప్రతిపాదించిన శాసనం సెలక్టుకమిటీ పరిశీలనకు ఒప్పగించబడింది

మతాంతర వివాహాలు

హిందువులు, సిక్కులు, జైనులలో మతాంతర వివాహాలను అంతర్వర్గవివాహాలను శాసనసమ్మతం చేయాలనే ఉద్దేశంతో పండిట్ భార్గవాగారు ప్రతిపాదించిన మరొక శాసనంకూడా సెలక్టుకమిటీ పరిశీలన కొప్పగించబడింది

అబ్రహాం లింకన్

(8 వ పేజీ తరువాయి)

కన్వెన్షన్ సమావేశమయింది అధ్యక్షస్థానానికి అభ్యర్థులను ఆ సాయంత్రమే నిలబెట్టాలి కాండిడేట్లు ఎవరా అన్న అనుమానమైనా ఇంతవరకూ లేదు సీవర్డు అనే అతన్ని కన్వెన్షన్ వారు ఏకగ్రీవంగా ఎన్నుకొంటారనే అందరూ అనుకున్నారు హైళ్లలో ఊర్కే చేతు లెత్తించి లెఖ్కలుపెడితే, సీవార్డుకు 860, లింకన్‌కు 144, తక్కిన అందరికీ కలిసి 289, ఈ విధంగా గాలప్‌పోల్స్ తేలాయి సభలో వోటింగ్ కేవలం లాంఛనానికి జరగాల్సిందే అన్నట్టుగా ఉంది ఆ సాయంత్రం సభ అయితే సీవార్డు అధ్యక్షుడవ వలసిందే

కాని వోటింగ్ ఫారాలు ఆ సాయంత్రానికి అచ్చుఅయి రాలేదు అరగంటమాసినా గంట చూసినా కబుర్లు పంపించినాకూడా అచ్చుఫారాలు రాలేదు సరేనని మీటింగు మర్నాటికి వాయిదా వేశారు ఆ ప్రెస్ మేనేజరు బద్ధకం కూడా అల్లా అబ్రహాంలింకన్‌కు తోడయ్యాడు

కాస్త ఆ రాత్రి తీరుబడి దొరికేటప్పటికి అబ్రహాం మిత్రబృందము, అత్యద్భుతంగా కాన్వాసింగు సాగించారు లింకన్‌పక్షాన్న కొన్నికొన్ని బేరాలుకూడా ప్రతినిధులతో రాజకీయంగా సాగించసాగారు లింకన్ ఇంటిదగ్గిర 150 మైళ్ల దూరాన ఉన్నాడు కాని ఇల్లాంటిదేదో సాగుతుందని పసిపట్టాడు "ఓట్లకోసం నాపక్షాన ఏమీ హామీ లిచ్చి నాకు బంధాలు కలిగించవద్దు" అని స్నేహితులకు తంతి ఇచ్చాడు వాళ్లకు ఒళ్ళు మండుకొచ్చింది "అయినా అప్పటి మాట చూసుకుందాంలే, అంతగా అయితే వేం అనలేదనవచ్చు" అనుకొంటూ తమ పని తాము సాగించారు పెన్సిల్వేనియా, ఇండియానాలకు రెండుమంత్రిపదవులూ ఇస్తామని ఆరెండు బ్లాకుల ఓట్లూ సంపాదించారు బాహిమోా అదే పంథా పట్టారు మర్నాడు ఓటంగులే మొత్తం 466 వోట్లకు లింకన్‌కు 354 ఓట్లు వచ్చాయి డెమోక్రటిక్ పక్షం అప్పుడు మరి చీలికల్లో ఉంది రిపబ్లికన్ పక్ష అభ్యర్థికే అధ్యక్షస్థానం సుకరంగా ఉంది ఆ వీలుతో అబ్రహాం లింకన్ అమెరికన్ అధ్యక్షుడయ్యాడు అయితే అంతవరకు సాయంచెయని లక్షణాలు, అతని సచ్ఛీలమూ, ఇత్యాదులు - అతన్ని ఆస్థానంలోనే అల్లా జేగీయమానంగా నిలిచేట్లు చేశాయి

హైదరాబాదులో జాగీర్లకు

(10-వ పేజీ తరువాయి)

వెయ్యబడింది వడ్డీవ్యాపారుల బారినుంచి (హైదరాబాద్‌లో వడ్డీవ్యాపారులలో అధికులు అరబ్బీలు పఠాన్లు) రైతులను రక్షించడానికి 1939 లో సహకార పరపతి సంఘలు స్థాపించడానికి యత్నం జరిగింది కాని రైతుల పరిస్థితులు బాగా లేకపోవడం వల్ల ధాన్యపుబాంకులు స్థాపించడం మంచి దన్నారు వానిని స్థాపించారు. ఈ బాంకులు పెట్టుబడికి ఋణాలిస్తాయి విత్తనాల నిస్తాయి

కాని తరవాత, మొత్తం పంటలో ఎనిమిదోవంతును వడ్డీగా వసూలుచేస్తాయి ఇవి క్రమంగా వ్యాపారుల చేతుల్లో పడ్డాయి రైతుల బాధలు తప్పలేదు భూములు కుదవపెట్టడం తప్పలేదు. వడ్డీ వ్యాపారుల పనినే ఈ బాంకులు చేస్తున్నాయి

సంస్థానంలో దాదాపు నూరింట 61 వంతులు గ్రామాల్లో వ్యాపించి ఉన్నాయి మొత్తంపైన రైతుల్లో నూరుఎకరాలకు లోబడినవారు క్రమక్రమంగా ఋణగ్రస్తులుకాక తప్పింది కాదు

యజమాని శ్రద్ధలేక భూమి నిస్సారమై పోతోంది రైతు పెట్టుబడి పెట్టలేడు భూమి మరమ్మతులనిమిత్తం వెంటనే కొన్ని లక్షల రూపాయిలు వెచ్చించవలసిన అగత్యం ఉంటుంది సంస్థానంలో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వంటి రిజర్వాయిర్లున్నాయి రసాయనిక ఎరవుల ఫాక్టరీ పెద్దదొకటి ఉంది ఇవి రైతుల కుపయోగపడాలి సంస్థానంలో వేరుసెనగ అపారంగా పండినా వ్యవసాయంలో రైతులు పిట్టు ఆటే ఉపయోగించలేకుండా ఉన్నారు

రైతుల్ని ఋణబాధనుంచి రక్షిస్తే హైదరాబాద్‌లో వ్యవసాయవృద్ధికి మంచి అవకాశాలున్నాయి సంస్థానంలో ముఖ్యమైన ఆహారపు పంట జొన్న అరువాత వరి వేరుసెనగ అపారంగా పండుతుంది కందులు మొదలైన ఆహారదినుసుల్ని చాలా పండిస్తారు పత్తి పండుతుంది పత్తి పండడానికి అవసరమైన నల్లనేల ఉంది

అయితే సంస్థానం అంతటా నీటివసతులు చాలా వృద్ధిపరచవలసి ఉంది ఇప్పటి-రకు పంటలకు రైతులు వర్షాలపైనే ఆధారపడుతున్నారు ఇందువల్ల ప్రతి అయిదేళ్ళలో రెండేళ్ళు అనావృష్టి వల్ల పంటలు పాడు కావడం, ప్రతిపదిసంవత్సరాల్లో ఒక సంవత్సరం కాటకం సంభవిస్తున్నాయి ఇక్కడ ఇప్పటకీ కాటకం రాకుండా చేయగల అవకాశాలున్నాయి దీనికి నీటివసతుల వృద్ధిపరచడం ఒకటి రైతుల్ని ఋణవిముక్తుల్ని చేసి సులువుగా పెట్టుబడి దొరికే విధం చూపడం ఒకటి ముఖ్యావసరాలు ఈ సమస్యలు భారతదేశంలో రైతులందరికీ ఉన్నాయి కాని పెట్టుబడికి ఇక్కడ ఉన్నంత ఇబ్బంది లేదు అయితే మిగతా రైతుల్లోపాటే, హైదరాబాద్ రైతులికీ ఈ రెండు సమస్యలూ పరిష్కారం కాగల అవకాశం ఉంది దానికి ప్రధానమైన ఆటంకం జాగీర్ల పద్ధతి ఈ పద్ధతి రద్దుకావడంతో హైదరాబాద్ రైతులకు పై సమస్యలు పరిష్కరించుకోడానికి వీలేర్పడుతోంది

చీనాలో అంతర్యుద్ధం

(5 వ పేజీ తరువాయి)

పైన సమాఖ్య వ్యవహారాలు విధించడం మా ఉద్దేశం కాదు వాస్తవానికి వ్యక్తిగతకృషినీ, పోటీపైన ఉత్పత్తి వృద్ధినీ ప్రోత్సాహ పరచడం మా ఆశయం మా అధీనంలో ఉన్న ప్రాంతాల్లో పారిశ్రామిక వ్యాపారాది విషయాల్లో విదేశీయులు కూడా పెట్టుబడిపెట్టి వృద్ధి పరచడానికి పరస్పరాంగీకారంతో వారిని ఆహ్వానిస్తాం కూడా

"మేము ప్రజాస్వామ్య సూత్రాల్ని విశ్వసిస్తాము నియంతృత్వం లేకుండా, ప్రభుత్వపక్షం మూడువందల బలంతో ఒకవంద బలం ప్రత్యర్థిపక్షాలతో ప్రభుత్వం నడపాలనే పద్ధతిని అంగీకరిస్తాం మాపద్ధతులకీ రష్యన్ సోవియట్ పద్ధతులకీ చాలా వ్యత్యాసముంటుంది మా ప్రజాస్వామ్యంలో భూస్వాములు, వర్తకులు, పెట్టుబడికి ధనవంతులు, మధ్యతరగతివారు, కార్మికులు, కృషికులు అందరూ ఉంటారు"

పశ్చిమదేశాల్లోని కమ్యూనిస్టుపార్టీలకి చీనాదేశంలో కమ్యూనిస్టుపార్టీకి ఒక ముఖ్యమైన భేద ముంది చీనా కమ్యూనిస్టుపార్టీ మిగతావాని మాదిరిగా ప్రభుత్వానికి ప్రత్యర్థిగా, మైనారిటీ పార్టీగా ఉండి ప్రభుత్వం చేసే పనినెల్లా విమర్శిస్తూ కూర్చోవడం వీరి పని గాదు స్వయంగా తమ ప్రాంతాన్ని పరిపాలించుకుంటున్నారు కొద్దిమంది పల్లెజనులతో ప్రారంభమై ఇప్పుడు 15 కోట్లమందిని పరిపాలిస్తున్నారు విరోధుల తీవ్రప్రతిఘటన కెదురై నిల్చి నిర్వహించుకొస్తున్నారు లక్షలాది వ్యవసాయదారులు, కార్మికులు ప్రభుత్వంపై విశ్వాసం కలిగి అండగా ఉన్నారు కొమింటాంగ్‌లో దళాలకి దళాలు సైనికులు ప్రభుత్వాన్ని విడిచి కమ్యూనిస్టుల్తో చేరిపోతున్నారు

ఈ పరిస్థితిలో చాంగ్ కై షేక్‌కు అమెరికా ఎంత సహాయంచేస్తుందో చెప్పడం కష్టం కాని ఆయుధపరికరాల్నివ్వడం చాలదు. స్వయంగా కొమింటాంగ్ పక్షాన అమెరికన్లు యుద్ధం చేసినప్పుడే కమ్యూనిస్టుల దండయాత్ర నరికట్టడానికి వీలుపడుతుంది గాని వేరువిధంగా ఆపతరం కాదు కొమింటాంగ్ ప్రభుత్వం ఇంక నిలవలేదు జపనీస్‌కు విరుద్ధంగా గోరిల్లా యుద్ధంలో అపారానుభవం గడించిన కమ్యూనిస్టుల్ని అమెరికన్ మిలిటరీ సహాయంతోనైనా సరే జయించడం దుర్ఘటం

ఏ జోక్యం లేకుండా చీనాదేశస్థుల్ని వారి భవిష్యత్తు నిర్ణయించుకోడానికి విడచిపెట్టినట్లయితే ప్రజల కిప్పుడు మూడే మార్గాంతరాలున్నాయి 1 దేశ విభజన, 2 కమ్యూనిస్టు ఆక్రమణకు సమ్మతి, 3 ఉభయపక్షాలమధ్య ఒడంబడిక

దేశవిభజన సులువే కాని అంతతో ఎవరూ ఊరుకోరు రెండో పద్ధతికి కమ్యూనిస్టులే అంగీకరించరు అంటే పూర్తిగా తమ నియంతృత్వం విధించాలని వారి కిప్పుడూ కోరిక లేదు ప్రభుత్వంలో మూడోవంతు ఏ రాజకీయపక్షానికైనా ఇస్తారు

ఇక సమాధానం ఒక్కటే మిగిలింది కొమింటాంగ్ పార్టీలో కొందర్ని తొలగించి, పార్టీని సంస్కరించి దానితో గాని, లేక ఇతర మితవాద రాజకీయ పక్షాలతో గాని కమ్యూనిస్టులు సఖ్యత చేసుకోవాలని చీనాదేశ ప్రజల్లో అత్యధిక సంఖ్యాకులు కోరుతున్నారు

ఇప్పుడు అమెరికా జోక్యం చేసుకున్నా చేసుకోకపోయినా సరే తత్ఫలితాలెలా ఉన్నా సరే, ఏదో మరొక మధ్యమార్గం అనుసరించినా సరే చీనా ప్రజలు తమ కనువైన పరిష్కారమార్గాన్నే మొత్తంమీద అనుసరిస్తారు గాని, అన్యులు సూచించే పద్ధతులు వారికి నచ్చవనే విషయం స్పష్టపడుతోంది అన్యదేశీయుల ఉత్తరువుల్ని వారు పాటించబోరు దేశీయ పారిశ్రామికాభివృద్ధి వారి ప్రథమకర్తవ్యం దీనికి పశ్చిమదేశాల (అమెరికా బ్రిటన్ మొదలైనవి) సహాయాన్ని చీనాకోరకుండా గదు ప్రజల ఆర్థికస్థితిని చక్కబరచడానికి పశ్చిమదేశాలే వీరికి తోడ్పడగలిగేవి

[యునైటెడ్ నేషన్స్ వర్ల్డ్, లేక ఐక్యరాజ్య ప్రపంచం అనే ఆంగ్ల పత్రికలో మైకేయల్ క్రాస్‌ఫీల్డ్ అనే పత్రికావిలేఖరి వ్రాసిన వ్యాసం]

గ్రంధ సమీక్ష

'లీలాసుందరి'

రచయిత శ్రీ చింతాదీక్షితులు త్రివేణి ప్రచురణలు, మచిలీపట్నం, వెల తెలియదు

ఇది చిన్న పిల్లల పుస్తకం బాలబాలికలకు అనువైన సారస్వత రచనలో సిద్ధహస్తులైన చింతా దీక్షితులుగారు దీనిని వ్రాశారు పిల్లల అభిరుచులను స్వభావాన్ని చక్కగా తెలిసికొన్నవారు తప్ప ఈలాంటి రచనలలో కృతకృత్యులు కాలేరు చెప్పేకథ సులభంగా అర్థం కావాలి రసవంతంగా ఉండి ఆసక్తిని కలిగించాలి కల్పనాశక్తిని పెంపొందించాలి కంటికి ఆకర్షణీయంగా ఉండాలి ఈ దృష్టితో పరిశీలిస్తే ఈ చిన్నపుస్తకం అన్నివిధాలా ప్రశంసనీయంగా ఉన్నదని చెప్పక తప్పదు కథావస్తువు కొంతవరకు పాశ్చాత్య ఫెయిరీటేల్సును అనుకరిస్తుంది లీలాసుందరి అనే రాజకుమార్తెను చీకటి జీభూతం అనే పిశాచం మారురూపంతో ఎత్తుకుపోయి అద్భుతమైన తన విచిత్రభవనంలో దాచి ఉంచుతుంది అక్కడ ఈలాంటి బాలికలు పులులుగాను, చిలుకలుగాను మార్చబడినవాళ్లు అనేకులు ఉంటారు లీలాసుందరిని ఆ భూతం ఎంతో గారాబంగా పెంచుతుంది ఇంతలో వేటకువచ్చిన ఒక రాజకుమారుడు ఆ అమ్మాయిని చూస్తాడు ఇద్దరూ కలిసి భూతాన్ని బుట్టలో వేసి, ఒక చెట్టు తొర్రలో బంధించి రాజుగారి యింటికి వెళ్లిపోతారు ఇదివరకు జీభూతం ఎత్తుకుపోయిన పిల్లలందరూ రక్షింపబడుతారు కథ కంచికి వెళుతుంది క్లుప్తంగా చెపితే కథ ఇంతే కాని రచనలో చక్కని ప్రతిభ కనబడుతుంది కాగితము, అచ్చుపని, ముఖచిత్రం, బైండింగు చాల అందంగా ఉన్నవి ఈ పుస్తకం చిన్న పిల్లలను అధికంగా ఆకర్షిస్తుందని నిస్సంశయంగా చెప్పవచ్చు

'రవి'

చిన్న ముల్లు - పెద్ద ముల్లు

(11-వ పేజీ తరువాయి)

రెండు ముల్లు లేకపోతే గృహస్థులు లేని గృహం మాదిరే అవుతుంది గడియారంవుండి, యిందులో ఏ ముల్లు లేకపోయినా వెలితిగానే కన్పిస్తుంది చిన్నముల్లు తాను గంటలు చూపుతానని తనే ముఖ్య మనకున్నా, పెద్దముల్లు చిన్నముల్లుకంటె పెద్దదని, దీనికంటె వడిగా తిరుగుతానని, సర్వస్వం తనమీదనే ఆధారపడివుందని గర్వించినా ప్రయోజనంలేదు కాలగతిలో ఒకరికంటె మరొకరు వెనక ముందు నడచినా 12 గంటలకు కలియవలసిందేగా! ఇది గడియార నిర్మాత నిర్మాణసూత్రం సంసారజీవితమూ అంతే ఇంటికి కళ తెచ్చే గృహలక్ష్మి లేకపోయినా, కుటుంబానికి పుష్టి నిచ్చే పురుషుడు లేకపోయినా ఆ గృహస్థజీవితం వెలితిగానే వుంటుంది ఏ లోటుపాటు వచ్చినా, భార్యాభర్తలు సరిదిద్దుకుంటూ, ఒకరి మనస్సు మరొకరు అర్థంచేసుకొని సమిష్టిగా బ్రతికినన్నాళ్లూ జీవితం గడుపక తప్పదు నిత్యజీవితంలో యిరువురి మధ్య అన్యోన్యసహాయం, సుఖానుభూతి, ఏదో సమయంలో తప్పదు యిందులో ఏది లోటు వచ్చినా యీ మానవగడియారం 'టిక్'న ఆగిపోతుంది ఇకనైనా గతించినదానికి వగవక సంసారంలో శకుంతలకు ఆమె వెనకటి స్థానం ఆమెకు యియ్య యింకా ఆలోచిస్తావం!" లే!" అని ఆత్మప్రబోధ

ఏమి తోచిందో కూర్చున్నవాడల్లా చివాలున లేచాడు అప్పటికప్పుడే గోడ గడియారంలో బండికి అరగంట వ్యవధి వున్నట్లు చూశాడు గవర్నమెంటు దర్శమా అని "ఎక్స్‌ప్రెస్" బస్ లో అనుకున్నంత సేపటిలో స్టేషన్ చేరాడు అప్పుడే శకుంతల, పెట్టె, బెడ్డింగు, రంగడు తీసుకురాగా గేటుదాటి ప్లాట్‌ఫారం ప్రవేశిస్తోంది కలకత్తా మెయిల్‌కు గార్డు విజిలిస్తున్నాడు

ఓ ప్రక్క శకుంతల వెళ్లుతూందే అన్న ఆతురత, తనకు తానే బ్రతిమాలడమా అనే అభిమానం అక్కడ కూడా ఎంత చెడ్డా మగపురుషుగా?

అంతలోనే "ఆలోచించడానికి యిది వేళ కాదు శంకరం, వేసిన తప్పటడుగు సరిదిద్దుకో సమయం దాటపెట్టుతే పరితపించేది నీవే!" అని ఆత్మ చేసేది లేక "రంగడూ" అని పెద్దకేక వేశాడు ఎవరా అని ఓ తరపోయి వెను దిరిగి చూశాడు రంగడు చూస్తే శంకరం - తన యజమాని

"అమ్మా! బాబుగారు పరుగెత్తుకు వస్తున్నారు" అనడంతో శకుంతల శంకరాన్ని చూసి తొందరగా రెండడుగులు ముందుకు వేయ సాగింది

అంతలోనే శంకరం సమీపించి "నే పొరపడ్డాను ఉహ్! నే తొందరపడ్డా, శకుంతలా క్షమించవూ!"

"అలా ఆయాసపడుతూ రాకపోతే పాపం! అయినా యిందులో తొందరపడేం దెవ్వరు? నే లేకపోతే స్వేచ్ఛగా! "

"ఇంకా యిక్కడకూడా వేధించాలా! శకుంతలా, యింటికి రావూ?"

"యింటికా? పనికిరానిదాన్ని - నేనా? ఎందుకూ?"

"హుష్! తప్పంతా నాదే! సరేనా?"

"రోగం ముదిరాక ఔషధం ఏం ప్రయోజనం! టిక్కెట్టుకూడా తీసుకోవడమయిందే?"

"వెధవటిక్కెట్టు - అదా మనది కాదంటే టిక్కెట్టుకేం?"

"మళ్లీ మతి చెడుతే 'పో' అంటారేమో!"

"ఓ శ్రీమతీ! స్వదేశస్వరాజ్యంతోపాటు నీకూ సంపూర్ణస్వరాజ్యం యిచ్చాం ఇకనుండి నీయిష్టం యీ మగరాజు కిరీటంలేని మహారాజు అనుకో సరేనా?"

"అలా దారికి రండి!"

"కాలమహిమ—ఏం చెయ్యాలి?"

చిత్రకళాప్రదర్శనము - సమీక్ష

(17-వ పేజీ తరవాయి)

కూడదు ఏసంప్రదాయమునైనా తెలిసి వాడటం మంచిది

ఒకదేశములో పుట్టిపెరిగి ఉచ్చదశకు వచ్చిన లలితకళలు ఆదేశప్రజల అభిరుచులు - అలవాటులు - ఇష్టాఇష్టములు, వాళ్ల నాగరిగత - ఇన్నింటిని మించిన ఒక గొప్ప సత్యమును చాటుతూ ఉంటాయి ఆదేశం ప్రజలకు అవి నిధులు వంటివి పూర్వచిత్రకళలో ఏఏరచనా మార్గములు చిత్రకారులు ఇచ్చిన దివ్య సందేశములను సూటిగా - సులభంగా ప్రజలకు సుబోధకము చేస్తూవచ్చాయో - ఆ రచనామార్గములనండి - సాంకేతికములనండి - సాంప్రదాయములనండి - ఏమన్నా అవి చెప్పినంత సన్నిహితంగా భావములను అన్యసంప్రదాయములు చెప్పలేవు సంప్రదాయంలో అలవాటును కూడా దాటిన - ఆత్మానుభవము - తీపి ఉన్నాయి ఉదాహరణకు తెనుగుపిడ్డలు తల్లులను అమ్మా! అని నోటినిండా పిలవటం మాని - మదర్ అంటే ఎంత తేడా ఉందో - ప్రాక్ ప్రతీచి చిత్రసంప్రదాయములకు అంత తేడా ఉంది రెండూ మాతృపదములేఅయినా అనుభూతి వేరైంది జాతీయ చిత్రరచనామార్గములలో పోవటము భావాన్ని సూటిగా చెప్పటము చిత్రకళలో పాశ్చాత్య వ్యామోహితులు నాకళ్లకు మూగివాళ్లలో అవుపడుతారు పూర్వచిత్రసంప్రదాయములను వినియమము చేసుకోవటము అంటే వెనక్కుపోవటము కాదు అల్లా భావిస్తూన్న చిత్రకారులు కూడా ఉన్నారు అది పొరబాటని మనవి చేస్తున్నాను

మహాత్ముని జీవితము - సందేశములు చిత్రించిన బొమ్మల్లో ఎల్ మునిస్వామి, కె శ్రీనివాసులు, రామగోపాల్ రావుగారల చిత్రాలు బాగున్నాయి కాని నేటి చిత్రకళా ప్రదర్శనములో పెట్టిన బాపూజి సందేశ చిత్రములన్నీ ఛాయాచిత్రములకు నకళ్లు ఆయన సత్యంలో దృఢవ్రతుడు అహింసాధర్మమూర్తి నిత్యవ్రతోపవాసములతో కృశించిన శరీరము ఆయన నడిపిన అసహాయోద్యమ దండిసత్యాగ్రహములతో విశ్వమంతా లోనైన వామనమూర్తి ఆయన జీవితంలో ఎన్ని గొప్పభావములో ఉన్నాయి చిత్రకారులు ఆయన జీవితాన్ని వేశములకు స్వతంత్రమైన అంగభంగిమములు కల్పించి, పూర్వము బుద్ధుణ్ణి శిల్పించి, చిత్రించినట్లు దివ్యరూపాన్ని సృష్టించగలగాలి ఆయన ఛాయాచిత్రములనే యథాతథంగా అనుకరించి, చిత్రించిన చిత్రాలలో ఏవిధమైన క్రొత్తదనమూ లేదు పత్రికలలో ఛాయాచిత్రములకు సంపాదకులు పెట్టిన చక్కని పేర్లనే వాళ్లు పెట్టారు అనువాదము, అనుకరణతప్ప ఈ చిత్రాలలో చైతన్యాత్మకమైన సృష్టి మృగ్యము మహాత్ముని చిత్రముకాని - శిల్పముకాని ఆయన ఆత్మ ప్రతిబింబించేదిగా ఉండాలి, ఈ సందర్భములో జేకబు ఈప్స్టిన్ ఇంగ్లండులో తయారుచేసిన పండిట్ నెహ్రూ మూర్తి శిల్పము - నందలాల్ బోసుగారి మహాత్ముని దండిసత్యాగ్రహయాత్ర చిత్రము స్మరణకు వస్తున్నాయి నందలాల్ బోసుగారి గాంధిజీచిత్రము ఒక గొప్పసృష్టి చిత్రములో ఒక అడ్డగీతపై చేతికర్రతో మహాత్ముడు వంచిన తలతో ఒక అడుగు వేసి నిలుచున్న జైనమహావీరునివలె ప్రశాంతభావముతో ఉంటాడు వెనుకభాగములో చిన్నగళ్లు గీచి ఒక్కొక్కదానిలో ఒక్కొక్క సత్యాగ్రహిని చిత్రించారు పూర్వపు అద్దకములపై చిత్రములను ఇది గుర్తుకు తెస్తోంది ఇట్టి ఓజస్సుతో నిండిన గొప్పచిత్రములు ఇవ్వాలి చిత్రకారులు ఈప్స్టిన్ తయారుచేసిన నెహ్రూశిల్పంలో గొప్ప తార్కికుని తత్వజ్ఞుని-రాజకీయవేత్తను - నాయకుని ఈ గొప్పశిల్పంలో ఒక్క మాటుగా చూస్తాము మొత్తముమీద ఈ ప్రదర్శనంలో ఆయుష్మంతుడైన మునిస్వామి చిత్రాలు అన్నిటికంటే బాగున్నాయి

ఇంకా ప్రదర్శనములో చక్కని కూర్పు చిత్రాలు (*Pattern Pictures*) ఉన్నాయి పాశ్చాత్య సంప్రదాయములలో చిత్రించిన వారిలో కె సి యస్ పణికరు, జి డి పాల్‌రాజు గార లిద్దరు గట్టివాళ్లు

పిల్లల చిత్రములు మరీ బాగున్నాయి వీటిలో మిస్ హెలియరుగారి శిక్షణలో ఆమె విద్యార్థినులు వేసిన బొమ్మలు తమాషాగా ఉన్నాయి ఈమె ఆంగ్లదేశంలో పుట్టిపెరిగి మనదేశము వచ్చి పిల్లల సర్వతోముఖమైన అభివృద్ధికి పాటుపడుతోంది అలు చిన్నపిల్లల చిత్రకళోద్యమ స్థాపకుడు ప్రొఫెసరు సిజక్ ఈయన తన జీవితము పిల్లల పురోభివృద్ధికి ధారపోసిన మహాతపస్వి ఈయన జర్మనీలో పుట్టాడు బీదపిల్లలను వెంట వేసుకుని, అహోరాత్రములు వాళ్లను పరిశీలిస్తూ, చిత్రకళ నేర్పుతూ నెలలు సంవత్సరములుగా ఆ కృషిలో తన్మయుడైనాడు నేడు ఈయనపరిశోధనలు సర్వత్రా గొప్ప మనస్తత్వశాస్త్రజ్ఞులు ఎంతో మెచ్చుకున్నారు ఆయన మూలసూత్రములను అనేకులు వ్యాఖ్యానించారు నేడది ఒక గొప్ప సిద్ధాంతమైనది ప్రొఫెసర్ సిజక్ మాత్రము హిట్లరు నియంతృత్వంలో స్వేచ్ఛకోసము ఆక్రోశించి, గ్రాసవాసోదైన్యములతో కుంగి, కృశించి, మహాసందేశములను లోకానికిచ్చి మరణించాడు ఈయన కృషి పాశ్చాత్యదేశములంతటా వ్యాపించి మానవజీవితములో పరమోత్కృష్టమయిన పిల్లల బాల్యమును అపరూపముగా కాపాడవలెనని గ్రహించారు ఇందులో ప్రదర్శించిన పిల్లల చిత్రములు పిల్లలు తామే స్వయముగా వేసినవి ఈ పిల్లల చిత్రకళాధ్యాపకుల కందరికు సిజక్ సిద్ధాంతములయందు గౌరవాదరములు మెండు పిల్లలు చక్కని చిత్రములు ప్రదర్శించారు వాళ్ల బొమ్మలలో తప్పులుండటం సహజము అధ్యాపకులు తప్పులు దిద్దటము పిల్లల ఆనందాన్ని భగ్నంచేసి కృత్రిమ రూపాలు వేయించుట మని సిజక్ మతము వాళ్ల స్వప్నలోకాలను వాళ్లనే చిత్రించుకోనివ్వాలి వాళ్లే స్వంతంగా చిత్రించడం వలన వాళ్ళ మనస్తత్వాల్లో నిగూఢంగా ఉండే వెలుతురు చూడటానికి భయపడే భావములు అప్రయత్నంగా వాళ్ళ చిన్నిచిత్రాల్లో రూపొందుతాయి ఆవిధంగా శృంఖలముల నుండి అంధకారములో నిండి మనోహృదయాలు వెలుగుదారిని నడుస్తాయి లేతభావములు రెపరెపలాడుతాయి బోదెలలో నీరు వరిమళ్ళ కెక్కినట్లు, బంగారు పంట పండించినట్లు, ఈ చిన్ని భావప్రసంతము మానవజీవితములో బంగారుకలలుకని నావిపారుకోవాలి దేశాభ్యుదయానికి తోడ్పడాలి చిన్నపిల్లల ప్రదర్శనములో ఇంత చక్కని బొమ్మలు ప్రదర్శింపచేసె తోడ్పడిన మిస్ హెలియరు వందనీయురాలు పిల్లల బొమ్మల్లో శ్రీపతి బాలచంద్రన్, చిన్నప్ప వేసిన బొమ్మలు అమాయకంగా ఉన్నాయి ఎన్ సరస్వతిరెడ్డి వేసిన "ప్రాతఃకుసుమములు" అన్న బొమ్మ మరీ బాగుంది ఇంకా జ్ఞానోదయ స్కూలు పిల్లల లతాచిత్రములు బాగున్నాయి బెట్సి మే బ్యూ వేసిన రూపచిత్రము ప్రౌఢంగా ఉంది మేనకారాణి వేసిన అద్దకం లతలు ముగ్గు పోలుకుతూ ఉన్నాయి

ఈ ప్రదర్శనములో ముడుంబ నరసింహాచార్యులుగారి నూతన చిత్రములు అనేకులను ఆకర్షించాయి డి రామలింగేశ్వర రావుగారి చిత్రములు స్వతంత్రముగా ఉన్నవి కూచిభొట్ల నాగేశ్వరశర్మగారి దారుచిత్రము ఎంతో బాగున్నాయి

ఇంకా ఆడవాళ్లు వేసిన బొమ్మలుకూడా చాలా ఉన్నాయి వాటిలో కె పద్మాపతిలు, పద్మానటేశన్, కమలా నటేశన్, తులసి, వాసంతి కృష్ణస్వామి, రత్నాల కమలాబాయి, మీరాబాయి, పలకా విజయలక్ష్మి, పాల్‌రాజు సతీమణిగారల చిత్రాలు మాంతగ్గవి వీరిలో పద్మా - కమలా నటేశన్లు, తులసి, వాసంతి కృష్ణస్వామి, పలకావిజయలక్ష్మి, మీరాబాయి గారల చిత్రములు అనుకరణలేకుండా స్వతంత్రంగా ఉన్నాయి

చిత్రకారులు తమ శిష్యులకు బోధించటంలో వాళ్ల వ్యక్తిత్వమును నశింపచేయకూడదు దిద్దుతూ ఉండటం మంచిది కాదు గురువు అవసరమని తోచినపుడు సలహానిస్తూ కరదీపికవలె శిష్యునికితోడ్పడాలి "చిత్రం వటతరోర్మూలే వృద్ధాః శిష్యాః గురుర్యువా—గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్న సంశయాః" గురుశిష్యులకు ఇంతకన్న గొప్ప ఆదర్శము లేదు లలితకళాశాలలో అధ్యాపకులు ఈ సత్యాన్ని గ్రహించి మెళుకువతో మసులుకుంటే శిష్యులకు మహోపకారు లౌతారు

ఇంకా ప్రదర్శనములో ఎన్నో రూపచిత్రములు, ప్రకృతిచిత్రములు ఉన్నాయి ఇవి చిత్రించినవారు ఛాయాచిత్రగ్రహణ యంత్రము, చిత్రకారుడు ఒకటే అని, నిరూపించినట్లు వేశారు ఛాయాచిత్రగ్రహణయంత్రము నిర్జీవమైనది దానికి స్వతంత్రము లేదు తానుగా అది సృష్టించలేదు దానిని ఉపయోగించేవారి నేర్పుపై దానిఫలితము ఆధారపడిఉంటుంది చిత్రకారుడు సృష్టికర్తవంటివాడు అతని చూపు నిశితమైనది యుగాలు దాటి భూతభవిష్యత్ కాలములను చూడగలడు వర్తమానంలో వేయితంత్రులు విశ్వవిపంచిపై ఆనంద గీతాలు ఆలపించి చిత్రించగలడు సజీవ చిత్రకారునికి నిర్జీవఛాయాచిత్ర గ్రహణయంత్రానికి పోలికలేదు కాని చిత్రకారుడు ఆ యంత్రంగా మారిపోవటము హృదయవిదారకమైన దుస్థితి చిత్రకారులు దూరదృష్టి కనబరచాలి ఇతరులు మెచ్చి విరిమ్ముంచక పూర్వమే మన లోపాలు సవరణచేసుకోవడం మంచిదనే సంకల్పము నన్ను సమీక్షకు ప్రేరేపించింది జీర్ణం జీర్ణం వాతాపిజీర్ణం అన్నట్లు పచ్చి వెలక్కాయ వంటి పాశ్చాత్యచిత్రకళా వ్యామోహం జీర్ణము చేసుకోవాలి నందమన్న పళంగా వెనక్కుపోలేము వెనక్కుపోవటం కాదు మనము చేయవలసిన పని, ముందుకే సాగిపోతూ సింహావలోకనము చేయటం అవసరమని మా చిత్రకారమిత్రులకు చేమోడ్పుతో విన్నవిస్తున్నాను మొత్తంమీద ప్రదర్శనము చాలా బాగుంది మరి దీనితోనే సంతృప్తిపడి ఊరుకో కూడదుకదా! కనక మనలోమనం హెచ్చరించుకొని ప్రజలకు మన నిజస్థితిని తెలపడం ధర్మము

ఆంధ్రుడైన వల్లభాచార్యుడు

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

పూర్వం అనేకులు ఆంధ్రులు తమ అశేష ప్రతిభా సంపదలతో ఖండఖండాంతరముల యందు తమ యశస్సును వెదజల్లిరి. వారిలో నాగార్జునుడు పద్మాకరభట్టు మొదలగు అనేకులు మతప్రవర్తకులుగానూ కవితావాగ్విలాసులుగానూ విశిష్ట సంప్రదాయ ప్రవర్తకులుగానూ విలసిల్లి యుగప్రవర్తకులైరి. అట్టివారిలో ముఖ్యుడు "వల్లభాచార్యులు". ఇతడు 1540 నుంచీ 1560 వరకూ తన మత ప్రచారం చేస్తూ ఉండెను.

ఇతని తల్లి పేరు ఎల్లమ్మ, తండ్రి పేరు లక్ష్మణభట్టు. ఇతని నివాసం ఆంధ్రదేశంలోని గోదావరీతీరములో ఉండు కంకరవాడ గ్రామము. ఇతని కుటుంబం 'వెల్లనాడువారు' అని పేరుతో పిలువబడుచుండెను. యితడు తెలంగబ్రాహ్మణుడు. లక్ష్మణభట్టు తన పత్నితో పాటు ప్రయాణమై అనేక తీర్థయాత్రలు చేయుచూ చివరకు 'కాశీ' ప్రవేశించెను. అక్కడే స్థిరనివాస మేర్పరుచుకొనెను. కొంతకాలమునకు ఢిల్లీ చక్రవర్తి కాశీ ఆక్రమణకు వస్తున్నాడని కాశీలో వదంతులు పుట్టగానే లక్ష్మణభట్టు తన భార్యను వెంట బెట్టుకొని ప్రాణరక్షణార్థము దక్షిణదేశమునకు వస్తూఉంటే చంపారణ్య ప్రాంతములో భార్య ప్రసవవేదనతో నడువలేక నిల్చిపోయినందువలన అతనితో వచ్చిన దాక్షిణాత్యు లతని విడిచి సమీపపట్టణమునకు వెళ్లిరి. కొంత సేపటికి ఆమె ప్రసవించెను. బిడ్డ మృతప్రాయుడుగా ఉన్నందువలన అక్కడనే పారవైచి సమీపపట్టణమునకు వెళ్లెను. మరునాడు చక్రవర్తిఆక్రమణ అబద్ధమని తెలిసికొని లక్ష్మణభట్టు తిరిగి కాశీ వెళ్లుతూ దారిలో మృతప్రాయుడైన కుమారుడు చైతన్యంతో ఉండడం చూచి ఆశ్చర్యపడి ఆ బిడ్డను తీసికొని కాశీ వెళ్లెను. ఆబిడ్డ వల్లభాచార్యనామధేయుడై పెరుగుచూ 11 ఏండ్లవయసుననే ఉపనిషద్వేదనిగమప్రవీణుడై ప్రథమంలో తన 12 వ ఏట మధురాయాత్రచేసి సకల వ్రజప్రాంతమును తన భగవద్భక్తితో ఓలలాడించెను. రెండవసారి యాత్రలో అతడు గృహస్థాశ్రమంలో ప్రవేశించెను. అతని మామగారి పేరు దేవవ్రతుడు. అతని అత్త 'అక్కమ్మ' (అక్కెమ్మ). తన మూడవయాత్రలో అతడు ఆసేతుహిమాచలపర్యంతం పర్యటన చేసి శంకరమతోన్ముఖులగు అనేకులను తన ప్రతిభావిశేషముచే నిరుపమ వైష్ణవుల నొనరించెను.

అతని మూడవయాత్రసందర్భంలో విజయనగరములో కృష్ణదేవరాయలు ఒక బ్రహ్మాండమైన పండిత సభ నేర్పాటు చేసెను. తమ సంప్రదాయోత్కృష్టతను ప్రకటించడమునకు అనేక మతాధిపతులు పండితప్రకాండులు సభకు వచ్చిరి. విద్యాతీర్థుడు మొదలగు అనేక మహాత్ము లచ్చటికి విచ్చేసిరి. అక్కడ జరిగిన వాదనలో శంకర మతానుయాయులతో వైష్ణవులు ఓడడం చూచి వల్లభాచార్యుడు వారి తరఫున వాదించి శంకరమతానుయాయులైన అద్వైతులను నిరుత్తరులను చేసెను. కృష్ణదేవరాయలు సకల పండిత సన్నిధిలో వల్లభాచార్యులకు కనకాభిషేకము చేసెను. విష్ణుస్వామి (ఉత్తర యిండియాలోని ప్రసిద్ధ వైష్ణవపీఠం) పీఠాధిపతియైన బిల్వమంగళుడు వల్లభాచార్యులకంటే సమర్థుడగు వ్యక్తి లేనందున అతనిని కృష్ణరాయల సన్నిధిలో తన పీఠమునకు వారసుడుగా ప్రకటించెను.

అవి ఎల్లెడలా ముసల్మాన్ జయభేరి మ్రోగుచున్న రోజులు. దక్షిణంలోని ఒక్క విజయనగర సామ్రాజ్యమును మినహాయిస్తే ఒక్క హిందూ సంస్థానంకూడా బలంగా లేదు. ప్రక్కనే బాహమనీ మొదలగు రాజ్యము లున్నందువల్ల విజయనగర సామ్రాజ్య స్థితికూడా బాగా లేదు. ఒకవైపున ముస్లిం ముల్లాలు తమ ప్రభుత్వసహాయం చేతనూ, వేరొకవైపున సూఫీలు తాంత్రికులు తమ ప్రచారబలంచేతను హిందువుల మత విశ్వాస భక్తులను సడలించి తమ మతంలో కలుపుకొనుచుండిరి. దక్షిణంలో ఉన్న వైష్ణవప్రచారం ఉత్తరభారతంలో లేదు. యీ పరిస్థితులను గమనించియే వల్లభాచార్యుడు సామాన్య ప్రజానీకంలో హైందవమత ప్రచారమునకై పుష్టిమార్గ మను పేరుతో తన మతప్రచారమును ప్రారంభించెను. తన మూడుసార్లు పరిభ్రమణంలోనను వాదనద్వారా పండితుల నోడించి, భాగవత కథల ద్వారాను తన అనన్యసామాన్య వాగ్ధాటి ద్వారా ప్రజలను కృష్ణలీలా తరంగితులుగా నొనర్చెను. శంకరుని భక్తులైన 'జగం మిథ్య, పలాయనం మిథ్య' అను శుష్కద్వైతుల ననేకులను అనన్యవైష్ణవులుగా నొనర్చెను. తదుపరి గోకులమందే తన ప్రధానపీఠము నేర్పరచెను. అచిరకాలంలోననే వైష్ణవుల కందరకూ గోకులం ప్రధాన తీర్థ మాయెను. అతని శిష్యులందరూ ప్రేమరసపూరితమైన కృష్ణలీలాఖ్యానములను గీతములుగా రచించి శాస్త్రములను గ్రహించలేని ప్రజల్లో వైష్ణవమతప్రేమను వ్యాపింపజేసిరి. రసఖాన్ మొదలైల మహమ్మదీయులూ నిరంకుశ ప్రభువులుకూడా కృష్ణ లీలా పరవశులై భావోద్రేకముతో తామే శ్రీకృష్ణరూపకంగా భావించుకొని అక్కడి గోవులను మేపువారట. అతిస్వల్పకాలంలోనే వల్లభాచార్యుడు వివరించిన భాగవతభక్తి ప్రజల హృదయంలో పాదుకొనెను. ఆ కాలంలో వైష్ణవభక్తియుక్తుడు అథవా కృష్ణలీలావారినిధిలో మునగని హిందువు లరుదు. చివరకు ఎన్ని అత్యాచారములు చేసిననూ ముస్లిం ముల్లాలు ప్రజలను యిస్లాం మతానుయాయులను చేయజాలక పోయిరి.

జగద్విఖ్యాతుడైన సూరదాసు నందదాసు కృష్ణదాసు మొదలగువారంతా వల్లభాచార్యుని శిష్యులే. మీరా మొదలగువారుకూడా వల్లభసంప్రదాయప్రభావపూరితులే. ముఖ్యంగా నేటి హిందీకవితకు మూలపురుషులందరూ వల్లభాచార్యశిష్యులే. వారందరూ వీతరాగులు నిష్కాములు. కృష్ణప్రేమయుతులై సర్వం కృష్ణమయంగా భావించేవారు, అంతా మాయ అనే శుష్కవేదాంతులు మాత్రంకాదు. చాలామంది రాజులు తమ సింహాసనములను విడిచి నిష్కామ ప్రేమతో గోకులసేవకులైరి. అక్బర్ మాన సింహుడు మొదలగువారు భక్తిభావంతో సమర్పించిన ధనమునైనా యీ వల్లభశిష్యులు పరిగ్రహించలేదు. వల్లభుడు బ్రతికియుండగానే అతడు స్థాపించిన సంప్రదాయం ఉత్తరభారత హైందవు లందరినీ దృఢమైన మతానుయాయుల నొనర్చెను. ఉత్తరభారతదేశమును భక్తిరసతరంగిణిలో ఓలలాడించి హైందవోద్ధారకుడైన వల్లభాచార్యుడు విక్రమశకం 1587 యందు తన భౌతికశరీరమును భాగరథియందు త్యజించి బ్రహ్మసాయుజ్యమున కేగెను.

వల్లభాచార్యులు రచించిన ముఖ్యగ్రంథములు భాగవతటీక, బ్రహ్మసూత్రానుభాష్యము, షోడశగ్రంథము, పూర్వ మీమాంసాభాష్యము మొదలగునవి. విష్ణుస్వామి స్థాపించి వల్లభుడు వృద్ధిబొందించిన యీ సిద్ధాంతమును శుద్ధాద్వైత మందురు. సాధనాక్షేత్రములో దీనినే పుష్టిమార్గ మందురు. వీరికి భగవద్గీత బ్రహ్మసూత్రము ఉపనిషత్తులతోబాటు భాగవతము కూడా అతిప్రముఖ మైనది. శంకరాచార్యుడు నిర్వచించే మాయావాదమును వీ రంగీకరించరు. ప్రపంచమంతా సత్ అని వీరి భావన. వీరికి జ్ఞానంకంటే కర్మకాండకంటే భక్తియే అతి ముఖ్యమైనది. కృష్ణస్వరూపుడైన పరమాత్మకు సర్వార్పణ చేయడమే వీరి చరమాకాంక్ష. భావుకులలో భక్తిని రేకెత్తించడమే వీరి కర్తవ్యం. యజ్ఞయాగాదులను వైదికకర్మకాండ ఫలాఫలములను వీరు అంగీకరంచరు. వీరికి కృష్ణప్రేమయే ప్రధానం. స్వర్గసౌఖ్యములు కర్మఫలములు తుదకు భక్తికూడా ప్రేమ తరువాత గౌణవిషయంగానే భావింతురు. బృందావనమే స్వర్గలోకంగానూ, అక్కడి ముంజపొదలనుకూడా యింద్రోపవనవాటికలుగా భావింతురు. యిహలోకసంబంధమైన సకామప్రేమను నిష్కామంగా మార్చి దాంపత్యప్రేమనే వారు భగవత్ప్రేమగా మార్చివేయుదురు. ఈ పుష్టిమార్గంలో చేరిన భక్తులు సన్యాసం తీసికొనవలసిన అవసర మేమీ లేదు. ఈవల్లభానుయాయులకు వైరాగ్యసన్యాసము లవసరంలేదు. కేవలం భగవత్ప్రేమికులై ధర్మభీరువైన ప్రతియొక్కనికీ యిందులో స్థాన మున్నది. ప్రజాసామాన్యం పతితులు కాకుండుటకే యీ సంప్రదాయమును నిర్మించెను గనుక యిందులో అనేక శాస్త్రవిడంబనములకు అనవసర కర్మకాండకు స్థానం కల్పించబడలేదు. కనుకనే సమస్తోత్తరభారతము నందున నచిరకాలములోననే యిది వ్యాప్తిచెందగల్గినది. వల్లభాచార్యుడు ధార్మికంగానే గాక సాహిత్యకంగా చేసిన సేవ అపారం. అతని ధార్మికసేవను యిప్పటికీ అనేకకష్టాలలోకూడా నశించని అతని సంప్రదాయమే చాటుచున్నది. అతడు అనేక గ్రంథములను రచించి శిష్యుల ద్వారా గీతికాసాహిత్యమును అపారంగా రచయింపజేసి హిందీభాష కపారసేవ చేసెను. అతడు సంస్కృతములోనేగాక ప్రాంతీయమైన వ్రజభాషలోకూడా కొన్ని రచనలు చేసి దేశభాషలలో వ్రాయడం హీనంగా భావించు పండితమ్మన్యులకు హితోపదేశం చేసెను గీతికాసాహిత్యమంతయూ అతని శిష్యులద్వారానే పుష్పించి వికసించినది. ఏ రాజు సహాయం లేకుండా అశేషప్రజలను ఆదర్శనిష్ఠులనుగానూ సుశిక్షితులనుగానూ చేసెను. సూరదాసువంటి అనేకులకు అనామకులకు అతడు సముచిత ప్రోత్సాహ మిచ్చి ప్రతిభాయుక్త ధార్మిక ప్రచారకులుగా ఒనరించెను. రాజ్యవిప్లవములతో కలత జెంది నిరాశోపహతులైన ప్రజలను దైవభక్తిపరులనుగానూ, ఆత్మవిశ్వాసవంతులుగానూ చేసెను. భక్తునకున్నూ, భగవంతునకున్నూ ప్రేమద్వారానే సన్నిహితత్వం సుసాధ్యమని, భగవద్భక్తిపరుడైన ప్రతిఒక్కడూ వైష్ణవుడగుటకు అర్హుడనియూ, అన్నిటికిన్నీ ఉత్కృష్టమైనది భగవత్ప్రేమయే యనియూ ఆయన నిర్వచించెను.

మన ఆంధ్రులలో కుమారిలభట్టు అన్నంభట్టు మల్లినాథసూరి, వల్లభాచార్యుడు, నాగార్జునుడు —యిటువంటి ఎందరో మహాత్ములు ప్రాచీన కాలంలోనే తమకీర్తిని ఖండాంతరములవరకూ వెదజల్లిరి. కానీ మనం వారియొక్క ఘనతను తెలిసికొను స్థితిలోకూడా లేము. యింకా ఎందరో మహానుభావులు మేధావులు తమ స్వయంప్రతిభతోనే ఔన్నత్యమును చెందిరి. అట్టి ప్రాచీనౌన్నత్యమును నిలబెట్టి మహాత్ములుద్భవించి మరల ఆంధ్రత్వము నుజ్జ్వలం చేతురని ఆశిస్తాం.



"ఆంధ్రమన్యములో"

ఆర్యా!

ఆంధ్ర మన్యములో ఎటుజూచినా పలువిధములగు సంఘాలు తల లెత్తుచున్నవి. 1. ఏజెన్సీ ప్రజల సంఘము, 2. మాడ్గోలు ఏజెన్సీ ప్రజల సంఘము, 3. వాల్మీకి సంఘము, 4. ఆటవిక జాతుల సంఘములు ఉన్నట్లు తెలుస్తుంది.

ఈలాగు "ప్రత్యేక కక్షలనుబట్టి సంఘాలను స్థాపించుట జాతీయాభివృద్ధికి "నిరోధమే" అని అరణ్యవాసి సంపాదకులు వ్రాసియున్నారు.

పుట్టి మునిగినట్లు ప్రజలను తలో పంథాలో త్రిప్పినచో కలుగవలసినంత పురోభివృద్ధి కలుగజాలదు. ప్రజలలో చలనం కాని సామరస్యము, శాంతి, అభ్యుదయము కలుగవలెనంటే "......సంఘసేవయే పరమార్థం"గా యెంచి కృషి చేయవలెను. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఒకసభలో రాష్ట్రపతి డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు "......ప్రభుత్వమే అన్ని పనులను చేయడము అసాధ్యమని, అందుచేత ప్రజలే సంఘసేవకు కంకణము ధరించా"లని చెప్పినట్లు, ప్రజలమే సంఘసేవకు పూనుకోవాలని నేటికి ఏడునెలల క్రితమే ఊహించినవారమై "ఆంధ్ర అరణ్యవాసుల నేస్తసమితి"ని స్థాపించి పనిచేయుచున్నాము. ఆంధ్ర మన్యములో "నేస్తం" అంటే ఏమిటో, నేస్తత్వమువలన లాభమేమిటో? ఎరుగనివా రుండరు. దీనిలో క్రైస్తవులు, ముస్లీములు, హిందువులు- వెయ్యేల అటవికజాతులవారు, మన్యములో నివసిస్తూవుండే సమతలవాసులగు సోదరులును చేరియున్నారు. ఇంకను చేరుచున్నారు. వీరు సర్వకక్షసామరస్యము గలిగియున్నారు. నేస్తులుగా చేరినదిలగాయెత్తు "నేస్తం!" "ఏమండీ?" "నమస్తే!" అను గౌరవపదములను వాడుకలోనికి పెట్టుచున్నారు. హృదయపరివర్తనము గలిగి హాయిగా జీవిస్తున్నారు. కాంగ్రెసు ఆశయాలను కబుర్లతో కాదు, కార్యరూపములో చూపుచున్నారు. నేస్తుడు అనగా స్వార్థము లేని వాడని అర్థము. నేస్తులలో అంటరానితనం మాయమైనది. గోసంరక్షణకు పూనుకున్నారు. హిందూ సోదరులకు హేయముగానుండు మాంసాదులను విసర్జించి నేస్తులుగా చేరుచున్నారు. వయోజన విద్యను నేర్చుకొనుచున్నారు. ఈ పద్ధతిని వయోజనవిద్య నేర్చుకొనినచో అయిదేండ్లకెల్లా ఇండియాలోని వయోజనులందరూ నేటి మాధ్యమిక తరగతి విద్యను బడయగలరు. ప్రతీగృహము ఒక పాఠశాల, ప్రతీవ్యక్తి ఉపాధ్యాయుడుగాను, విద్యార్థిగాను తయారుచేయుటే ముఖ్యోద్దేశము.


గనుక ఆంధ్రమన్యములోని సోదర సంస్థల వారు సర్వకక్ష సామరస్యమునకును, తమ్ముల ముగా జాతీయాభివృద్ధికిని చేయు ప్రతికార్యమునకు మా హృదయపూర్వక ధన్యవాదాలు. ఏవిధమగు కక్షలు లేని ఒక సంయుక్తమగు సంస్థను అవసరమైతే ఎవరు స్థాపించినా అంగీకరిస్తాము. దూరదృష్టితో ఈలాగు చేయుదురని ఆశిస్తున్నాను.


వి. రామ్‌కాపదలు,
మంప.

ఆర్యా,

నాల్గు, ఐదు, ఆరు ఫారములు హైస్కూలులో చదివితప్పిన, హైయరుగ్రేడు ఉపాధ్యాయులకు. అయిదు సంవత్సరములు సర్వీసుగల వారికి సెకండరీ గ్రేడు ట్రైనింగు సావకాశము యిచ్చుటకు ఏర్పాటు చేయు విద్యాధికారులు, ఇంటరు, బి. యె. కాలేజిలో చదివి తప్పిన సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులకు అయిదు సంవత్సరముల సర్వీసుగల వారికి బి. యి డి. ట్రైయినింగు చదువుటకు సావకాశము గలుగ చేయుట ఉచిత మనియు, ధర్మపద్ధతియునైయున్నది. కావున ఈ విషయమును విద్యాశాఖాధికారులకు వినయపూర్వకముగా విన్నవించుకొనుచున్నాను.


ఇట్లు
టి. ఆర్. గోపాలరావు.






15వ ఆంధ్రనాటకకళా పరిషత్తులో శ్రీ బుర్రా రాఘవాచార్యులు, పి. ఎస్. నటేశం, అద్దంకి శ్రీరామమూర్తి, ఎ. టి. రామానుజులు నాయుడు, శ్రీమతి రాజేశ్వరిదేవిగార్లకు సన్మానము జేసిరి. శ్రీ మానవపెద్ది వెంకట్రామయ్యగారు అద్దంకివారికి సన్మానం జరుపుచున్నారు.

ఇటీవల బ్రిటన్నుండి మద్రాసు రేవుకు దిగుమతిఅయిన ఆరు 'XD' రకం రైలుఇంజన్లలో ఒకటి. వీటినితూర్పుకోస్తా రైలుమార్గమున గూడ్సురైళ్లు నడుపుటకు ఉపయోగించెదరు




తిమ్మనచర్లలో మహాత్ముని వర్ధంతి ఉత్సవం.

వార్తా చిత్రాలు



బళ్లారిజిల్లా పత్రికారచయితల సంఘం; అధ్యక్షులు శ్రీ వి. కె. నరసింహంగారు.



విజయవాడలో అదిభట్ల నారాయణదాసు గారి శిష్యబృందం దాసుగారి వర్ధంతి ఉత్సవం వైభవంగా జరిపారు. ఉత్సవంలో పాల్గొన్న దాసుగారి శిష్యబృందం.

కాశ్మీర్ రంగంలో సాహసోపేతముగ పోరాడి యుద్ధవిరమణానంతరం స్వస్థానమైన అమృతసర్‌కు తిరిగివచ్చిన ప్రథమ పాటియాలా కాల్బలదళానికి హృదయపూర్వక స్వాగతం చెప్పుచున్న దృశ్యం. దళాధిపతి సుఖదేవ్‌సింగ్ గారికి అమృతసర్ కాంగ్రెస్‌కమిటీతరఫున ఖడ్గం బహూకరిస్తూ పండిట్ సాధురాం శర్మగారు ఉపన్యసిస్తున్నారు.



భారత సర్వసేనాని జనరల్ కరియప్పగారికి మద్రాసు కార్పొరేషన్ పౌరసన్మానం చేసినప్పుడు తీసిన ఛాయాచిత్రం. మేయరు రామస్వామినాయుడుగారు, కమీషనర్ నరసింహంగారు సర్వసేనానికి ఇరువైపులా నిల్చుచున్నారు.



Regd. M. No. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7, Thambu Chetty St., G. T. Madras.